
మే 1972 32

సృజన

అధునిక సాహిత్య వేదిక



సృజన

ఆధునిక సాహిత్య వేదిక

ప్రపంచ వ్యాప్తంగా దోపిడీకి వ్యతిరేకంగా
పోరాడుతున్న సంఘటిత కార్మిక శక్తికి
సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా
వీరోచితంగా పోరాడుతున్న వియత్నామ్ ప్రజలకు
మే డే కా ను క గా
యీ సంచికను అంకితం చేస్తున్నం.

—సంపాదకుడు

నిర్వహణ

'సా హి తీ మి త్రు లు'

80 పేజీలు 1 రూపాయి

ముఖచిత్రం

వియట్‌కాంగ్ గెరిల్లా

ప్రతులకు, వివరాలకు:
సృ జ న,
హనుమకొండ
వరంగల్–1 (ఆం. ప్ర.)

సంవత్సర చందా: పది రూపాయలు
అర్ధ సంవత్సర చందా: ఆరు రూపాయలు
విడిప్రతి: ఒక రూపాయి

SṚJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyderabad. Wide Re. No. 182/A4/67, dated 22-9-1967.

వేంకటరమణ ముద్రణాలయము,
జె. పి. ఎన్. రోడ్, వరంగల్–2.

మే డే

కార్మిక కామ్రేడ్స్! మేడే వస్తూంది. తమలో వర్గచైతన్యయుత జీవితానికి మేలుకొల్పుపాడిన దినంగా, మానవునిపై మానవుడు సాగించే సకల విధాల పీడనకూ నిర్బంధానికీ వ్యతిరేకంగా జరిగే పోరాటం యెడలా కోట్లాది శ్రామజీవులను ఆకలి, పేదరికం, దైన్యావస్థలనుండి విముక్తి చేసేందుకుజరిగే పోరాటం యెడలా తమ సంఘీభావాన్ని ప్రదర్శించే దినంగా, ఆరోజున సమస్త దేశాల కార్మికులూ ఉత్సవాలు జరుపుకుంటారు. ఈ మహా సమరంలో రెండు ప్రపంచాలు ఒకదానికొకటి ముఖాముఖి నిలిచివున్నాయి. పెట్టుబడి దారీ ప్రపంచమూ-శ్రామిక ప్రపంచమూ, దోపిడీ బానిసత్వాల ప్రపంచమూ - స్వేచ్ఛా సౌభ్రాతృత్వాల ప్రపంచమూ.

ఒక వైపున వేళ్ళమీద లెక్కబెట్టగలిగిన రక్తపిపాసులైన ధనికులు మోహరించి ఉన్నారు వీరు ఫ్యాక్టరీలను, మిల్లులను, యంత్రాలను, పరికరాలను స్వాధీనం చేసుకు కూర్చున్నారు. కోట్లాది ఎకరాల భూమిని, కుప్పలు తెప్పలుగా డబ్బును తమ సొంత ఆస్తిగా మార్చివేశారు. ప్రభుత్వాన్ని, సైన్యాన్ని తమ సేవకులుగా, తాము కూడబెట్టిన సంపదకు విశ్వాసపాత్రమైన కావలి కుక్కలుగా తయారు చేసుకున్నారు.

రెండవవైపున ఎట్టి ఆస్తికీ వారసత్వంలేని కోట్లకొలది సామాన్య ప్రజలు మోహరించియున్నారు. వీరు ధనిక స్వాముల దగ్గర చాకిరీచేసేందుకు అనుమతిని అర్థించే దుస్థితిలోనికి నెట్టబడ్డారు. వీరు తమ శ్రమద్వారా సమస్త సంపదను సృష్టిస్తారు. కాని తాము బ్రతికి ఉన్నంతకాలం పిడికెడు మెతుకుల కోసం పోరాడాలి. దయాభిక్షగా పని యిమ్మని అడుక్కోవాలి, నడుములు విరిగేటట్లు శ్రమచేసి తమ బలాన్ని, ఆరోగ్యాన్ని బలిపెట్టాలి. పల్లెటూళ్ళలో నివాసయోగ్యంగాని గుడిసెల్లోనూ, పెద్దపెద్ద పట్టణాలలో, నేలమాళిగల్లో, అటకలపైనా, ఆకలితో అలమటిస్తూ, బ్రతుకు వెళ్ళబుచ్చాలి.

అయితే యీనాడు ఎట్టి ఆస్తిలేని యీ శ్రమజీవులు ధనిక స్వాముల పైనా, దోపిడీ దారులపైనా, యుద్ధాన్ని ప్రకటించారు. శ్రమను, వేతనాల

బానిసత్వం నుండీ, పేదరికం నుండీ, విముక్తి చేసేందుకు సకల దేశాల కార్మికులు పోరాడుతున్నారు. సమిష్టిద్వారా, సృష్టించబడిన సంపద కొద్ది మంది ధనికులకు గాక శ్రమించే వారందరికి ఉపయోగ పడగల సామాజిక వ్యవస్థకోసం వీరు పోరాడుతున్నారు. భూములు, ఫ్యాక్టరీలు, మిల్లులు, యంత్రాలు అన్నింటినీ మొత్తం శ్రమజీవుల సమిష్టి ఆస్తిగా తయారుచేయాలని వీరు కోరుతున్నారు. ధనికులు, పేదలు అనే విభజనకు స్వస్తిచెప్పాలని, శ్రమ ఫలితం శ్రమజీవులకే దక్కాలని, మానవ మేధస్సు సాధించిన విజయాలన్నీ, పని పద్ధతులలో కొనిరాబడిన అభివృద్ధి యావత్తూ పనిచేసేవానిని పీడించేందుకు గాక అతని జీవితాన్ని మెరుగు పరచేందుకే వినియోగ పడాలనీ వీరు వాంఛిస్తున్నారు.

పెట్టుబడిపైన శ్రమ సాగిస్తున్న మహాసమరంలో సకల దేశాల కార్మికులూ అనంతమైన త్యాగాలను చేయవలసి వచ్చింది. సుఖతర జీవితాన్ని నిజమైన స్వేచ్ఛను పొందగల హక్కును సాధించడానికై వారి రక్తం ఏరులై పారింది. కార్మికుల శ్రేయస్సుకోసం పోరాడేవారిని, ప్రభుత్వాలు చెప్పనలవి గాని దమనకాండకు గురిచేశాయి, కాని ఎంతటి దమనకాండనైనా లెక్క చేయకుండా ప్రపంచ కార్మికుల సంఘీభావం నానాట పెరుగుతూంది. బలపడుతూంది. కార్మికులు రానురాను ఎక్కువ సన్నిహితంగా ఐక్యమవుతున్నారు. ఈ పార్టీలను బలపరచే వారి సంఖ్య లక్షలాదిగా పెరుగుతూంది. వీరంతా పెట్టుబడదారీ దోపిడీవర్గం పైన సంపూర్ణ విజయం సాధించే దిశలో ఒక్కొక్క అడుగే వేసుకుంటూ స్థిరంగా ముందుకు సాగుతున్నారు.

కార్మిక కామ్రేడ్స్! ఇట్టి పరిస్థితులలో సమీపిస్తున్న నిర్ణయాత్మక పోరాటానికి ద్విగుణీకృత శక్తితో సన్నద్ధమవుదాం! కార్మిక ప్రజానీకం మరింత సంఘటితమగుగాక! వారి సందేశం మూల మూలలకూ వ్యాపించుగాక! కార్మికుల కోర్కెలపైన ఆందోళన మరింత సాహసోపేతంగా సాగించబడుగాక! మేడే ఉత్సవం వేలాది సమరయోధులను మన వైపుకు ఆకర్షించి సమస్త ప్రజల స్వేచ్ఛకోసం పెట్టుబడి దాస్యం నుండి సకల శ్రమజీవుల విముక్తికోసం జరిగే మహా సమరంలో మన శక్తులను సంఘటితంగా పెంపొందించుగాక!

—లెనిన్

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

మే 1972 మాసపత్రిక 32

మేడే ప్రత్యేకం:

మేడే	లెనిన్	iii
కవిత	హోచిమిన్	2
కార్మికగీతం	అజాద్	3
కళలు సారస్వతం ఎవరికోసం		33
మేడే	గోర్కీ	46
నవజీవన నిర్మాణానికి	పావెల్	52
విప్లవ వాస్తవికత	కొడవటిగంటి కుటుంబరావు	54

కథలు:

విహంగం	జయంతి	5
జాలి	కె. వి. యస్. వర్మ	9
ఆస్థానకవి	తేజోనిధి	13

కవితలు:

మనలోమాట	జనసేన	20
మేలుకో	దుష్యంత్‌బాబు	21
ఉప్పెన	జగన్మోహన్ సి. ఎ.	22
జెయిల్లో "వాడికి"	అత్తలూరి నరసింహారావు	23
రాత్రి ఉదయించే సూర్యులు	సత్యం	26
అగ్నిపరీమాదం	ముదార్ వేణు	28
సాయుధ విప్లవం వర్ధిల్లాలి!	కిషన్	31
పేదవాళ్ళ ఆగ్రహం	శ్రీశ్రీ	32

సమీక్షలు:

భారతీయ తత్వశాస్త్రం—ఒక పరిశీలన	నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు	58
భాస్కరుడు	మోహన్	66

సాహిత్య లేఖలు:

విప్లవాన్ని అవహేళనచేసే కథ	ఎర్. లిబర్ట్	71
నాగార్జునసాగర్‌లో రా.వి. శాస్త్రిగారి "విషాదం" నాటిక	పి. కోదండరామయ్య	73
వీళ్ళు—వాళ్ళు	రాచకొండ విశ్వనాథశాస్త్రి	74

హోచిమిన్ కవిత

రుతు చక్రం తిరుగుతోంది
నిర్విరామం
జోరువాన;
అనంతరం
ప్రశాంత వాతావరణం
కనుమూసి తెరిచేలోగా
విశ్వం, తన మురికి దుస్తులను
విడిచి విసిరేసింది
వేలమైళ్ళ భూదృశ్యం
సుందరతను పరచుకుంది
చిరుగాలులు, చిరునవ్వుల సుమాలు
ఎత్తున చెట్లన
నర్తించే ఆకులలో
పక్షుల కిలకిల గానం
మానవులు, సర్వప్రాణులు
పునర్జన్ములై
మేల్కొన్నారు
ఇంతకన్నా సహజమైనదేమున్నది
దుఃఖం అనంతరం
వస్తుంది సౌఖ్యం.

కార్మిక గీతం!

అజాద్

పట్టణాల్లో కార్మికుడా!
పల్లెదిక్కు చూడరా!
పల్లెల్లో రగుల్కొన్న విప్లవాగ్ని నిలపరా!
నీ అన్నతో, రైతన్నతో చేయిచేయికలపరా!

అదిగదిగో! నక్సల్‌బరి
రగిలించిన అగ్నికణం
ఇదిగిదిగో! శ్రీకాకుళం
పలికించిన రణశంఖం
తెలంగాణ, పంజాబ్‌లో
పోరాడే గెరిల్లాలు
బెంగాల్ మైదానాల్లో
ప్రభవించిన ప్రజాసేన
నీ ధర్మం సూచించును!
నీ మార్గం చూయించును! (పట్టణాల్లో కార్మికుడా!...)

నీ రక్తం గ్లాసులతో
తాగి తేన్పు దొరలుండగ
నీ శక్తిని త్రాసులతో
తూచి, దోచు ఘనులుండగ
ఎంత కూలి అయిననేమి?
చిల్లికుండె నీ బతుకు
దోపిడి రాజ్యం వుండగ
లేదు సుఖం, లేదుశాంతి. (పట్టణాల్లో కార్మికుడా!...)

రష్యన్ రూబుల్ రాపిడి
అమెరిక డాలర్ దోపిడి

గ్రామాల్లో భూస్వాములు
నగరాల్లో దళారీలు;
కష్టజీవి దారుల్లో
నాల్గుతలల విషపు నాగు!
తెగించు! పోరాటంలో
వధించు! పెనువిషసర్పం. (పట్టణాల్లో కార్మికుడా!...)

దొరలు పలుకు దేశభక్తి
నిను దోచే బలేయుక్తి!
నీ వర్గం శ్రేయస్సే,
నీ దేశం శ్రేయస్సు!
కష్టించే జనావళికి
దేశపు సరిహద్దులేల?
ప్రపంచ కార్మికులంతా
వొకే తల్లి బిడ్డలురా!
ప్రపంచ శ్రామికులంతా
వొకే కొమ్మ పువ్వులురా! (పట్టణాల్లో కార్మికుడా!...)

తుపాకి గొట్టం ద్వారే
నీ రాజ్యం సిద్ధించును
తెగించు పోరాటంలో
నీ స్వప్నం ఫలియించును
గ్రామాల విముక్తి చేసి
పట్టణాల చుట్టుముట్టి
కార్మిక కర్షక రాజ్యం
స్థాపించను సాగిరార!
నవభారత జనరాజ్యం
స్థాపించను వేగరార! (పట్టణాల్లో కార్మికుడా!...)

[ఎక్కడో తమిళనాడులో పుట్టి, వరంగల్ పట్టణంలో హోటల్ వర్కర్‌గా జీవించి, గ్రామాల్లోని పేద రైతాంగంతో చేయికలిపి, విప్లవ రైతాంగ పోరాటంలో మరణించిన అమరుడు కామ్రేడ్ జగదీష్‌కు, ఈ నాగీతం, కన్నీటితో అంకితం.]

విహంగం

జయంతి

ఆమె ముప్ఫైఏళ్ళ వయసున్న ఆడది. ఏభైఏళ్ళ ముదుసలిలా వుంది. ఆమె యవ్వనంగా లేదు. ఆమె యవ్వనాన్ని దారిద్ర్యం అపహరించినట్లు ఆమెవుంది. ఆమె ఎముకల గూడులావుంది. ఆమెలోని మాంసాన్ని దారిద్ర్యం చీడపురుగులు కొరుక్కు తినేసినట్లు ఆమెవుంది. కన్నీళ్ళు ఆమె కళ్ళల్లోని సోయగాన్ని కబళించినట్లు వుంది. ఆమెలోని రక్తాన్ని ఆకలిజలగలు పీల్చేసినట్లు ఆమెవుంది.

ఆమె చీరకట్టుకోలేదు. ఆమె నగ్నంగా లేదు లేదు. ఆమె ఎర్రికోకలో అర్థ భాగం చుట్టబెట్టుకుంది. ఆ ఎర్రికోక గుడ్డముక్కలే ఆమెదగ్గరున్న ఆమె ముగ్గురు పిల్లలూ కట్టుకున్నట్లు తెలుస్తూంది. ఆమె రవిక ధరించలేదని చెప్పనవసరం లేదు. వయసులో తప్ప ఆమె పోలికలన్నీ ఆపిల్లలకున్నాయి.

ఆమె ఎండిపోయిన మర్రిచెట్టుదగ్గర కూర్చుంది. ఆమెపిల్లలు ఎండిపోయిన పుల్లలు ఏరుతున్నారు. ఆమె దీనంగా విలపిస్తూంది. ఆమె విలాపాన్ని వినలేనన్నట్లు సూర్యుడు పడమటి కొండవైపు పారిపోతున్నాడు. పక్షులు ఆమెదైన్యాన్ని చూడలేమన్నట్లు చెట్టుపైవ్రాలిన వెంటనే ఎగిరిపోతున్నాయి. ఆ చెట్టుకూడా విలపిస్తున్నట్లు కన్నీళ్ళలా ఎండుటాకులను టప టప రాలుస్తూంది.

అప్పుడు నేను అక్కడకు వెళ్ళడం జరిగింది. విలపిస్తున్న ఆమెను వీక్షించడం సంభవించింది.

అప్పుడు నాకు ఆమెమీద జాలికలిగింది. జాలి, కనికరం, దయా, దానం దైన్యాన్ని తొలగించలేవనీ, దారిద్ర్యాన్ని నిర్మూలించలేవని నాకు అప్పటికితెలీదు. అవి దైన్యవిముక్తిమార్గంలో అడ్డంకులే అనికూడా అప్పటికి నాకుతెలీదు. జాలిపడ్డం మాత్రం అమితంగా అప్పటికి నేను నేర్చుకున్నాను. అంచేత ఆమెమీద అమితమైన జాలికలిగింది. అంచేత ఆమెను ఆమెదైన్యానికి కారణం చెప్పమని అడిగాను.

ఆమె నావైపు చూసీచూడనట్లు వూరుకుంది. నేను అడిగినదానికి జవాబు చెప్పలేదు. ఆలాపన మాత్రం ఆపుచేసింది. కన్నీళ్ళు మాత్రం కారుతూనేవున్నాయి. ఆమె నిర్లక్ష్యంగా. నిర్లిప్తంగా వుండిపోయింది.

ఏ దేవుడూ ఆమె దీనత్వాన్ని పారద్రోలడానికి ప్రత్యక్షం కాడని ఆమె భావించి నాకు జవాబు యివ్వలేదని నేనప్పుడు భావించాను ఏ మనిషి ఆమె దైన్యాన్ని తొలగించడానికి ముందుకురాడని ఆమెతలచి మౌనంగా వుండిపోయిందని నేనప్పుడు తలచాను.

ఆమె దైన్యం నా హృదయాన్ని హింసిస్తే, ఆమె మౌనం నా మదిని పీడించింది.

నేను అడుగునున్న వారిభుజాలమీద నిలబడి పైనున్నవారి కాలివేళ్ళు పట్టుకొని పైకెగ్రబాకాలని పాటుపడుతున్న యువకుణ్ణని ఆమెకు తెలిసిపోయినట్లు నేను భయపడ్డాను. నా దౌర్బల్యాలు ఆమెకు విదితం అయిపోయినట్లు నేను వ్యధపడ్డాను, నా చదువు నాకు లోకంగురించి చెప్పలేదని, సంఘం గురించి తెలియజేయలేదని, న్యాయం బోధించలేదనీ, అన్యాయాలను హతమార్చాలని హితబోధ చెయ్యలేదని, నన్ను అక్షరాలు ముద్రించే అచ్చు యంత్రంలా తయారుచేసిందని ఆమెకు తెలిసిపోయినట్లు నేను చింతించాను. న్యాయంకోసం నిలబడే నిజాయితీ, గుండె నిబ్బరం నాకులేవని ఆమెకు తెలిసిపోయినట్లు నేను విచారించాను నేను స్వార్థం ఊయలలో ఉయ్యాలలూగే పసివాణ్ణని ఆమె గ్రహించినట్లు నేను భీతిల్లాను, అందుకే ఆమె నాకు జవాబుచెప్పలేదని నేను కుదించుకుపోయాను. అప్పుడు నేను నిస్సహాయంగా నిలబడిపోయాను, దీనంగా ఆమె ముఖంలోకి చూసాను, అప్పుడు ఆమె నాముఖంలో దీనత్వాన్ని చూసింది. ఆమెకు నామీద జాలికలిగింది. ఆమె అప్పుడు ఆమె కథను నాకుచెప్పింది.

ఆమె ఆడది అవడంవల్లి ఆమెకొక మొగుడుండేవాడట. అతడు చదువుకోకపోవడంవల్ల కాయకష్టంమీద బ్రతకవలసి వచ్చిందట, చదువుకోకపోయినా, మాయా-మోసం చేయడం రాకపోడంచేత శరీరబలంమీద తప్పకుండా జీవించవలసివచ్చిందట. అతడు రాజకీయాల్లో తలదూర్చకపోడంచేత, సుఖంగా బ్రతకడానికి కష్టంలేకుండా డబ్బు సంపాదించలేక పోయాడట. అతడొక కర్రలవ్యాపారివద్ద కట్టెలుకొట్టేవాడిగా జీవిస్తూ వుండేవాడట. పెళ్లయిన కొత్తలో, యవ్వనంపొంగులో, దరిద్రం దహిస్తున్నా కామం కట్టలు త్రెంచుకోడంవల్ల, కష్టాల్ని లెక్కజేయకుండా సుఖంగా కొన్నాళ్ళు జీవించినట్లు వాళ్లు భావించారట. తర్వాత అతడు కండలు కరుగుతున్నా కడుపునిండకపోవడంవల్ల పెళ్ళాడ్డం పొరపాటని గ్రహించాడట. తిండిలేని తనకు ఆకలితోపాటు ఆడదానికోసం ఆకలితో పుట్టించిన దేవుణ్ణి తర్వాత తిట్టాడట. తర్వాత అతనికి పెళ్లాం వుండడంవల్ల ముగ్గురు పిల్లలు పుట్టారట, ఆమె ఆరోగ్యం చెడిపోయిందట, అంచేత

ఆమె ఏపనీచేసి, ఏవిధంగానూ భర్తకు సహాయం చేయలేకపోయేదట. అప్పుడతడు తన జీవితాన్ని శాపంగా భావించాడట. పెళ్ళాన్ని పిల్లల్ని ఆకలికి అర్పించినందుకు, తన్ను అగ్నికి అర్పించుకోవాలన్నంత నిరాశగా, నిస్పృహగా జీవితాన్ని గడుపుతూ వుండేవాడట.

ఆ పచ్చికలపకు కండచీమలూ, ఎండుకలపకు బండచీమలూ అంటిపెట్టుకుని గుంపులుగా వుండేవట. ఎంత జాగ్రత్తగావున్నా, అవి అతణ్ణి కరుస్తూవుండేవట. అతడు రోజూ రాత్రి గుడిసెముందు కుక్కినులక మంచంమీద నడుం వాల్చేవాడట. అతడికి ఆకలిమంటకు తోడు చీమలుకుట్టిన మంటతోడై పెళ్ళాంమీదా, దేవుడిమీద, దరిద్రంమీదా, దానవులమీద మండిపడిపోతూవుండేవాడట.

అతడు గుడిసెముందు మంచంమీద దొర్లుతూ ఆకాశంలోకి చూస్తూ, ఆలోచించు కుంటూ నిద్రలేకుండా గడుపుతూవుండేవాడట. అప్పుడు కండలు కరుగుతున్నా తిండి లేకపోవటం- చెమటబిందువు రాలకుండా కనకరాసులు కూడటం— అలాంటి దృశ్యాలు అతని కళ్ళముందు తిరుగుతున్నట్లు అతడు ఆమెతో చెప్తువుండేవాడట. ఆ కనకరాసుల వెనక- నేరాలపోగులూ- మోసాలకుప్పలూ- కన్నీటికాల్వలూ- రక్తప్రవాహాలు- అతడు విన్నవీ- కన్నవీ ఆమెకు కథలుగా కబుర్లుగా చెప్తూవుండేవాడట, అలా నిద్ర కూడా లేకుండావుంటూ వుండడంవల్ల అతని ఆరోగ్యంకూడా చెడిపోయిందట. అప్పు డతనికి క్రమంగా న్యాయంమీద నమ్మకం పోయిందట. ధర్మంమీద ఆసక్తిచచ్చిపో యిందట. అహింస అబద్ధమని అంటూవుండేవాడట. 'మన దరిద్రం ఎలాపోతుంది? మన ఆకలి ఎలాతీరుతుంది? మన రోజులు ఎలాగడుస్తాయి? మనకష్టాలు ఎలాగట్టెక్కు తాయి?' అని అతడు తరచుగా ఆమెతో అంటూవుండేవాడట, ఆవేదన పొందుతూ వుండేవాడట!

ఒకరోజు అర్ధరాత్రివేళ అతడు వాకిట్లో మంచంమీద పండుకుని వున్నప్పుడు ఎవరో ఇద్దరు మగాళ్ళు వచ్చారట. వాళ్ల ఎత్తుగా లావుగా, బలంగా వున్నారట. వాళ్లు ఆమెభర్తతో కొంతసేపు గుసగుసలాడేరట. అప్పుడతడు గుడిసెలోకి వచ్చాడట. దీపం చేత్తోపట్టుకుని నిద్రపోతున్న ముగ్గురు పిల్లల్నిచూసాడట. ఆమెకదేమీ అర్థంకాలేదట. ఆమెకు ఎందుకో భయంమాత్రం వేసిందట. అతడు దీపం చేత్తోపట్టుకుని ఆమెముఖం లోకికూడా చూసాడట. ఆమెవంటిమీద చెయికూడా వేశాడట. అప్పుడతని కళ్ళల్లో నీళ్ళు గిర్రునతిరిగాయట. అతని చేతులు కంపించాయట. ఆమెకళ్ళు అప్రయత్నంగా నీళ్ళతో నిండాయట. అతడు ఆమెతో ఏమీచెప్పకుండా వాళ్లతోకలిసి వెళ్లిపోయాడట.

ఆ మర్నాడు అతడు ఇంటికి తిరిగిరాలేదట. ఆమె అతనికోసం నిరీక్షించిందట. ఆమె అతనికోసం వెదికిందట. కానీ, అతడిగురించి ఆ మె కు ఏమీ తెలియలేదట. ఆమూడోనాడు అతడు చచ్చిపోయినట్లు ఆమెకు తెలిసిందట. అతడు ఎలా చచ్చిపో యాడో ఆమెకు ఆ తర్వాత తెలిసిందట. అన్నివూళ్లల్లోలాగే ఆవూళ్ళోకూడా ఒక ధనవంతుడున్నాడట. ఆ ధనవంతుడు చాలా గొప్పధనవంతుడట. ఆ ధనవంతుడికి ఒకవిరోధి వున్నాడట. ఆ విరోధి బీదవాడో ధనవంతుడో ఆమెకు తెలీదుట కానీ అతడు చాలా బలవంతుడని ఆమెకు తెలుసునట. ఆ ధనవంతుడు ఆ బలవంతుడైన తనవిరోధిని చంపినవాడికి ఐదువేల రూపాయిలు ఇస్తానన్నాడట. ఒక ఇద్దరు ఆపనికి ఆ డబ్బుకోసం అంగీకరించి తిండిలేకపోయినా గుండెవున్న ఆమె భర్తను తీసుకునివెళ్ళిపోయారట. 'మన దరిద్రం ఎలాపోతుంది? మన ఆకలి ఎలాతీరుతుంది! మనరోజులు ఎలా గడుస్తాయి? మనకష్టాలు ఎలా గట్టెక్కుతాయి!' అని అలమటిస్తున్న ఆమెభర్త ఆపనికి వొప్పుకుని వుంటాడనీ, ఆ తణ్ణి చంపబోయి, తనభర్తే హతుడయ్యాడని ఆమెచెప్పి కన్నీరు బొటబొట కార్చింది

ఆనాటినుండి ఆమె భర్తకోసం దుఃఖిస్తూ అనారోగ్యంతో వ్యధపడుతూ ఆకలితో అలమటిస్తూ పిల్లలకోసం జీవిస్తూంది. ఆమె జాలిగా రోదిస్తూ, దీనంగా విలపిస్తూ జీవిస్తూంది.

ఆమె కథవిన్న నాకు అమితంగా ఆమెమీద జాలికలిగింది. అపరిమితంగా దుఃఖం వచ్చింది. ఒక పతితను పెళ్ళాడ్డంవల్ల వాళ్ళసమస్య తీరదని నాకుతెలుసున్నా, దానాలు గర్భస్రావాల్లాంటివని నాకుతెలీదు. నీతినియమాలు ఒకనాటి స్వార్థం కబంధ హస్తాలు గీసిన సొట్టగీతలనికూడా నాకుతెలీదు. ఐదురూపాయల కాగితం ఆమె ఆర్తిని తొలగించలేదని కూడా నాకుతెలీలేదు. అంచేత ఐదురూపాయల కాగితం ఆమెకు ఇవ్వబోయాను. ఆమె చిన్నకుర్రాణ్ణి చంకనపెట్టుకుని ఆడబ్బు పుచ్చుకోకుండా ఏడుస్తూ వెళ్ళిపోయింది. ఆమె ఇద్దరుపిల్లలూ రోదిస్తూ ఆమె వెంటపరుగెత్తారు.

"ఏంబాబూ! సూసినా, ఎండిపోయిన తుప్పనాగున్న నన్నుసూసినా, అప్పడంలా గంటుకుపోయిన నాకడుపు సూసినా, కుక్క ఎత్తుకుపోతున్న ఎమికనాగున్న నాబిడ్డల్ని సూసినా, నాబరత ఎందుకసచ్చిపోనాడో నీకు అరదమయిందా. కడుపునిండా కూడు నోఁడివి నీకేటితెల్చు మాకట్టాలు. నీకేటితెల్చు ఆకలిమంట. ఏదీ సూడూ, ఒకపొద్దు దేవుడికోచమైనా ఉపాసముండి సూడూ. తెలుద్దినీకు ఆకలిబాధ! నీకడుపునిండితే నీకు

సాలు! ఓరెలాపోతే నీకేటిసెప్పు? ఓరుతినకపోతే నీకేటి? ఓసెలాసత్తే నీకేటి! నానుకూడాసత్తే నాపిల్లలగతేటి? నాకు మాసెడ్డకోపం నత్తూంది. నామాట ఇను. ఆ అయిదురూపాయిలూ పట్టుకెలితే ఓగుంట ఓ పాలి ఒంటిమీద సెయి ఎయినిత్తాది. నేకపోతే ఆడబ్బుతో సుక్క ఏసుకుని సక్కాతొంగో. నాకు వొల్లుమండిపోతుంది. ఏంబాబూ! నువేటి సదుంతున్నావేటి? ఐదురూపాయిల కాయితంతో మా యాతన ఎల్లగొట్టాలనుకున్నావేటి? సెప్పు. బాబూ సెప్పు. నీకేమెలకువుంటే మాబతుకులిలా బందబారిపోతాయా? నీకే సత్తావుంటే, తిండినేకుండా మామిలా మాడిసత్తామా! సెప్పు బాబూ సెప్పు" అని ఆమె అన్నట్లు నాచెవులు విన్నట్లు నాకప్పుడనిపించింది.

నేను భారంగా ఇల్లు చేరుకున్నాను. ఆనాటినుండి ఆక్షణంనుండి, నామనసు పరిపరివిధాల పరుగులుతీసింది. నామది వెయ్యివిధాల ఆలోచించింది, నామనసు కొట్టి మిటలాడింది. నామది విరామంలేకుండా ఆరాటం పడింది. కొంతకాలానికి నాకు ఆమె నాదేశంలో అత్యంత పెద్దభాగమని అర్థమయింది. మరికొంత కాలానికి ప్రేమ సమాజాలు పెట్టడంద్వారా మానవత్వం వర్ధిల్లదనికూడా నాకు బోధపడింది. 'పో, పో, దారిద్ర్యమా!' అంటే పోదుపోదని చాలామందికి తెలిసినట్లు నాకుకూడా తెలిసింది!

మరికొంత కాలానికి- మరోనాడు- అప్పుడే తెల్లవారింది. నాకు మెలకువ వచ్చింది. 'మన దరిద్రం ఎలాపోతుంది? మన ఆకలి ఎలాతీరుతుంది? మనరోజులు ఎలా గడుస్తాయి? మనకష్టాలు ఎలా గట్టెక్కుతాయి?' ఆ మాటలు— ఆకట్టెలుకొట్టు వానిమాటలు నాచెవిలో మ్రోగాయి. అంతలో భాస్కరుడు ఎర్రగా ఎర్రగా ఉదయించాడు. ఆకాశం ఎర్రబడుతూంది. ఒక విహంగం ఉత్సాహంగా రెక్కలు ఆడిస్తూ ఎర్రబడుతున్న తూరుపుదెసకు పరుగులుతీసింది. ఆ కట్టెలుకొట్టువాని ప్రశ్నలకు జవాబు దొరికింది.

జాలి

కె. వి. యస్. వర్మ

ఒక టౌన్‌లో
రైల్వే స్టేషన్‌లో
మండుటెండలో

ఇటువైపు ప్లాట్‌ఫారమ్ నుంచి అటువైపు ప్లాట్‌ఫారమ్ మీదకి వెళ్ళడానికి కట్టిన ఓవర్ బ్రిడ్జీమీద అటూయిటూ దీనంగా దైన్యంగా ఆకలిచూపులు చూస్తూ కూర్చున్నారు భిక్షగాళ్లు, ఆడా- మగా.

వాళ్ళు
కాల్చిపారేసిన సిగరెట్ పీకల్లా వున్నారు
వాడిపోయిన పువ్వుల్లా వున్నారు
రెక్కలు విరిగిన పక్షుల్లా వున్నారు.

వాళ్ళముందు సిల్వర్ గిన్నెలు ఉమ్మువేసే తొట్టెల్లావున్నాయి. ఆ గిన్నెల్లో విడి పైసలు గజ్జికురుపుల్లా వున్నాయి

కింద రైళ్లు ఆగుతున్నాయి- వెళ్తున్నాయి. మనుషులు దిగుతున్నారు- ఎక్కుతున్నారు. అటువేపునుంచి ఇటూ, ఇటువేపునుంచి అటూ హడావుడిగా నడుస్తున్నారు.

బిచ్చగాళ్ళకేసి చూస్తున్నారు. విడిపైసలుంటే వేస్తున్నారు— స్వర్గంలో తమకి స్థానం కేటాయించబడిం దనుకుంటున్నారు. కొందరు చిల్లరలేదంటూ సానుభూతి చూపిస్తున్నారు. ఒక ఆసామీ పదిపైసల బిళ్ళ ఒకడికిచ్చి, మీరందరూ పంచుకోండని నలుగురికీ వినిపించేలా చెబుతున్నాడు గొప్పగా.

ఎల్లమ్మ తనగిన్నెవంక పాలుకోసం తల్లిరొమ్మును చూసే పసిపాపలా చూసింది. రెండు రెండుపైసల బిళ్ళలూ, మూడు విడిపైసలూ వున్నాయి.

ఎల్లమ్మ ముందునుంచి కాళ్లు కదులుతున్నాయి. చేతులు వూగుతున్నాయి. పైసలుమాత్రం రాలడంలేదు

పైసలు గిన్నెల్లో పడినప్పుడు వాళ్ళకళ్లు మెరుస్తున్నాయి. కృతజ్ఞతగా చూస్తున్నాయి. గంటలు గడుస్తున్నాయి.

బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటున్నారు. కడుపులు తడుముకుంటున్నారు. అలా చాలా సేపు ఓపిగ్గా చూసి, ఒక్కొక్కరూ లేచి రైల్వేస్టేషన్ దాటేరు.

నెమ్మదిగా వెంకటేశ్వరుడి కోవెల చేరుకున్నారు. కోవెల వెనక్కిపోయి కూర్చున్నారు. తమదగ్గరున్న పైసలు లెక్కపెట్టుకున్నారు. ఎంత తిండిదొరుకుతుందో అంచనావేసుకుంటూ ఆలోచనల్లో పడ్డారు.

వాళ్ళ ఆలోచనల్లో కార్లులేవు, బార్లులేవు, మోసాల్లేవు, మాయల్లేవు.

వెంకటేశ్వరుడి గుడిలో రంగు రంగుల లైట్లు ఆకాశంలో వేలాడుతున్న నక్షత్రాల్లా వున్నాయి. గంట క్షయరోగిదగ్గులా వినిపిస్తోంది.

భక్తులు బయట జోళ్లవిడిచి, దేవుడిముందు కళ్లమూసుకుని 'తమ జోళ్ళని ఎవరూ ఎత్తుకుపోరుగదా' అన్న ఆలోచన వచ్చినందుకు నాలుక్కరచుకుని, చెంపలు వేసుకుంటున్నారు. అరటిపళ్లు కొందరూ, కొబ్బరికాయలు కొందరూ దక్షిణతో పూజారితెచ్చిన పళ్లెంలో పెడ్తున్నారు. అందులో మూదోవంతు ప్రసాదంగా తీసుకుంటున్నారు. కళ్లకద్దుకుని నోట్లో వేసుకుంటున్నారు.

అప్పుడు భక్తులు లంచం యిచ్చి తమకు కావల్సినవి 'శాంక్షన్' చేయించుకునే కంట్రాక్టర్లలా వున్నారు. వాళ్ళముందు దేవుడు వాగ్దానంచేసి నిలబెట్టుకోలేని పొలిటికల్ నాయకునిలా వున్నాడు.

ఒకభక్తుడు తన పాతచెప్పులొదలి, కొత్తవి తొడుక్కునిపోతే సంతోషంగా; మరొకడు తనజోళ్లపోయేయని ఏడుస్తున్నాడు. రాత్రి పెరిగేకొలదీ భక్తులసంఖ్య తరిగిపోయింది.

పూజారి అరటిపళ్ళవంకా, కొబ్బరిముక్కలవంకా పళ్లెంలోని చిల్లరవంకా తృప్తిగాచూసి, ముందుతలుపులు మూసి, వెనకతలుపులు తెరిచాడు. లోపలి వెలుగు కొద్దిగా బయటికి వచ్చింది.

ఎల్లమ్మ పన్నెండు పైసలు పూజారిచేతుల్లో వదేసింది. పూజారి పది అరటి పళ్లిచ్చాడు. మిగతా వాళ్ళంతా తమదగ్గరున్న పైసలిచ్చి అరటిపళ్లు కొనుక్కున్నారు. ఆవురావురుమంటూ తినేసి మంచినీళ్ళకోసం పరుగెత్తారు.

తర్వాత నెమ్మదిగా మామూలుగా సంతపేటలోకినడిచి రేకుషెడ్డుల్లోకి దూరారు. గోడకిజేరబడి ఒకరూ, పడుకుని ఒకరూ కళ్లమూసుకున్నారు.

చీకటి చిక్కగా వుంది
గాలి స్థంభించిపోయింది.

ఎల్లమ్మ చీకట్లోకిచూస్తూ వాళ్ళందరికీ దూరంగా కూర్చుంది. ఆమె పక్కకి శీనయ్య వచ్చాడు. 'ఎల్లమ్మా' అన్నాడు. 'నేనే శీనయ్యనే' అన్నాడు. 'చచ్చిపోత న్నానే, కొంచెం కనికరించవే. నీకు పున్నెం వుంటాది' అన్నాడు. ఎల్లమ్మ మాట్లాడకుండా వూరుకుంది. శీనయ్య ఆమెని దగ్గరకు లాక్కున్నాడు. ఎల్లమ్మ కాళ్ళు ముడుచుకుంది.

*   *   *

రెండ్రోజుల ఆకలిని కడుపులో పెట్టుకుని, రెండేళ్ళ కుర్రోడ్ని వాళ్ళో పెట్టుకుని కూర్చుంది ఎల్లమ్మ. దీనంగా అడుగుతోంది, హీనంగా బ్రతిమాలుతోంది

కుర్రోడు ఏడుస్తున్నాడు. ఎండిన రొమ్ముల్ని నోట్లో పెట్టుకుని తననోట్లో లాలా జలాన్ని మింగుతున్నాడు. ఎల్లమ్మ కుర్రోడ్ని బాధగా చూసింది, నీరసంగా మూలిగింది.

ఎల్లమ్మ మళ్ళీ మనసులో ఏడ్చింది. కుర్రోడ్ని కన్నందుకు. శీనయ్యపై దయ తల్చినందుకు, వాడికి లొంగినందుకు.

పట్టుచీరలూ, సాదాచీరలూ, జరీకండువాలూ, గ్లాస్కో పంచెలూ, నేరో కట్ పేంట్లూ గుడిలోకి ఎల్లమ్మ ముందునుంచి వెళ్తున్నాయి. చెవుల్లో పువ్వులు పెట్టుకుని వస్తున్నాయి. ముఖానికి బొట్లు పెట్టుకుని వస్తున్నాయి.

గిన్నెలో నాలుగే పైసలున్నాయి. ఎల్లమ్మకేమీ పాలుపోవడం లేదు. కుర్రోడు గుక్కపెట్టి యేడుస్తున్నాడు. కడుపు కణకణలాడుతోంది. కొన్ని నెలలుగా పూజారి వీళ్ళకి అరటిపళ్ళు అమ్మడం మానేశాడు. ఎక్కువ డబ్బు వస్తోందని కాంట్రాక్టుకి ఎవడికో యిచ్చేస్తున్నాడు.

ఎల్లమ్మ ఆలోచిస్తూ కూర్చుంది. పిల్లోడ్ని సముదాయించింది. వాడు ఏడుపు ఆపలేదు ఇంతలో ఎదురుగావున్న మిఠాయికొట్లో నుంచి ఒకకాకి మిఠాయివుండ తన్నుకుపోయింది. షావుకారు దాన్ని తిట్టుకుంటున్నాడు చేసేదేమీలేక.

ఎల్లమ్మ పెదవులపై చిరునవ్వు మెరిసింది. మనసు ఉత్సాహంగా వెన్నుతట్టింది. కళ్లు కాంతిని పుంజుకున్నాయి.

ఎండ వేడిగా వుంది

ఆకాశం నిర్మలంగా వుంది

గాలి స్వచ్ఛంగా వుంది.

ఎల్లమ్మ లేచింది. పిల్లోడ్ని కూర్చోబెట్టింది. గుళ్లోకి నడిచింది.

పూజారి అరటిపళ్లూ, కొబ్బరిచెక్కలూ సంచిలో వేస్తున్నాడు. పళ్లెంలో గుట్టలా చిల్లరవుంది.

ఎల్లమ్మ గుప్పెడు చిల్లరతీసింది. రెండోచేతి కందినన్ని అరటిపళ్ళు పట్టుకుంది. పూజారి వెర్రిగాచూశాడు. ఎల్లమ్మ నవ్వుతూ నిలబడింది.

"ఏయ్, బుద్ధుందా నీకు. లోపలికిరావచ్చా నువ్వు? అవన్నీ యిక్కడపెట్టు. ఈ రెండుపళ్ళూ పట్టుకెళ్ళు"

"నీ బోడిజాలి నాకక్కర్లేదు"

"ఏవిటే కూస్తున్నావ్, అవిక్కడపెట్టు. లేకపోతే తంతాను" పూజారి కళ్ళెర్రజేశాడు

"నువ్వన్నేయంగా అమ్ముకుంటున్నావ్. మేమాకల్తో సత్తన్నాం. నువ్వుతంతే నేను తిరగబడి తంతాను"

"పాపం మూటకట్టుకుంటున్నావే వెధవముండా. అందుకే అడుక్కుతింటున్నావ్"

"నోర్ముయ్‌రా లంజాకొడ్కా. పాపం గురించి నాకు సెప్పకురా. అట్టాగయితే నువ్వూ అడుక్కుతినాలి. అసలా ముండాకొడుకుంటే నిన్ను బతకనిత్తాడా" ఎల్లమ్మ సింహంలా గర్జించింది.

పూజారి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

ఎల్లమ్మ కుర్రోడిదగ్గర కొచ్చింది. వాడ్ని ఎత్తుకుంది. ఆమెలో భయంలేదు, బాధలేదు, దిగులులేదు. ఎల్లమ్మ నరనరంలోనూ నూతనోత్సాహం ఆవరించింది. గుండెనిండా ధైర్యం నిండిపోయింది. శరీరం గాలిలో తేలిపోయింది.

ఇప్పుడు ఎల్లమ్మ వజ్రంలావుంది. కత్తిలావుంది, అసలైన మనిషిలావుంది.

ఆస్థానకవి

తేజోనిధి

అనగనగా క్రీస్తుశకంలోనే ఆనందనిలయ సామ్రాజ్యాన్ని సింహబల మహా చక్రవర్తి పరిపాలన చేస్తుండేవాడు. తన ఆనందనిలయ సామ్రాజ్యంలో అంతా ఆనందంగా గడుపుతున్నారని సింహబల మహాచక్రవర్తి సంతోషం వెలిబుచ్చేవాడు.

తన రాజ్యానికేం—

రథ- గజ- తురగ- పదాతిదళాలు సర్వసన్నద్ధంగా ఉండేవి. తనరాజ్యంలో ఎక్కడ విచారం తలెత్తినా సైన్యం సమాయత్తమైపోయి— విచారాన్ని సంతోషంగా మార్చి— ఇంచక్కా రాజధాని చేరుకొనేది.

రాజభవనం కళకళలాడుతుండేది. దేవకన్యల్లాంటి కళాకారిణిలు నిరంతరం భరతముని నాట్యాన్ని అభినయిస్తుండేవారు. గాయక శిఖామణులు భక్తిగీతా లాలపించేవారు. చిత్రకారులు పరమాత్మని చిద్విలాసాన్ని మాత్రమే చిత్రిస్తుండేవారు.

అదిలేదు— ఇదిలేదు అనకుండా అన్నీ ఉన్నాయన్న సంతృప్తి సింహబల మహాచక్రవర్తిగారికున్నా— హృదయంలో మాత్రం ఏదో అవ్యక్తమైనలోటు అప్పుడప్పుడు తొంగిచూసేది। అదేమిటో ఆయనకే అంతుపట్టలేదు—

కాలం గడిచిపోతుంది।

హఠాత్తుగా తన సామ్రాజ్యంలో ఎందుకో అలజడిరేగినట్టు సింహబల మహాచక్రవర్తిగారు పసిగట్టేరు.

ప్రజలు ఆకలంటున్నారు. ఉన్నవారిక్రింద మేమీ ఊడిగం చేయలేం- బ్రతుక్కో ఆసరా కల్పించండని బజార్ల వెంటపడుతున్నారు. పెరుగుతున్న ధరల్లో మా జీవితావసరాలందటంలేదని ఒకటే గోలపెడుతున్నారు.

సింహబల మహాచక్రవర్తి కిదేమీ అర్థంకాలేదు। ఈ అలజడికి మూలకారణం 'ఆకలి' కాదనీ, అధికధరలూ కావనీ సామ్రాజ్యంలో ఏదో లోటు జరిగిన తాలూకు అరిష్టమనీ పసిగట్టేరు। వెంటనే ఆ కలని అరిచే ప్రజలమీదికి తన చతురంగ బలాన్నీ పంపి అలజడిని అణిచివేసేడు।

ఆస్థాన జ్యోతిష్యులవారిని రావించి అరిష్టానికి మూలమేమిటో కనుక్కోమన్నాడు.

ఆయన అహోరాత్రులూ ఆలోచించి అసలు విషయాన్ని కనిపెట్టేసి ఆనందంగా పరుగెత్తుకొచ్చేడు.

'ఏం మహాశయా। విషయం తేలిందా?'

'తేలింది మహాప్రభూ।'

'అపచారం ఏం జరిగింది?'

'పెద్ద అపచారమే జరిగింది ప్రభూ।'

'పెద్దదా? ఏమిటది? వెంటనే వివరించు' సింహబల మహాచక్రవర్తి మాటల్లో తొట్రుపాటు తొంగిచూసింది.

'ప్రభూ। తమ పితృదేవుని పాలనాకాలంలో మనకో ఆస్థానకవి ఉండేవాడు. ఆస్థానకవి చనిపోయాకే తమ పితృదేవులు అకాలమరణం చెందేరు. సింహాసనాన్ని

వెంటనే మీరధిష్ఠించారుగానీ ఆస్థానకవి ఆసనం మాత్రం అలాగే ఉండిపోయింది. వెంటనే ఒక సదాచార సంపన్నుడైన, కవిత్వం తెలిసిన- బ్రాహ్మణోత్తముని ఆస్థాన క వి గా నియమించకుంటే ఈ అరిష్టం మన సింహాసనం కీడుకి కారణమవుతుంది !' అన్నాడు.

సింహబల మహాచక్రవర్తి ఒక్కసారి నొలుక కరచుకున్నాడు.

'ఔరా! నిజంగా ఎంత అపచారం జరిగింది. ఈ అరిష్టమే ఈ ప్రజల్లోని అసంతృప్తికి కారణం, ఈ అరిష్టమే ఇక్కడి ప్రజల ఆకలికి కారణం'— ఆపాద మస్తకమూ కంపించిపోయేడు. తన రాజ్యాధికారంలో మొదటిచర్యగా దీన్ని వెంటనే అమలువరచాలని సంకల్పించుకున్నాడు.

జ్యోతిష్యులవారి సమస్యా పరిష్కారంలోని సమయోచిత పరిజ్ఞానానికి మెచ్చు కొని పారితోషికం యిచ్చి ఘనంగా ప్రశంసించేరు. ఆ మరుదినమే తన రాజ్యంలో దండోరా వేయించేరు.

'ఆస్థానకవి నియామకం జరుగుతుంది గాబట్టి అర్హతలున్నవారు రావచ్చుని'

చాలామంది వచ్చేరు ; కానీ సింహబల మహాచక్రవర్తి కెవరూ నచ్చలేదు. కారణం వచ్చినవారెవరూ సదాచార సంపన్నులు కాకపోగా- అసలువాటిమీద నమ్మకం లేనివారు.

ఆయన అసంతృప్తిగా ముఖం చిట్లించుకున్నాడు ।

కానీ—

ఆ దేశప్రజల అదృష్టమో అన్నట్లు—

చెలరేగిన అలజడుల కంతిమయాత్రన్నట్లు—

ముందు ముందు దేశం నిత్యకళ్యాణం- పచ్చతోరణంగా మారుతుందన్నట్లు—

చీకటికి వెలుగులా-

నడిసముద్రం నావలా-

ఒక మహానుభావుడు వేయినొక్క ఒంటెద్దు బండ్లమీద ఏమిటో వేసుకొని సింహబల మహాచక్రవర్తి ముందు సాక్షాత్కరించేడు ।

'ఎవరు స్వామీ మీరు ?' సవినయంగా ప్రశ్నించేడు సింహబల చక్రవర్తి.

ఆయన చిరునవ్వు నవ్వేడు ।

సనాతన సదాచార సంపన్నతంతా మూర్తీభవించి- ప్రజల పెన్నిధిలా— తన

సింహాసనం సన్నిధికి వేంచేసిన ఆయన్ను చూడగానే సింహబల మహాచక్రవర్తికి సగం భారం తీరినట్లయింది।

పోతే వివరాలు కనుక్కోవాలి।

'ఎవరు స్వామీ మీరు?' మరలా ప్రశ్నించేడు.

'నేను తెలియదా సింహభళా। లోకనాథుడ్ని' అన్నాడు.

'ఆ వెనుక ఒంటెద్దు బండ్లమీద ఒకేవిధంగా కనిపిస్తున్నవేమిటి స్వామీ।'

'అవి వేయిన్నొక్కబండ్లు, నేనువ్రాసిన కావ్యాలు. ఆదిశేషునికి వేయిపడగలే-కానీ నాకవిత్వం వేయిన్నొక్కటి- అంచే ఆదిశేషునకైనేను అలవిగాను' సగర్వంగా అన్నాడు। దానితో సింహబలునికి మిగతా సగంభారం కూడా దిగిపోయింది। ఇన్నాళ్లకి తమ ఆస్థానానికి తగినకవి దొరికాడనుకుంటూ మురిసిపోయేడు.

దీనితో ప్రజల్లో రేగిన అలజడికాస్తా తగ్గిపోతుంది. అరిష్టాలుతొలగి అన్నీ శుభాలే చేకూరుతాయనుకున్నాడు.

వెంటనే ఆస్థానకవి నియామకం ఘనంగా జరిపి కవితాసామ్రాజ్యానికి లోకనాథుడికి పట్టంగట్టేడు.

కవిసామ్రాట్టు లోకనాథులవారు పనికుపక్రమించేరు।

* * *

కానీ ప్రజల్లో అలజడి తగ్గలేదు। అధిక ధరలు తగ్గలెదు, ఆకలి తగ్గలేదు. పెరిగిన ధరల్లో పేదవాడు తిండిగింజలు కొనుక్కోలేక తిరగబడుతున్నాడు. ఉన్నవారి ధాన్యాగారాలమీద పడి దోచుకోవటం మొదలుపెట్టారు. ఎక్కడ చూసినా అశాంతి–అరాజకం–

సింహబల చక్రవర్తిగారికి చిర్రెత్తింది। వెంటనే మరలా చతురంగబలాన్ని దేశంమీదికి శాంతిభద్రతలు కాపాడేందుకు పంపాడు. వారు ఎదురుతిరిగిన పేదవారినీ, దోపిడీచేసిన ఆకలి ఆవేశంగాళ్ళనీ పశువుల్నిబాదినట్టు బాదటం మొదలేశారు.

ఇదిలా జరుగుతున్న సమయంలో–

కవిసామ్రాట్టు లోకనాథులవారికో విచిత్రానుభూతి కలిగింది।

'ఎందుకీజనాని కిలా ఆకలవుతుంది? ఎందుకీజనం యిలా ప్రభువుమీద తిరగబడతారు?? ఏమిటీ అర్థంలేని ఆకలి ఆవేశం???' అనుకున్నాడు. వీటన్నిటికీ మూలం ఆయనకు తట్టింది.

వెంటనే సింహబల మహాచక్రవర్తిని కలుసుకొని 'మహారాజా!' అన్నాడు.

'ఏమిటి కవిసామ్రాట్టూ'? సింహబలుడు ప్రశ్నించేడు.

'ఒక వేయిన్నొక్క బండి తాళపత్రాలు కావాలి'

'అన్నెందుకు స్వామీ!'

'కావాలి! సనాతనాచారాలు అడుగంటి దేశం అరాజకం పాలవుతుంది. ప్రజలు మూర్ఖుల్లాగా తయారై ఎదురు తిరగటం జరుగుతుంది. తమ సింహాసనం భద్రంగా ఉండాలంటే మరోసారి మహాభారత రచన జరగాలి'

'మహాభారతాన్ని మరలా వ్రాస్తారా స్వామీ!'

'ఔను! మరలా వ్రాస్తాను. అదే ఈదేశానికీ ప్రభువులకీ శ్రీరామరక్ష. కల్ప వృక్షము!' గంభీరంగా అన్నాడు కవిసామ్రాట్టు లోకనాధుడు సామ్రాట్టు సింహ బలునితో.

సింహబలునికి వెంటనే పరమానందం కలిగింది. ఎక్కడెక్కడ తాళపత్రాలన్నీ కొట్టుకురావలసిందిగా తన సైన్యానికి హుకుం జారీచేసేడు. వెంటనే సైన్యం దేశంమీద బడి తాళ్ళమీద ఆకులులేకుండా చేరపేసేరు!

ప్రజలు ఇవన్నీ ఎందుకని సైన్యాన్నడిగినపుడు—

'మీకోసమే! మీ క్షేమంకోసమే— మీ ఆకలితీరటం కోసమే— మీకు శుభాలు కలగటం కోసమే లోకనాధ కవి మరోసారి మహాభారత రచన సాగిస్తున్నారం'టూ చెప్పేరు.

కొందరు పేదలుపొంగి పోయేరు! ఆకులన్నీ సైన్యం కొట్టుకుపోయాక- తమ యిళ్ళమీద ఆకులు లేకపోయినా వారేమీ విచారపడలేదు. వర్షం ధారగాపడి తాము పూర్తిగా తడిసినా వారావేదన చెందలేదు. కారణం తమకు శుభాలు కలగటం కోసం మహాభారత రచన మరోసారి సాగుతోంది,

'ఆకు లింటిమీదుంటే ఏం ప్రయోజనం. ఆస్థానకవి ముందుంటేనే అన్నిటికీ శుభప్రదం' అనుకున్నారు.

ఒకానొక శుభముహూర్తాన కవిసామ్రాట్టు మహాభారత రచనకు శ్రీకారం చుట్టి మహావేగంగా రచన కొనసాగించేరు! తమ రచన సాగినంతకాలమూ దేశంలో శాంతి భద్రతలు కాపాడవలసిందిగా రాజుగారిని అభ్యర్థించాడు! రాజుగారు వెంటనే సైన్యాన్ని దేశం నలుమూలలకీ పంపేడు.

ఇంట్లో లోకనాథుడు మహాభారతాన్ని వ్రాస్తున్నాడు।

బయట ఆకలయిన ప్రజలు ఎదురు తిరిగినపుడు మహారచన కెక్కడ విఘాతం కలుగుతుందోనని సైన్యం ఎదురుతిరిగిన వారిని పిట్టల్లా కాల్చివేశారు।

ఇంట్లో మహారచన మహాజోరుగా సాగుతుంది।

బయట 'దారుణ మిది ఘోరం' అంటూ గట్టిగా అరిచేరు। అదారం। అడుగు దాటరాద'న్నారు సైనికులు!

ఇంట్లో మహారచన మరీజోరుగా సాగుతుంది।

బయట- 'భరించలేం దీన్ని మేం! మా బ్రతుక్కో భరోసా చూపండ'నన్నారు. అలా అన్నవారిని జైల్లోకుక్కారు।

ఇంట్లో మహారచన మహాజోరుగా సాగుతుంది॥

బయట– గత్యంతరం లేక- బ్రతుక్కేమీ పాలుపోక ఆకలిని భరించలేక– ఎదురు తిరిగితే ఎక్కడ కాల్చివేస్తారోనన్న భయంకొద్దీ- ఎదురు తిరగలేని పిరికివారి కుటుంబాలు మూకుమ్మడి ఆత్మహత్యలు చేసుకున్నాయి. తప్పదు మరి! ఎదురు తిరిగి అలజడిరేపితే– మహారచనకు విఘాతం జరుగుతుంది।

అందుకే—

ఇంట్లో మహారచన మహా మహాజోరుగా సాగుతుంది। అలజడితో పనిలేకుండానే- వీటన్నిటికీ అతీతుడై తన మహారచన్ని అవలీలగా పూర్తిచేసేడు లోకనాధ కవి సామ్రాట్టు.

మరలా అవన్నీ వేయిన్నొక్క ఒంటెద్దు బండ్లు నిండిపోయాయి।

సింహబల మహాచక్రవర్తి సంతోషంగా లోకనాథుడ్ని కౌగలించుకొని తమకు గొప్ప సన్మానం జరుగుతుందని తెలియజేసేడు. వేయిన్నొక్క ఒంటెద్దు బండ్ల నీదేశం నలుమూలలకీ త్రిప్పి- ప్రభువుకు విధేయంగా బ్రతకండని ప్రజలకు పదేపదే ఉపదేశించేరు। తాజా భారతామృతాన్ని సేవించండి। ఆకలి నశించిపోయి అమరత్వాన్ని చెందుతారని ఆదేపనిగా చెప్పేరు।

ప్రజల కమృతం పంచిపెట్టిన తాళపత్ర గ్రంధాలన్నీ రాజధానీనగరం చేరుకున్నాక–

ఆ దినం నిండు సభదీరింది। లోకనాధుని ముఖాన కుంకుమ బొట్టు కళకళలాడుతుంది. తానుచేసిన సేవకు ఈ ప్రజలంతా ఎంత ఋణపడిందీ ఆయనకు పూర్తిగా అర్థమయ్యింది! అందుచే ఆయన కొంకగర్వం। లోకకళ్యాణ నిమిత్తం మరోసారి మహాభారతరచన చేశానని గట్టిగా విశ్వసించేడు।

సింహబల మహాచక్రవర్తి లేచి యిట్లా ఉపన్యసించేడు :

'ప్రజలారా ! ఈయన మన ఆస్థానకవి. మీ బాధలూ- కష్టాలు తొలిగేందుకు ఒకసారి వ్రాసిన భారతాన్నే మరలా వ్రాయాల్సి వచ్చింది! దీనితో ఈదేశంలోని అధిక ధరలు పడిపోతాయి! అకలి తీరిపోతుంది! సర్వశుభాలూ ప్రజల కొనగూడుతాయి'

ఈదేశంలోని సమస్యలు తీరేందుకు పరిపాలకులతో కష్టనష్టాలకు గురైన ప్రజల బాధలు తీరేందుకు ప్రభువులతో భాగస్వామ్యం తీసుకున్నందుకు కృతజ్ఞతగా ఈయనకు ఆస్థానకవి పదవి నొసంగటమే కాకుండా—

'చంద్రునికో నూలుపోగులా- ఈయన సేవలకు చిన్న బహుమతిని సమర్పిస్తున్నాం. ఎంతోలేదు. ఒకలక్ష వరహాలు !'

సింహబలుడు కూర్చున్నాడు !

సభ కరతాళ ధ్వనులతో మారుమ్రోగింది !

లోకనాథుని మోములో మరికాస్త గర్వం తొంగిచూసింది.

'ప్రజల కష్టసుఖాలెరిగిన మహానుభావుడు గనుక- ప్రభువుల ఆస్థానంలో కవి పదవి లభించింది' అక్కడి ప్రజలనుకున్నారు !

'నిజమైన ప్రజాకవి గనుక 'ప్రజల ప్రభువు' ఆస్థానంలో పదవి లభించింది' పండితు లనుకున్నారు!

మనలో మాట

జనసేన

పాత 'పద్దులు' విడిచి రారోరన్నయ్య!
కొత్త పద్దతులొచ్చె చూడోరన్నయ్య!!
ఓరోరన్నయ్య 'వర్గసంకరమిడిచి'
ఒక్కబాటకు నడిచిరారోరన్నయ్య
కుక్కచావులు వద్దు ఓరోరన్నయ్య.
పాతబాటలు మరచిపోరోరన్నయ్య!
కొత్త పాటలు తరచి చూడోరన్నయ్య!!
ఓరోరన్నయ్య వంకదార్లన్నమ్మి
ఒరిగిపోతే భంగమేరో అన్నయ్య
వల్లకాడుల బతుకులొద్దోరన్నయ్య
దొరవారినమ్ముకొని — ఉన్నదంతమ్ముకొని
పూన బొంబై బట్టినామో రన్నయ్య
పట్నాల పాలయ్యినామో రన్నయ్య!
బస్తీల పాలయ్యినామో రన్నయ్య!!
పల్లె బస్తీలల్ల పాక్టర్లు దేలంగ
పాడు కాలం దాపురించేరన్నయ్య!
సున్నితంగా చావులొచ్చేరన్నయ్య
సుతిమెత్త బతుకులేనచ్చె రన్నయ్య
తాత తండ్రుల నాటి పాత వృత్తులు గూలి
కూలినాలికి మరిగినామోరన్నయ్య!!
ఆలి పిల్లాతోడి అల్లాడి జనమంత
ఆగ మాగము దేశమాయేరన్నయ్య.
పొట్టకూటికి జన[మనం]పట్నాల కెగబాక
కట్టగాలము దాపురించే రన్నయ్య
బాలి చాలని బతుకు గోలలెన్నోలేసె

ఆలి గోడు బాలగోడో రన్నయ్యో
నీకు దెలియనిదేటి సదువుకున్నోడివి
శోకుల్లా బడిపోకరారో రన్నయ్య.
నీ మాట నమ్ముకొని నిలువ నీడల్లేక
చెట్టుకో పిట్టమైతిమిరో రన్నయ్య।
రోడ్ల పంచల బతుకులాయేరన్నయ్య
రష్య బాటొద్దని – చైన మాటొద్దనీ,
నీ వెలగబెట్టింది ఏదోరన్నయ్య।
"మానాలు పానాలు" మంటగల్సేకాడ
"కొత్త బాట్ల"ను నమ్ముతివిరో అన్నయ్య
ఏ బాట్లచూచినా నౌబాట్ల పాలాయె
వెనక చూపులు మానిరారో రన్నయ్య
ఏ విలువ చూచినా అగచాట్ల బతుకాయె
ఎదురు చూపులు మానిరారో రన్నయ్య.
రెండు సారుల సావబోమోరన్నయ్య.

వేలు కో

దుష్యంత్ బాబు

రెక్కల కష్టం
రాసులు పోసీ
మేడలు మిద్దెలు
కట్టేవాడా!

కండ బలంతో
గుండె బలంతో
కొండ కోన
పండించేవాడా!

వేదిక లెక్కి
ఊదరగొట్టే
సోషలిజానికి
రూపేదీ?
ప్రేగులు మండే
కడుపుల అడుగున
గంజి తప్పితే
మెతుకేదీ?

చంకన బిడ్డకు
సంకటమొస్తే
మందూ, మాకూ
ఏనాడుందీ ?

పండగ, పున్నం
వస్తే, గిస్తే
చోడంబలి గతి
తప్పేదుందా ?

నడుం వంగి నువు
మూలజేరితే
కమ్మని గంజే
కరువయ్యేగా !

గాలీ వానా
క్రమ్ముకువస్తే
మూడంకేసీ
మూల్గడమేనా !

ఎన్నేళ్లోయీ
ఏన్నాళ్లోయీ
ఈ అన్యాయం
అఘాయిత్యమూ?

కళ్ళుతెరచి నువు
నిజం తెలిస్తే,
దోపిడి దొంగల
హతమారిస్తే,
పాడీ, పంటా
నీదేనంటా
నీ కష్టానికి
ప్రతిఫలమంటా !

ఉప్పెన

జగన్మోహన్, సి. ఏ.

నెత్తుర్లు పారుతాయి తప్పదు
కసి బజారు కెక్కినపుడు
ఉసికొడితే పడగిప్పిన
జనం రణం.

సముద్రంలో అలల పర్వతాలు
దండెత్తినపుడు మీతెడ్లు
ఊడిపడతాయి తప్పదు.
బైర్లుకమ్మిన మీ మెదళ్ళలోకి

జిగేలుమంటాయి నెత్తుళ్ళ మెరుపులు
రక్తాన్నికాచి నిలవేసుకున్న
నెత్తుటి మూటల్ని
ఏట్లోకి విసరాల్సిందే తప్పదు.

నెత్తుర్లే నిప్పులు
నిప్పులే నెత్తుర్లైనపుడు
మీ జీవితాల మురిగ్గుంటల్లో
ఆవేశప్పొగలు సెగలు లేస్తాయి
మీ నౌకావిహారాలు సాగవు.

ఈ జనం నిద్రిస్తున్న ఉప్పెన
క్షణం తెరపికూడా ఇవ్వదు
కన్ను తెరచినంతలో
మీ జీవితాల కోటల్ని
బజార్లని బందోబస్తుల్ని
అన్నిట్నీ కప్పేస్తుంది
నెత్తుర్లు పారుతాయి ఎప్పుడూ తప్పదు.

జెయిల్లో "వాడి"కి

అత్తలూరి నరసింహారావు

డియర్ కామ్రేడ్
అందుకో మా రెడ్ శాల్యూట్
ప్రజల్ని కత్తుల ప్రవాహంగా
ప్రజాకంటకుల మీదికి మరల్చి
చట్టబద్ధమైన హింసని ప్రతిహింసతో ఎదుర్కొంటే
కసిని వర్గకసిగా మార్చి

దోపిడీ తలకాయల్ని తోరణాలుగా
సామ్యవాదానికి సూచనగా
ఆహ్వానంగా కడితే
వడ్డీ అంకెల్లో చిక్కుకున్న బక్క బతుకుల్లో
చైతన్యం, సంఘటిత శక్తి పెంచటానికి
ఆర్థిక దిగ్బంధననుండి విముక్తి చెంది
ఊపిరి పీల్చటానికి
ప్రామ్సరీనోట్లకి అగ్గిపుల్ల వెలిగించితే
తమ ఉనికికి ఉరి పడబోతుందని
తమ ఆయుష్షుకు ఆఖరిరోజు వస్తుందని
అకల్లా అల్లల్లాడిపోయి
పాలకవర్గాలు చేసేది కాల్చి చంపటం
వీలు చిక్కకపోతే జైల్లోకి పంపటం
రాజద్రోహం ఆరోపించటం
కేసుల్లో ఇరికించటం
కోర్టుల చుట్టూ తిప్పటం
ఇలా వాడు చరిత్రను నలపడం
ప్రజాశక్తిని తాత్కాలికంగా ఆపడం
అది వాడి దోపిడీవర్గ ప్రత్యక్ష స్వభావం
అంతకన్నా మరోవిధంగా వాడినుండి ఎవడూ ఆశించడు
ఎందుకంటే అంతకన్నా వాడికింకేమీ చేతకాదు కనక

అవునుగాని కామ్రేడ్
ఏయేదృశ్యాలు జైల్లో నీకళ్ళబడ్డాయి
సంఘ బహిష్కృతుల జీవితాలనెన్ని చదివావు
ఎందరి గుండెల మంటల శిఖరాల్ని దర్శించావు
మరెందరు అధికారుల ఆటల్ని ఎదిరించావు
ఇంకెందరికి నీమార్గాన్ని చూపావు

ఎంతమంది కన్నీటితెరల్ని ఆపావు
ఎంతమందికి బతుకంటే ఆశకల్గించావు
అవును కామ్రేడ్
నిన్ను ఎన్ని ప్రశ్నలువేసి వేధించారు
వాళ్ళకి కావలసిన సమాధానాల కోసం
పాపం! వాళ్ళంతా ప్రభుత్వపు నీడలు
పాలకవర్గాల ప్రతిధ్వనులు
ఎంతమంది ఎన్ని తీర్మానాలు చేస్తేనేం
పాలకవర్గాల వ్యవహారం
శిలలమీద ప్రవాహం
మళ్ళీ అరుస్తారు అంతా మునిగిపోయిందని
పొడుస్తారు తూట్లు ప్రజాస్వామ్యం అని
ఈ కాగితాల మార్పిడి స్వాతంత్ర్యం కాష్టంలా రగలాల్సిందే
ఈ మాటల ప్రజాస్వామ్యం మంటల్లో మాడాల్సిందే
నీ జైలువార్త
మిత్రుల మరణవార్త
అందరికీ తిరుగులేని అనుభవం
ప్రకటించిన సిద్ధాంతంతో రాజీలేదని
ప్రవచించిన మార్గం ఈజీకాదని.
అన్నట్టు
నీ సంకల్పాన్ని
నీ దృఢనిశ్చయాన్ని
నీ రాజీలేని తనాన్ని
ఏ తుపాకి బాయ్‌నెట్ మార్చలేదు
ఏ ఉరికంబమూ ఆర్పలేదు
సుదూర భవిష్యత్తులో
ప్రభుత్వ జైళ్ళ ప్రసవంతో
విప్లవకారులకు

వీరోచిత స్వాగతం తప్పదు
ఆ మంత్రిసాని వ్యవహారం
ఈ తంత్రిమెరిగిన ప్రజలే చేస్తారు
అంతవరకు మా ఆచరణగా
ఈ దోపిడీవ్యవస్థ దహనానికి
చితులు పేర్చుతూనే వుంటామని
మా అందరి తరఫున
యువత రక్తంతో సంతకంచేసి పంపుతున్నాము
ఈలేఖ
అందుకో కామ్రేడ్
అందుకో—

రాత్రి ఉదయించే సూర్యులు

సత్యం

కల్లాకపటం తెలియని
అందం అడవిది
క్రమం అక్రమం తెలియని
అందం అడవిది
అడవి ప్రతి ఉదయం
ఆకాశంలో సూర్యునికి
ఆహ్వానం పలుకుతుంది
అరుణ కిరణాల కాంతికి
మత్తుగా ఒళ్ళు విరిచి
చిరునవ్వుతో సూర్యునికి
స్వాగతం పలుకుతుంది
శతకోటి పుష్పాలు విరిసి

తెలిమంచు బిందువులతో
తడిసిన లేత రేకులకు
నులివెచ్చని కిరణాలతో
చలికాచు కుంటాయి
పులుగులు కలకలా పాడుతాయి
సెలయేరు గలగలా స్వాగతగీతి
ఆలపిస్తూనే ఉంటుంది
అవును— అడవికి
సూర్యుడంటే చెప్పలేని ప్రేమ
అడవి ప్రతిరాత్రి
అనేక సూర్యులకు
ఆహ్వానం పలుకుతుంది
ఐతే నిశ్శబ్దంగా
అవనత శిరస్కయై।
చెట్లు చిరుగాలిలో
గుసగుసలు పోతాయి
పువ్వులు సూర్యుల శిరసులపై
కురిసి ప్రేమ తెలుపుతాయి
అక్కడొకటి ఇక్కడొకటి
పులుగులు ఆనందం పట్టలేక
అరుస్తూనే ఉంటాయి
సెలయేరు చల్లని హస్తాలతో
ఒళ్ళంతా తడిమిచూచి
సేదతీరా కౌగిలిస్తుంది
ప్రతి ఉదయం అడవి
ఒక సూర్యునికే స్వాగతం పలుకుతుంది
ప్రతిరాత్రి అడవి
వేలాది సూర్యులను ఒడిలో దాచుకుంటుంది
రాత్రి అడవిలో ఉదయించిన సూర్యులు
ఉదయం నగరాలను వెలిగిస్తారు.

అగ్ని ప్రమాదం

ముదార్ వేణు

నగరం కాలుతోంది
అయ్యో! అయ్యో!
నగరం కాలుతోంది.
మేం అందంగా నిర్మించుకొన్న
ఈ వ్యవస్థా నగరం కాలుతోంది—
రండి! రండి! మంటలార్పండి
మా ఆస్తి పాస్తుల్ని కాపాడండి—
మా ఆలుబిడ్డల్ని రక్షించండి
అలా చూస్తారేమండీ!
రండి, రండి!
వెకిలిగా నవ్వకండి!
మంటలార్పండి!
అందమైన నా భవనం
ఏర్ కండిషన్డ్ భవంతి
ఖరీదయిన కారు
నా యిల్లాలు యిష్టపడి తెప్పించుకొన్న
వజ్రాల నగలు—
మా అమ్మాయి అమెరికానుండి
దిగుమతి చేయించుకొన్న పియానో—
లక్షరూపాయల డైనింగ్ టేబిల్
అందమైన ఆయిల్ పెయింటింగ్స్
అన్నీ అగ్ని పాలౌతున్నాయ్—
అయ్యో! అయ్యో!

ఆ తూర్పున పెద్దగుడి
అందులోని దేవుడు
దేవుడి ఏడువారాల నగలు
రత్న ఖచిత కవచం
అన్నీ కాలిపోతున్నాయ్—
అయ్యయ్యో ! ఇదేమిటి
ఈ వైపుకూడా వ్యాపించింది అగ్ని
గోడౌన్లన్నీ కాల్తున్నయ్
దాచిపెట్టిన ధాన్యం, సరుకులు
అన్నీ బుగ్గయి పోతున్నయ్—
ధన స్వామ్యమంతా మండిపోతోంది.
కాపాడండి ! కాపాడండి !
అయ్యలూ ! అమ్మలూ !
ఫైరింజన్లకు నీరందించండి—
అయ్యో ! సామాన్యులూ !
చోద్యం చూస్తూ ఆనందిస్తున్నారెందుకు ?
నిన్నటిదాకా మా అడుగులకు మడుగు లొత్తారే!
మా సంపదలు పెరగడానికన్నివిధాలా
సాయపడ్డారే—
మమ్మల్ని పల్లకీల్లో మోశారే !
మీ ఆడాళ్ళ సౌశీల్యాల్ని కాన్కలుగా అందించారే!
మా విలాసాలకు మీ జీవితాలర్పించారే !
మా సంపదల్ని కంటికి రెప్పలా కాపాడారే !
మీ రక్తాల్ని షర్బత్తులుగా మాకందించారే !
పస్తులుండి పంటలందించి—
చిరుగులు ధరించి మాకు మంచి
వలువలందించిన

మీ మంచితనం మటుమాయమయిందెందుకు ?
మమ్మల్నాదుకోరెందుకు ?
రండి ! బాబులూ రండి !
మా వ్యవస్థా నగరం కాపాడండి !
ఈ అవశేషాల్ని నిర్మూలించి
కొత్త నగరం నిర్మిస్తామనే
ఆ వుడుకురక్తం యువకుల
మాటలువినకండి !
రండి !
ఇంకా మించి పోలేదు—
మా వ్యవస్థా నగరాన్ని కాపాడండి—
ధన స్వామ్యాన్ని రక్షించండి—
మీ ఋణం వుంచుకోం—
ఫైరింజన్లకు నీరందించండి
కాపాడండి బాబులూ—
మంటలార్పండి—
అయ్యయ్యో !
ఇంత చెప్పినా వినక
వెనుదిరిగి పోతున్నారా !
అయ్యో ! అయ్యో !
రక్షించండి.

"రాజకీయోద్యమాలవల్ల మన కుర్రవాళ్ళు పాడైపోలేదు. రాజకీయోద్యమాలు లేకపోవడంవల్లనే పాడయ్యారు. ఇజాలవల్ల మనసులు వక్రించ లేదు. ఇజాలపట్ల అభినివేశం లోపించడంవల్లనే వాళ్ళ మనస్సులు స్తంభించి వున్నాయి"

—కె. వి. రమణారెడ్డి

సాయుధ విప్లవం వర్ధిల్లాలి!

కిషన్

తమ్ముడూ, బోసికుండలు నవ్వుతున్నాయా?
కామ్రేడ్, రోగం మీఅమ్మ ఆయుష్షుమింగిందా?
వివేకీ, సమాజం శవంకంపు కొడుతూందా?
అక్కయ్యా! పసివాడు ప్రాణాలకనిఏడుస్తున్నాడా?
తల పట్టుకొని నొసలు కొట్టుకోకు,
'ఇదిక ఇంతేనని' వంచించుకోకు,
గుండెల్లో మండే ప్రతిక్రియా యవ్వనాన్ని
ప్రారబ్ధం లుబ్ధునికి తార్చకు.
తమ్ముడూ,
కామ్రేడ్—
పిరికివాణ్ణిచూసి లోకం నవ్వుతుంది
నీ సహృదయాన్ని
నీ మానవతా విశ్వాసాల్ని,
గట్టిగా కౌగలించుకుని కర్కశంగా రమిస్తున్నారీ
పంచరంగుల దోపిడీ గజదొంగలు—

గేదె శరీరాన్ని పట్టుకున్న జలగని
బలమంతా ప్రయోగించి తీసెయ్యలేకపొయ్యాడు
పడుచు కాపలాగాడు।
పుండుమీది ఈగల్ని తోలలేక
సతమతమౌతున్నాడు కుర్రవాడు.
కోరలు కనిపించవు, క్రూరత్వం నర్తించదు,
గేదె ఎగరదు— జలగ వదలదు,

రక్తం ధారగా మాత్రం తాగ గలదు.
శరీరంలోని శక్తిహీనతే వుండైతే
ఈగలు హక్కంతా ఉన్నట్టు రెక్కలల్లార్చుకుని
మన సుఖాన్ని పీల్చేద్దామని
తోలుతూంటే వాలుతూంటాయ్—
అందుకే రమ్మంటున్నాను-
ఎట్లున్న వారట్లాగే-
ఏ ఆయుధమైతేనేం? సాయుధంగా రండి.
కత్తి, గొడ్డలి, తుపాకి, గ్రెనేడ్
చివరకు చేతులు స్వాధీనంలో లేనివాళ్లు
ఒక్కసారి గొంతెత్తి నినదించండి
'సాయుధవిప్లవం వర్ధిల్లాలి!
ఆయుధవిప్లవం వర్ధిల్లాలి!!'

పేదవాళ్ల ఆగ్రహం

శ్రీ శ్రీ

ఒక మనిషిని పది పిల్లలుగా చీల్చే ఆగ్రహం
పది పిల్లల్ని నూరు పువ్వులుగాకూర్చే ఆగ్రహం
నూరు పువ్వుల్ని వెయ్యి కత్తులుగా మార్చే ఆగ్రహం
పేదవాళ్ల ఆగ్రహం
రెండు అగ్నిపర్వతాల యెదట
ఒక భూకంపాన్ని నిలబెడుతుంది
వంద డొక్కల్ని ఒక రెక్కగా మార్చే ఆగ్రహం
వెయ్యి రెక్కల్ని ఒక చుక్కగా చేర్చే ఆగ్రహం
లక్ష చుక్కల్ని ఒక పాటగా పేర్చే ఆగ్రహం
పేదవాళ్ల ఆగ్రహం
రెండు పోలీసు టోపీల యెదట
ఈ గీతాన్ని నిలబెడుతుంది.

(Cezar Vallejo రచనను అనుసరించి)

కళలు - సారస్వతం ఎవరి కోసం?

ఈ విషయమై మనలోనే చాలామంది ఒక స్పష్టమైన మార్గం ఏమిటో తెలుసుకోలేదు. అందుచేతనే మనవాళ్ళ తమ తమ రచనలలోను, కళారూపాలలోను ప్రదర్శించే భావాలలోను, రసాలలోను కొన్ని ప్రజావసరాలకు భిన్నంగా ఉంటున్నాయి. వారి దృక్పథాలలోకూడా ఇంకా ఈలోపం వుంది.

విప్లవ సారస్వతం ప్రజలకోసం కాకుండా, వారిని పీడించుకుతినే దోపిడీదార్ల కోసం రాస్తారా? అని అడగొచ్చు.

అలాంటి దోచుకునేవారి విజ్ఞానం కొంతవుంది. జమీందార్లకు ఉపయోగపడే విజ్ఞానం కొంతభాగం ఫ్యూడల్ విజ్ఞానమై వుంది. దీనికి యింకా కొంత పలుకుబడి వుంది. బూర్జువా వర్గానికి వుపయోగపడే విజ్ఞానంకూడా వుంది. అది బూర్జువా విజ్ఞానం. వారి సిద్ధాంతం, కళలు వర్గవిభేదాలకు అతీతములైనవని, యదార్థంగా వీరు కార్మికవర్గ విజ్ఞానానికి వ్యతిరేకంగా బూర్జువా విజ్ఞానాన్ని సమర్థిస్తారు. తరువాత సామ్రాజ్యవాదులను బలపర్చే కళావిజ్ఞానంకూడా వుంది. బానిసవిధానాన్ని బలపర్చే వారుకూడా లేకపోలేదు. ఇంకోరకమైన విజ్ఞానంకూడా వుంది. పైకిమాత్రం అది చాలా విప్లవాత్మకమైన విజ్ఞానంలాగ కనిపిస్తుంది. నిజానికది పైమూడింటిలోకే వస్తుంది.

ఇక మన విజ్ఞానం విషయం తీసుకుందాము. మనం వెదజల్లే విజ్ఞానం పైన చెప్పిన ఏ దోపిడీ గ్రూపుకోసం కాకుండా, సామాన్యప్రజలకోసం ఏర్పడింది. మనది కార్మికవర్గనాయకత్వాన, సామ్రాజ్యవాదానికి, ఫ్యూడల్‌విధానానికి వ్యతిరేకంగాపోరాడే ప్రజల విజ్ఞానం. మనం సృష్టించే సారస్వతం, కళలు, ఈ నూతన విజ్ఞానంలో భాగాలుగానే వుంటాయిగాని వేరుగా వుండవు. అలా అని బూర్జువా కళారూపాలుగాని, ఫ్యూడల్ కళారూపాలుగాని మనం త్రోసిపుచ్చం. కాని ఒకసారి ఆ కళారూపాలు మన చేతిలోకి వచ్చాయంటే అవి ఒక కొత్తజన్మ నెత్తుతాయి. కొత్త సందేశంతో వస్తాయి. విప్లవకరమైనవిగా తయారౌతాయి. ప్రజలకు ఉపయోగపడుతాయి.

ప్రజాసామాన్యమంటే ఎవరు?

ప్రజాసామాన్యంలో నూటికి తొంభైమంది కార్మికులు, కర్షకులు, మధ్యతరగతి వారు ఐవుంటారు. దీనిలో విప్లవాన్ని నడిపే వర్గం కార్మికులు, కర్షకులు విప్లవంలో

వీరు కార్మికులకు బలమైన మిత్రులుగా నిలబడి పోరాడుతారు, అందుచేత మన సారస్వతం, కళలు ముఖ్యంగా కార్మికవర్గానికి ఉపకరించేవిగా వుండాలి

పెటీ బూర్జువావర్గానికి వైజ్ఞానికస్థాయి కొంచెం ఎక్కువగానేవున్నా విప్లవకరమైన పట్టుదలలోను, కార్యదక్షతలోను సంఖ్యలోనుకూడా వారు బలహీనమైనగ్రూపే. అందుచేత మన ప్రేక్షకులలో ఎప్పుడుకూడా కార్మిక కర్షకులను వెనక్కునెట్టి ఈ పెటీ బూర్జువావర్గానికి ప్రాధాన్యత నివ్వకూడదు.

మన ప్రేక్షకుల విషయమై చాలమంది కామ్రేడ్సుకే ఒక స్పష్టమైన అభిప్రాయంలేదని నేననడానికి ఈ ముఖ్యవిషయాలనే దృష్టిలో పెట్టుకున్నాను. కేవలం సిద్ధాంతాలను మాత్రమే దృష్టిలో పెట్టుకొని చెప్పటంలేదు. సిద్ధాంతాల మాటకొస్తే మనలో ఎవరుకూడా మాటవరసకైనాసరే కార్మిక కర్షకులకంటె పెటీ బూర్జువాయే ప్రధానమైనదని అనలేరు. కాని ఆచరణలో మటుకు మన కామ్రేడ్సు కొందరు పెటీ బూర్జువాయే తమ ప్రేక్షకులలో ముఖ్యులని భావించేవారున్నారు.

చాలమంది కామ్రేడ్స్, మేధావంతులనబడే వారిమీదనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. వారి ఆలోచనలు ఎలావుంటాయోనని పరిశోధనలు చేస్తున్నారు. వారిని తెగవర్ణిస్తున్నారు. చివరకు వారి దుర్గుణాలను బలహీనతలను క్షమించడమేగాక సమర్థించే స్థితికికూడా పోతున్నారు. పోనీ ఈపని మధ్యతరగతినుంచి వచ్చిన మేధావంతులను సరియైన మార్గంలో పెట్టి నడపటానికిగాని, పోరాటంలో వారు వచ్చి పాల్గొని కార్మిక కర్షకులకు సహాయం చేయటానికిగాని చేస్తున్నారా అంటే, అదీకాదు. ఐతే వారాపని ఎందుకు చేస్తున్నారంటే, ఆకామ్రేడ్సుకూడా పెటీ బూర్జువా విద్యావంతుల తరగతికి చెందినవారే అయివున్నారు. మేధావులతో కలిసిమెలిసి ఉండటమనేది వారికి ఆనందదాయకమైన సంగతి. మేధావులనుగురించి మన కామ్రేడ్సు చేసే ఈ పరిశోధనలు, వర్ణనలు, కార్మికవర్గ దృక్పథంనుంచిచేసినా కొంత ఉపయోగకరంగా వుండును. లేనినాడది పెటీ బూర్జువావర్గం తన డబ్బా వాయించుకోటం తప్ప మరోటికాదు.

అలాంటి కామ్రేడ్స్ సంగతిచూస్తే వారికి కార్మిక కర్షకులతో చాల తక్కువ సంబంధాలుంటాయి. వారిలో ఈకామ్రేడ్సుకి మిత్రులెవరూవుండరు. ఈ కామ్రేడ్సు సామాన్యప్రజల మనస్తత్వాలను యిదమిద్ధమని నిర్ణయించుకోలేని స్థితిలో వుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈకామ్రేడ్స్ వేసుకున్న ముసుగు కార్మిక కర్షకులదేఐనా ముఖాలుమాత్రం పెటీ బూర్జువా ముఖాలే.

కొన్ని సందర్భాలలో మాత్రం ఆ కామ్రేడ్స్ కార్మిక కర్షకులపట్ల ప్రేమ చూపవచ్చు. కాని మరికొన్ని సందర్భాలలో వారిని అసహ్యించుకుంటారు. వారి భావాలు, వారి అభినయం, చేష్టలు ప్రాథమికదశలో వున్నవారి సారస్వత రీతులు కళారూపాలు ఈ కామ్రేడ్స్‌కి నచ్చవు. అంటే వారి గోడ వార్తాపత్రికలు, గోడలమీద బొమ్మలు గీయడం, జానపదాలు, కథలు వగైరా ఈ మేధావులకు నచ్చవు. ఒక్కొక్కప్పుడు వీరు ఆ కళారూపాలపట్ల ఆసక్తి చూపవచ్చు. ఈ ఆసక్తి ఎక్కడినుంచి వస్తుందోకూడా మనం సులభంగా తెలుసుకోవచ్చు. తాము సృష్టించిన రచనలకు మెరుగులుపెట్టుకోవాలనిగాని ప్రజలెంత వెనకబడివున్నారో చూద్దామనే సరదాతోగాని యీ ఆసక్తి వారిలో కలుగుతుంది. ఇతర సమయాల్లో వీరు ప్రజల ఈ తత్వాలను బహిరంగంగానే త్రోసిపుచ్చుతారు. పెటీ బూర్జువా, బూర్జువా మేధావులను అభినందించుతారు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే వీరు కార్మికవర్గంతోవున్నా వీరి ఆత్మలు మాత్రం పెటీబూర్జువా సామాన్యానికి అంకితమైవున్నాయి.

అందుచేత మన ప్రేక్షకులెవరు అనే సమస్యకు స్పష్టమైన పరిష్కారమార్గమే కనబడదు.

ఈలోపాన్ని సరిదిద్దుకోడానికి మనకి చాలాకాలం పడ్తుంది. ఎంతకాలంపట్టినా ఒకటి మాత్రం మనం చూసుకోవాలి. ఆలోపాలను సరిచేసుకుతీరాలి. అదిన్నీ అసంపూర్ణంగా కాకుండా పూర్తిగా పరిష్కరించాలి. ఇది మన రచయితల, కళాకారుల కర్తవ్యం. వారు తమ దృష్టులను ఇటుమరలించాలి. కార్మిక కర్షకుల్లో వాళ్ల లోతుగా చొరబడాలి. వారి పోరాటాలలో పాల్గొనాలి. మార్క్సిజాన్ని లెనినిజాన్ని బాగా అవగాహనం చేసుకుంటూ సమాజాన్ని గురించి పరిశోధనలుచేస్తూ వారు ప్రజాసామాన్యం వైపుకురావాలి. కార్మిక కర్షకులయొక్క నిజమైన సారస్వతాన్ని, కళలను స్థిరంగా ఉండేటట్లు నెలకొల్పాలంటే ఇదొక్కటేమార్గం.

మన ప్రేక్షకులెవరు? అనేది ఒక ప్రధానమైన సమస్య. సిద్ధాంతసంబంధమైన సమస్య. ఇంతకాలంనుంచీ మనవాళ్లుజరిపే చర్చలూ తెచ్చే వాదనలూ గందరగోళంగాను, అనైక్యతతోకూడినవిగానూవుంటూ వచ్చినందువల్ల మన కామ్రేడ్స్ ఈప్రధాన సమస్యకు పరిష్కారమార్గం కనుక్కోలేక దానిని విడిచిపెట్టి ఇతర అప్రధానవిషయాలను పట్టుకొని వేలాడుతున్నారు. ఈ ముఖ్యసూత్రంమీద మనవారెవరికీ అభిప్రాయభేదాలుండవు. ఎందుకంటే దీనిపై చర్చలుజరిపే రెండు పక్షాలూ ప్రజాసామాన్యంనుంచి కొంతవరకు దూరమైఉన్నవారే. ఉభయులూ కార్మిక కర్షకుల్ని అసహ్యించుకొనేవారే.

మనలో ఈలోపం వుంది. ఈ తప్పుడుధోరణివుంది. అత్యంత ముఖ్యమైన యీ సమస్యను పరిష్కరించకపోతే మనలనెదుర్కొనే యితర సమస్యలను అంతసులభంగా పరిష్కరించలేం.

మన సారస్వతంలోను, కళారూపాలలోను వున్న సెక్టేరియనిజంకూడా ఒక ప్రధాన సిద్ధాంతానికి సంబంధించిన సమస్యే. ఈ సెక్టేరియనిజంనుంచి బైటపడాలంటే మనం ఈ దిగువ నినాదంతో ముందుకురావాలి.

"కార్మిక కర్షకులకోసం పనిచేయాలంటే ప్రజాసామాన్యంలోకి చొరబడాలి"

ఈ పాలసీని ఆచరణలో పెట్టడంద్వారానే మన ఆశయాన్ని నెరవేర్చగలం. లేకుంటే ఈ సెక్టేరియ నిజాన్ని మనం ఎప్పుడూ పరిష్కరించలేం.

ఒకే ఆశయం, ఒకే దృక్పథం అనేవి లేకపోవడంవల్లనే విప్లవ వైజ్ఞానిక రంగంలోపనిచేసేవారిలో అనైక్యత వస్తోంది. ప్రజాసామాన్యంకోసం పనిచేయడమనే ఆశయమే దీనిని తొలగించుకోడానికి సాధనం.

ఇది అన్నిచోట్లా మనల్ని ఎదుర్కొంటున్న సమస్యే. కొన్నిచోట్ల యిది మరీ క్లిష్టంగావుంది. కారణం అక్కడి అభివృద్ధికాముకులైన రచయితలూ, కళాకారులూ నిర్బంధాలతో అణచపెట్టబడివున్నారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకోడానికి అవకాశాలులేవు.

ఈ సమస్యను పరిష్కరించడానికి మార్క్సిజం లెనినిజం అధ్యయనంజేయడం. ఆ వెలుగులో సమాజాన్ని పరిశోధించడం అనేవి తోడ్పడతాయి. మార్క్సిజం-లెనినిజం అంటే గ్రంథాలలోవుండే సిద్ధాంతాలు చదవడంకాదు. నేటి ప్రజాజీవితానికి పోరాటాలకు అన్వయింపజేయబడిన సజీవ సిద్ధాంతం. పుస్తకాలలోవున్న మార్క్సిజం లెనినిజాన్ని ప్రజలకి అన్వయింపజేస్తే, ప్రజలలోకి తీసుకువెడితే అది సజీవ సిద్ధాంతం ఔతుంది. ఆపనిజేయడంలో మనలోవుండే సెక్టేరియనిజం కూడా మాయమౌతుంది. దానితో ఒక సెక్టేరియనిజమేగాకుండా ఇంకా ఇతర సమస్యలుకూడా పరిష్కారమైతాయి.

ప్రచారం, సంస్కారం అనే సమస్యలు :

ప్రజలకోసం పనిచేయడమెలాగ? అనే ప్రశ్నకువద్దాం. దీనినే మనకామ్రేడ్స్ సంస్కార సమస్యఅనీ, ప్రచారసమస్య అనీ అంటూవుంటారు.

ఇంతకుపూర్వం చాలమంది కా(మ్రేడ్స్ (ప్రచారసమస్యను, అంటే ప్రజలలో మన రచనలను వ్యాపింపజేయడమనే కర్తవ్యాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారు. అదే సమయంలో సంస్కారం తీసుకురావడమనే కర్తవ్యాన్ని గోరంతలు కొండంతలు చేస్తారు. సంస్కార సమస్యయొక్క ప్రాముఖ్యతనుగూర్చి హెచ్చరించవలసినమాట నిజమేగాని ఆవిషయానికి ఉన్నదానికంటె యెక్కువ ప్రాముఖ్యతనివ్వగూడదు.

పేక్షకులనుగూర్చిన సమస్యకు మనకు యింకా సరియైన పరిష్కారమార్గందొరక లేదు ఈ సమస్య విషయమై ఆలోచించినపుడుకూడా పైసమస్యే తిరిగి యిక్కడ వుదయిస్తుంది. మనం ఎవరికోసం పనిచేయాలో మనకొక స్పష్టమైన దృక్పథం లేక పోవడంవల్ల ఈ సంస్కార కార్యక్రమానికీ రచనలను ప్రజలలో వ్యాప్తిలోకి తీసుకువచ్చేపనికీ వున్న సంబంధంఏమిటో నిర్ణయించేస్థాయి మనకురాలేదు. ఇప్పుడు మనం సృష్టించే సారస్వతం, కళలు కార్మిక కర్షకులకోసం. కనుక ఆ ప్రేక్షకుల్నే దృష్టిలో పెట్టుకొని, వాటిని వ్యాప్తిలోకి తీసుకురావడమనే విషయాన్ని చర్చించాలి. ఆ ప్రేక్షకుల్నే దృష్టిలోపెట్టుకొని సంస్కారవిషయంకూడా ఆలోచించాలి.

మనం వ్యాప్తిలోకితెచ్చే విజ్ఞానం ఏమిటి? ఫ్యూడల్ విజ్ఞానమా? బూర్జువా విజ్ఞానమా? లేక పెటీ బూర్జువా విజ్ఞానమా? ఇవి ఏవీ కావు. మనం దేనినయినా ప్రజాసామాన్యంలో వ్యాప్తిలోకి తేవాలంటే అది వారి విజ్ఞానంద్వారానే చేయగల్గుతాం గాని మరోవర్గ విజ్ఞానంద్వారా కాదు. అందుచేత కార్మిక కర్షకుల్ని విజ్ఞానవంతులను చేయాలనే కార్యక్రమానికి పూనుకోడానికి ముందు మనం వారివద్దనుండి సంగతులను నేర్చుకోడమనేపనిని పూర్తి చేసుకోవాలి.

సంస్కారంతెచ్చే విషయంలోకూడా అదే వర్తిస్తుంది దానికి ఎక్కడో ఒక చోట మొదలుపెట్టటమనేది జరగాలి. సారస్వతాన్నిగానీ కళలనుగానీ, సంస్కరించాలంటే అవి ఏస్థాయిలోవున్నాయో తెలుసుకొని, ఆ స్థితినుండి ఉన్నతస్థాయికి వాటిని తీసుకుపోవాలి. ప్రస్తుతం వున్నస్థితి అన్నప్పుడు ఫ్యూడల్ వర్గదశా? బూర్జువా వర్గదశా? లేక పెటీ బూర్జువా వర్గదశా? ఎక్కడినుండి అభివృద్ధిచెయ్యాలి. ఇవి ఏవీకానే కావు మనం తీసుకోవలసినది.

మనం ఎక్కడనుంచి ఆరంభించాలి అనే విషయం అర్థంచేసుకుంటే యెక్కువ వ్యాప్తిలోకి తీసుకొని రావలసిన విషయాలు సంస్కరించాల్సిన విషయాలు ఏమిటో ఎలాగో అర్థమైతాయి. రెండింటికీ మధ్య వున్న సరియైన సంబంధం ఏమిటోకూడా నిర్ణయించగల్గుతాం.

విజ్ఞానం ఏస్థాయిలోవున్నప్పటికీ దాని రూపంమటుకు మన మనస్సులలో ప్రతిబింబించేదీ తయారుచేయబడేదీ ఐన ప్రజాజీవితం దానిలోవుంటుంది. ఆవిధంగా మనం సృష్టించే విప్లవ సారస్వతంలోను, కళారూపాలలోను విప్లవకారులైన రచయితలా, కళాకారులా మనస్సులలో ప్రతిబింబించేదీ, తయారుచేయబడేదీ అయిన ప్రజాజీవితమే యిమిడివుంటుంది.

గనులలో ముడిపదార్థంలోనుంచి మంచిలోహాన్ని తీసినట్లుగా ప్రజాజీవితంనుంచి వుత్తమసారస్వతం, కళలు రాబట్టవచ్చు. ప్రాథమికదశలో అవి ప్రాచీనంగా మోటుగా వున్నప్పటికీ, కొల్లలుగా ప్రజాజీవితంలో మనకవి లభిస్తాయి. ఇక్కడ మనకొక అంతులేని గని వుందన్నమాట. ఆగనిలోంచి మనం ఎంతయినా తవ్వి తీసుకోవచ్చు అది అక్షయం.

చాలమంది ఒక ప్రశ్న అడుగుతారు. అచ్చుపుస్తకాలలోవుండే సారస్వతం, కళలు అంటే పురాతన రచనల సంపుటాలు, విదేశ రచనలుకూడా మనకి ప్రోత్సాహమిచ్చేవిగాను, తర్ఫీదు యిచ్చేవిగాను వుండవా?

నిజమే మనం వాటిని స్వీకరించాల్సిందే. కాని ప్రధానమైన ఆధారాలుగా మాత్రం కాదు. వాటికి ప్రథమ స్థానం యిచ్చేపని ఆరంభించామంటే మనకి సరియైన దృక్పథం ఏర్పడదు. అంతా తల్లకిందులు కార్యక్రమంగా తయారైతుంది, పుస్తకాలు గాని యితరత్రా లభ్యమయ్యే వైజ్ఞానిక స్వరూపాలుగాని గనులు కావు. గనులనుంచి తీయబడిన సరుకులుమాత్రమే. మన తాతముత్తాతలు, విదేశ రచయితలు, కళాకారులు వాటిని తయారు చేశారు. వారివారి కాలాల్లో ఆనాటి సమాజంలో ప్రజాజీవితంనుంచి సారస్వతం కళలు ఎలా ఉద్భవిస్తాయో తెలిసినవారు వాటిని తయారుచేశారు. వాటినుంచి మనం కొంత తీసిపారేయవచ్చు. అద్దంలో ముఖంచూసుకున్నతర్వాత అద్దాన్ని అవతలపెట్టినట్లు మనకు కావలసిన విషయాలను చూసుకున్నతర్వాత వాటిని పక్కన పడెయ్యాలి. మన కాలంలో, మన సమాజంలో ప్రజాజీవితాన్నుంచి సారస్వతాన్ని కళలను తయారుచేయటానికి అన్వయాలుగా మాత్రమే ఆ గ్రంథాలను ఉపయోగిస్తాం. నిజం చెప్పాల్సొస్తే అలాంటి ఎరువు అద్దాలలో చూదామా లేదా అనేది ప్రధానంకాదు. దానివలన మనకు తెలిసేదల్లా నాగరికతకీ, అనాగరికతకి వున్న తేడా. సంస్కరింపబడినదానికీ మొరటుదానికీవున్నతేడా. ఉన్నతస్థాయిలో వున్నదానికీ, నిమ్నస్థాయిలో వున్నదానికి వున్నతేడా. సహజంగా మన పూర్వులూ విదేశస్తులూ తయారుచేసిన ఈ అద్దాన్ని మనం తిరస్కరించం. అది ఫ్యూడల్ వర్గానికిగాని, బూర్జువా వర్గానికిగాని

చెందివున్నప్పటికి మనం దాన్ని త్రోసిపుచ్చం. కాని ఒకవిషయం మాత్రిం గుర్తుంచు కోవాలి. నేటి ప్రిజాజీవితాన్ని గూర్చి మనంచేసే పరిశోధనలకి బదులుగా మాత్రిం దాన్ని వుపయోగించకూడదు. అది ఉపయోగపడదుకూడా. ఎందుకంటే నేటి పరిస్థితిని గతించినకాలం ప్రతిబింబింపజాలదు. ఈ విచక్షణ లేకపోయినా, దానిని గుడ్డిగాఅనుక రించినా లేదా యిప్పుడున్నదానికి బదులు ఆ మృతవిజ్ఞానాన్నిగాని విదేశ విజ్ఞానాన్ని గాని తెచ్చిపెట్టినా అది చాలా ప్రిమాదానికి దారితీస్తుంది. మన సారస్వతంలోను, కళలలోనూ నిరుపయోగమైన మొండివాదనలను తెచ్చిపెడ్తుంది.

అందుచేత విప్లవ రచయితలు, కళాకారులు తదితర వైజ్ఞానికవర్కర్లు ప్రిజా సామాన్యంలోకి వెళ్లాలి. ఆ వెళ్ళడమనేది హృదయపూర్వకంగాను, ఏవిధమైన సంకో చాలు, షరతులులేకుండాను. ఎక్కువకాలం ప్రిజలమధ్య పనిచేయటానికి సిద్ధంగానూ వెళ్లాలి. అగ్నిపరీక్షలవంటి పోరాటాల్లో వెనుకాడకుండా నిలబడి పోరాడాలి? అంతు లేని ప్రజాజీవితమనే గనియొక్కలోతులు చూడాలి. అన్నిరకాల ప్రిజల్ని సంఘంలో అన్నితరగతులవారినీ, వారి జీవితాల్ని. వారి పోరాటాన్ని వారిలో ద్యోతకమయ్యే రక రకాల విజ్ఞానాన్ని పరిశీలించాలి. పరిశోధించాలి. అవగాహన చేసుకోవాలి, అలా చేయగలిగినప్పుడే నూతన విజ్ఞానాన్ని సృష్టించి తయారుచేసే విధానంలో ప్రవేశించ గలుగుతాం. ఆ పద్ధతిలోనే ముడిపదార్థాలనుంచి మేలు సరుకులు తయారుచేయటం, పరిశోధనలనుంచి కొత్తవిజ్ఞానాన్ని సృష్టించటంఎలాగో తెలుసుకోగలుగుతాం. ఇదికాక మరోపద్ధతి అవలంభిస్తే రచయితగాను, కళాకారునిగాను మనంపడేశ్రమంతా బూడిదలో పోసిన పన్నీరైతుంది. ఎందుచేతనంటే అసలు ముడిపదార్థమనేదే చేతిలో లేకుంటే మేలుసరుకు ఎలా తయారైతుంది? అలాచేస్తే మీరు వట్టి పోసుకోలు రచయితలు మాత్రమే ఔతారు. కళలేని కళాకారులౌతారు.

ఆదర్శవంతమైన సారస్వతాన్ని, కళలను సృష్టించటానికి ప్రస్తుతం అవి ఏస్థితిలో వున్నాయో అదే దానికి ఆధారభూతమైనప్పటికీ ఆదర్శవంతమైనదానికంటె ఇప్పుడున్నవి ఎంతో సజీవమైనవి, అర్థసమన్వితమైనవి ఐనప్పటికీ ప్రిజలు యింకా ఆదర్శసారస్వతాన్ని, కళలనూ మాత్రిమే కోరుతారు. ప్రస్తుతంవున్న సారస్వతం తోను కళలతోను వారు సంతృప్తిచెందరు. అయితే దీనికి కారణమేమిటి? ఆదర్శ వంతంగా తయారుచేయబడిన కళలు, సారస్వతమూ ఎక్కువ నిర్మాణయుక్తంగాను విషయపరిజ్ఞానంలో కేంద్రీకృతమైనవిగాను ఆదర్శవంతంగాను వుంటాయి. అంతేకాక

సాధారణంగావీ పరిస్థితికైనా అన్వయింపజేసుకోటానికి తగినట్లుగావుంటాయి. అందుచేత వారికదినచ్చుతుంది.

ఉదాహరణకు జీవించివుండే లెనిన్, ఒక నవలలోగాని, సినిమాలోగాని చిత్రించబడే లెనిన్‌కంటె ఎంతో శక్తివంతంగాను, అర్థసమన్వితంగాను వుంటాడు. కాని జీవించివుండే లెనిన్ రేయింబవళ్లు ఎంత కష్టపడి పనిచేసినా అది అందరూచేసేపనిలా కనిపిస్తుంది. అంతేగాక బ్రతికున్న లెనిన్‌ను అందరూ చూడటానికి అవకాశం వుండదు. సరే, చనిపోయిన తర్వాత ఆయన కనబడనే కనబడడుగదా! ఈదృష్టితో ఆలోచిస్తే బ్రతికున్న లెనిన్‌కంటె, నవలలోనో, చలనచిత్రంలోనో, కనబడే లెనిన్ ఎక్కువ శక్తివంతమైన వాడవుతాడు అతని ఆదర్శమూర్తి చదవనేర్చినవారికీ, సినిమా చూచేవారికీ అందరికీ అందుబాటులోవుంటుది.

విప్లవాత్మకమైన నవలలోగాని, నాటకంలోగాని, చలనచిత్రంలోగాని మన సాంఘిక జీవితానికి సంబంధించిన అనేక పాత్రలను సృష్టించవచ్చు. ప్రజలను ఎక్కువ విజ్ఞానవంతులనుచేయడానికే, చరిత్రను ముందుకు తీసుకుపోవడానికే అవి తోడ్పడతాయి. ఉదాహరణకు నేడు మన సమాజంలో బాధలుపడేవారిని, ఆకలితో మాడేవారిని అణచిపెట్టబడి దోచుకోబడేవారిని అనేకమందిని మనం చూస్తున్నాం. మరోప్రక్క తోటిమానవుని దోచుకుంటూ, సర్వ సౌఖ్యాలూ అనుభవించే భోగ లాలసులనీ చూస్తున్నాం. ఈ స్థితి ఎంతవ్యాపితంగా వుందంటే ప్రజలంతా దీనికి అలవాటు పడిపోయి, ఇది ఇంతేలే అనే భావంతో జీవిస్తున్నారు. కాని రచయితలు, కళాకారులూ, ఈ నిత్య జీవిత సంఘటనలనే సునిశితంగాను నిర్మాణయుక్తంగాను సృష్టించగలరు. తద్వారా ప్రజలలో ఉద్వేగం కలిగించగలరు. వారికి ప్రోత్సాహమివ్వగలరు. వారు తమ జీవిత పరిస్థితిని మార్చుకొని అభివృద్ధి చేసుకోటానికి, ఐక్యమై పోరాటం సాగించేందుకు ముందడుగు వేయించగలరు. ఆ విధంగా మనం సారస్వతాన్ని, కళలను తయారు చేయకుండా అవి ప్రస్తుతం ఏ పరిస్థితిలోవున్నాయో అలాగేవుంచినట్లయితే మన కర్తవ్యం నెరవేరదు. కనీసం మనం అనుకున్నంత ఫలవంతంగాను, తొందరగాను నెరవేరదు.

ప్రజా సామాన్యంలో ఎక్కువ వ్యాప్తిచెందిన సారస్వతం, కళలూ, సంస్కరించబడిన సారస్వతం, కళలూ, ఈ రెండూకూడా తయారుచేయబడినవే. ఐతే ఈ రెండింటికీ వున్నతేడా ఏమిటి? అది తర, తమ భేదంతప్పితే మరోటికాదు. ప్రజలలో ఎక్కువ

వ్యాప్తిచెందిన సారస్వతం, కళలూ, ఎక్కువగా తయారైనవికావు, అవి కొంతవరకు మోటుగావుంటాయి, వున్నప్పటికీ, ప్రజాసామాన్యంచే తొందరగాను సులభంగాను అర్థంచేసుకోబడేట్లుంటాయి. ప్రజలకు ఇప్పుడున్నస్థాయినిబట్టి సంస్కరింపబడిన ఆదర్శ సారస్వతాన్ని, కళలను, తొందరగా గ్రహించలేరు జీర్ణించుకోలేరు. ఇవి ఎక్కువగా మెరుగులు పెట్టబడినవిగా వుంటాయి. ఎక్కువసంఖ్యలో తయారు చేయ బడతాయి.

నేడు మనదేశంలో కార్మిక కర్షకుల్ని ఎదుర్కొంటున్న అత్యవసర సమస్య శత్రువుతో సల్పవలసిన తీవ్రయుద్ధం. ఎంతోకాలంగా ఫ్యూడల్ బూర్జువా వర్గాల పాలనక్రిందపడి నలిగిఉండడంవల్ల, మన జనసామాన్యం ఎక్కువగా చదువను, వ్రాయను నేర్చుకోలేకపోయింది. వారింకా అనాగరికంగానే ఉండిపొయ్యారు. అందు చేత వారికీ నాడు వెంటనే కావలసింది విద్యాజ్ఞానం, ఆవుద్యమం బయలుదేరాలి. వారివిజ్ఞాన స్థాయిని సారస్వతాన్ని, కళలను, అర్థంచేసుకోగలిగిన దశకు తీసుకురావాలి. ఈ సారస్వతం కళలు, వారికి అవగాహనయై పోరాటంలో వారికి నూతనోత్సాహాన్ని, నూతనశక్తిని కలిగించేదిగాను అంతిమవిజయంలో విశ్వాసం కలిగించేదిగానువుండాలి.

ఆ విధంగావారిలో ఐక్యతను పెంపొందించి వారంతా ఒకే హృదయంతో ఒకే ఆశయంతో శత్రువును ఎదుర్కొనేట్లు చెయ్యాలి. అంచేత మనపని యిప్పుడు సారస్వ తానికీ, కళలకూ సంస్కారం పేరుచెప్పి నగిషీలు చెక్కడంకాదు. వాటిని ప్రజా సామాన్యంలోకి ఎక్కువగా ప్రచారంలోకి తీసుకొనిపోవడమే మన ప్రథమ కర్తవ్యం. తక్కువగా దీనిని అంచనావెయ్యటం చాలా ప్రమాదం.

ఏమైనప్పటికీ ఒకసంగతి మాత్రం మనం మర్చిపోకూడదు. వ్యాప్తిలోకి తీసుకు రావటం అనేది, సంస్కరించటం అనేది ఒకదానికొకటి సంబంధంలేని సమస్యలుకావు. మనసారస్వతాన్ని, కళలను ప్రజలలో వ్యాప్తిచేసేవారు వాటిలో ప్రజలకు దారిచూపుతూ ఒకడుగు ముందుండాలి. లేకుంటే మన ప్రచారానికి అర్థం వుండదు. మన ప్రచార విధానం ఎదుగూ బొదుగూ లేకుండా ఎప్పుడూ ఒకేపద్ధతిలోవుంటే అది నిష్ప్రయో జనం. అప్పుడు మన వుద్యమం "ఎక్కడున్నావే గొంగడీ అంటే వేసినచోటనే వున్నాను" అనే స్థితికోనేవుంటుంది మన రచయితలు, "నీ పుర్రచెయ్యి తియ్యి, నా ఎడమచెయ్యి పెడ్తాను" అనే మాదిరిగానే మార్పుచెందుతూ వుంటారు. అంతే.

ప్రజలు మన సారస్వతాన్ని, కళలను తమకు ఎక్కువగా అందాలని కోరు తారు. అంటే అవి తమలో ఎక్కువ వ్యాప్తిచెందాలని కోరుతారు. కాని అదే సమ

యంలో అవి సంస్కరింపబడేవిగా వుండాలని కూడా వాంఛిస్తారు. ప్రతినెలా, ప్రతి సంవత్సరం వాటిలో వారికి అభివృద్ధి కనబడుతూవుండాలి. సారస్వతం, కళలూ ప్రజలలో ఎక్కువ వ్యాప్తిచెందడమంటే ఎక్కువ విజ్ఞానవంతులను చేయడం ఎలా అవుతుందో అలాగే వాటిని సంస్కరించడమంటే ప్రజలను సంస్కరించడమే ఔతుంది. సంస్కారమనేది గాలిలో జరిగేదికాదు. ఏ గదిలోనో నాల్గుగోడల మధ్య జరిగేది అంతకన్నాకాదు. అది ప్రజలలో జరగవలసిన ప్రచారంమీద ఆధారపడి ఉంటుంది. అందుచేత సంస్కారమనేది ప్రజలలో జరిగే వ్యాప్తిచేత నిర్ణయించబడుతుంది. అదే సమయంలో ఆ వ్యాప్తిచెందే విధానానికి యిది దారిచూపుతూ వుంటుంది. ఆ రెండింటికీ వున్న అవినాభావసంబంధం అది.

క్లుప్తంగా చెప్పాలంటే సంస్కారమనేది ప్రజాసామాన్యంలో జరిగే ప్రచారం మీద ఆధారపడి వుంటుంది. అలాగే ప్రజాసామాన్యంలో చేయబడే ప్రచారం ఈ సంస్కరణచే నడపబడుతూ వుంటుంది. ఈ రెండింటి విషయంలోను మనం అవలంభించే కార్యక్రమం యితర దేశాలలోని పద్ధతులను అనుసరించినదిగా వుండకూడదు. గుడ్డిగా యితర దేశాలవారి పద్ధతులనే తు. చ తప్పకుండా మనదేశంలో అమలు జరపటం చాలప్రమాదం. అది ఒక్కొక్కప్పుడు మన ఉద్యమాన్ని నాశనంచేస్తుంది.

సంస్కరణ అనేది రెండురకాలుగా వుంటుంది. ప్రజలకు ప్రత్యక్షంగా కావలసిన సంస్కరణ ఒకరకం. రెండోది పరోక్షమైనది. ఇది మన విప్లవ సభ్యులలో రావలసిన సంస్కరణ. మన విప్లవ సభ్యులంటే ప్రజాసామాన్యంలో అభ్యుదయకరమైన భాగం గనుక వీరికది అవసరం.

మన విప్లవ సభ్యులు సాధారణంగా కొంత విజ్ఞానాన్ని పొందివున్నారు. మామూలు ప్రజలకంటే విషయాలను అవగాహన చేసుకోడంలో వీరు మెరుగు. అందుచేత సామాన్యప్రజలలో ప్రచారంచేసే స్థాయిలోనే వీరు తృప్తిపడరు. వీరిస్థాయి హెచ్చు. ఈవిషయాన్ని మనం మర్చిపోగూడదు. అశ్రద్ధచేయకూడదు.

మన పార్టీసభ్యుల యొక్క అవసరం ప్రజావసరాలకు కొంచెం వ్యత్యాసంగా వున్నా, ప్రస్తుతానికి అది యింకా సంకుచితంగానే వుంది. ఈ అవసరాన్ని మనం తీర్చాలికాని, కేవలం అది ఒక్కటే మన కార్యక్రమం కాకూడదు మన కార్యక్రమంలో ఇదికూడా ఒకభాగంగా మాత్రమే ఉండాలి. అదే సమయంలో మనం యింకో సంగతికూడా గుర్తించాలి, మన విప్లవపార్టీ సభ్యులకోసం ఏదిచేసినా అది ప్రజలకోసం

చేసినట్లే. ఎందుచేతనంటే ప్రజలను విజ్ఞానవంతులను చేసి నడిపేది మన విప్లవపార్టీ సభ్యులే. మనం ఈ సూత్రాన్ని నిరాకరించి మన పార్టీసభ్యులకు కావలసిన విషయ పరిజ్ఞానాన్ని యివ్వకపోతే వారు ప్రజల్ని గమ్యస్థానానికి నడపలేరు. అప్పుడు మనం చేసే పనంతా అడవికాచిన వెన్నెలైతుంది. ప్రజలకోసం పనిచేయాలి అనే ప్రధాన సూత్రం నుంచే మనం దూరమైపోతాం.

ప్రజాజీవితం అనే గనినుంచి వచ్చిన సారస్వతం, కళలు అనే ముడిపదార్థం విప్లవ రచయితలయొక్క, కళాకారుల యొక్క చేతులలోపడి ఒక ఆదర్శ సారస్వతం గానూ, కళగానూ, తయారై ఆ ప్రజలకే వుపయోగపడ్తుంది. ఇలా తయారయేవాటిలో తక్కువ స్థాయిలోవుండే సారస్వతం కళలనుండి ఎక్కువస్థాయిగలవిగా అభివృద్ధి చేయబడినవీ ఒకరకం వుంటాయి. ఇవి ప్రజలలో అదివరకే కొంత అభివృద్ధిచెందిన భాగానికి, ప్రధానంగా ప్రజల్లోవుండే విప్లవపార్టీ సభ్యులకు అవసరం. యిదికాక కొంత తక్కువ స్థాయిలోను, కొంత వెనకబడినదిగానూ ఉండే సారస్వతం, కళలూకూడా వున్నాయి. ఇవి ఈ హెచ్చుస్థాయిగల ప్రజాసారస్వతం చేతనూ కళలచేతనూ సంస్కరింపబడుతున్నాయి. ఈ రెండోరకం ప్రజాసామాన్యానికి నేడు ఎక్కువగాకావాలి.

మన సారస్వతం, కళలూ, హెచ్చుస్థాయిలో వున్నాసరే, తక్కువస్థాయిలో వున్నాసరే అవి ప్రజాసామాన్యం కోసం ముఖ్యంగా కార్మిక కర్షకులకోసం పనిచేస్తు న్నాయి. మనం తయారుచేసేవన్ని వారికోసమే గనుక వారికవి ఉపయోగపడేవిగా వుండాలి. ఇప్పుడు మనం సంస్కరణకీ, వ్యాపింపచేయటానికిఉన్న సరియైన సంబంధం ఏమిటో తేల్చాం. దీనివల్ల పైరెండు కార్యక్రమాలలోనూ నిమగ్నులయ్యే నిపుణుల మధ్య ఉండాల్సిన సంబంధం ఏదోకూడా పరిష్కరించగలం. సంస్కరణ కార్యక్రమంలో పనిచేసే నిపుణులు కేవలం విప్లవపార్టీ సభ్యులకోసమే కాకుండా, ప్రజా సామాన్యంకోసం కూడా పన్చేయాలి.

మాగ్జిం గోర్కీ వివిధపార్టీల నుంచి వచ్చే రచనలను ఎడిట్ చేస్తూండేవాడు. పత్రికలకు గ్రామాలనుంచి రిపోర్టులు పంపేవారిని ఆర్గనైజ్ చేస్తూనూ ఉండేవాడు. యువకులైన రచయితలకు రచనాపద్ధతులను నేర్పుతూనూ ఉండేవాడు. లూహూసాన్ తనకాలాన్ని ఎక్కువగా విద్యార్థులతో ఉత్తర ప్రత్యుత్తరాలకోసం వినియోగించేవాడు. మన రచయితలు యువరచయితలకోసం ఎక్కువకాలాన్ని వినియోగించాలి. వారి సంఘాలను నిర్మించి వారిని అభివృద్ధిచెయ్యాలి. మన గాయకులు జానపదాలకోసం, సమిష్టిగానాలకోసం ఎక్కువకాలాన్ని వినియోగించాలి. అలాగే చిత్రకారులు ప్రజల

చిత్రకళకోసం ఎక్కువ కృషిచెయ్యాలి. ప్రజావిజ్ఞానాన్ని వ్యాపింపజేయడానికి పనిచేసే కామ్రేడ్స్‌తో పైనచెప్పిన అనుభవజ్ఞులంతా దగ్గరసంబంధం పెట్టుకోవాలి. వారికి ఈ నిపుణులు దారిచూపుతూ వుండాలి, కాని ఈపని చేసేటప్పుడు ఆ వర్కర్ల వద్దనుంచి కూడా ఈ నిపుణులు కొన్నిసంగతులు నేర్చుకోవాలి. ఆవిధంగా తమ విజ్ఞానాన్ని, అనుభవాలను పెంపొందించుకొని ఎక్కువ అభివృద్ధిచెందుతూ వుండాలి. ఆవిధంగా తమవిజ్ఞానం, అనుభవాలు, ప్రజలనుండి, యదార్థ పరిస్థితులనుండి దూరంగాకుండా చేసుకోవాలి. తమ వూహలన్నీ గాలిమేడలుకాకుండా చూసుకోవాలి.

అనుభవజ్ఞులైన రచయితలను, కళాకారులను మనం గౌరవించాలి. వారికృషి మనకు అమూల్యం. కానివారికి ఒక విషయంకూడా జ్ఞాపకం చెయ్యాలి. విప్లవ రచయితలు కళాకారులు తమ రచనలకు ఒక అర్థాన్ని, ఆకారాన్నిచ్చి వ్యాపింపచేస్తున్నారంటే ప్రజలతో నిత్యసంబంధం పెట్టుకోటం ద్వారానే అది సాధ్యమౌతుంది. ప్రజలకు ప్రాతినిధ్యం వహించటం మూలంగానే వారిని విజ్ఞానవంతులను చేయగలం. ప్రజలకు శిష్యరికంచేస్తేనే గురువులం కాగలం. అలాలేకుండా ప్రజలకు నీవారియజమానివని లార్డులాగా వారినెత్తిమీద కూర్చుందామనుకుంటే నువెంత గొప్పవాడవైనాసరే, నీకెంత పాండిత్యమున్నా సామర్థ్యం వున్నాసరే ప్రజలకు నీతోపనివుండదు నీకూ నీరచనలకూ భవిష్యత్తు శూన్యం.

ఐతే మన యీ దృక్పథమూ వుపయోగవాదమూ(యుటిలిటేరి యనిజం)ఒకటేనా? అనే ప్రశ్నరావచ్చు. కొందరు కామ్రేడ్స్ మనంచేసేపనిలో కళకంటె విజ్ఞాన ప్రచారం ఎక్కువగావుందిగనుక ఇది ఉపయోగవాదమే అంటారు.

మామూలుగాచూస్తే భౌతికవాదం (మెటీరియలిజం) ఉపయోగవాదానికి (యుటిలిటేరియనిజానికి)వ్యతిరేకం. కాని ఫ్యూడల్‌వర్గం, బూర్జువావర్గాల దృష్టిలో వుపయోగవాదాన్ని మనం పూర్తిగా వ్యతిరేకిస్తాం. ఎందుకంటే వారావాదాన్ని పట్టి సంకుచిత దృష్టితో స్వలాభంకోసం వినియోగించుకుంటారు. ఏ వర్గానికి సంబంధించకుండా అతీతమైన ఉపయోగవాదమనేది వుండదు. వర్గ వ్యత్యాసాలతో నిండివున్న సమాజములో ఈ ఉపయోగవాదమనేది ఏదో ఒక వర్గానికిచెందినదిగానే వుంటుంది. మనది కార్మికవర్గానికి చెందిన విప్లవకరమైన వుపయోగవాదం, ఇప్పుడూ, ఇకముందుకూడా ప్రజాసామాన్యంయొక్క శ్రేయస్సునే ప్రధానంగా పెట్టుకునే ఉపయోగవాదంమనది. అందుచేత మనం విశాలదృక్పథం కలిగిన, ఉత్తమ ఆశయంతోకూడిన విప్లవకరమైన ఉపయోగవాదులం. ఒంటెత్తు రామలింగంలాగ అప్పటికప్పుడు ఏదోలాభాన్ని పొందితే

చాలునసేరకపు ఉపయోగవాదులంకాము. ఉదాహరణకి ఏదైనారచన, ఆ రచయితకీ, అతని మిత్రి బృందానికీ, లేదా యింకా కొద్దిమంది యితరులకుమాత్రిమే నచ్చేదిగా వుందనుకోండి. అలాంటిది ప్రిజాసామాన్యానికి పనికిరాదు. ఒక్కొక్కప్పుడది వారికి అపకారిగాకూడా పరిణమించవచ్చు. ఎందుకంటే ఆ రచయిత తనయొక్క, తన చిన్న ముఠాయొక్క ప్రియోజనాలకోసమే తన భావాలను వాటిలో ప్రిచారంచేస్తాడు. అలాంటివారే యితరులను ఉపయోగవాదులని నిందిస్తారు. అలాచేసేవారే ప్రిజలను అవమానపరుస్తున్నారన్నమాట. అంతేకాదు, వారు తమ్ముతాము అర్థంచేసుకోలేని దుస్థితిలో వున్నారన్నమాట.

ప్రిజా సామాన్యంలో అధిక సంఖ్యాకులకు లాభదాయకంగా ఉండేది ఏదైనా మంచిదే నీవు ప్రిజల విజ్ఞానస్థాయిని పెంచకుండా నీ రచనలను వారు అర్థంచేసుకో లేక పోతున్నారని, వారు వెనుకబడివున్నారని నిందించితే నీవెందుకూ పనికిరావు. పైనచెప్పినట్లు ఇది సంస్కరించడం, ప్రిజలలో వ్యాపింపజేయడం అనే రెండింటినీ సమన్వయపరిచే సమస్య. ఈ సమన్వయం లేకపోతే నిపుణులైనవారు ఎంత వుత్తమ స్థాయికిచెందిన రచనలుచేసినా, అవి సంకుచితమైన ఉపయోగవాదంలో యిమిడివుం టాయి. అలాంటి రచనలను నిర్మలమైనవనీ, ఉత్తమమైనవనీ మనం ఎంతపొగిడినా ప్రిజలు మనతో ఏకీభవించరు.

ప్రిధాన సమస్యఐన ప్రేిక్షకులు, వారికోసం ఎలాపనిచేయాలి? అనేవానిని పరిష్కరించితే మన స్థానమెక్కడ? మనం ఏదృక్పథం తీసుకోవాలి? ఏవిషయాలను తీసుకోవాలి. మంచిని యెక్కువగా వర్ణించాలా, చెడును యెక్కువగా వర్ణించాలా, ప్రిజలతో కలిసిపోవాలా, అవసరంలేదా? ఉపయోగవాదం అంటే ఏమిటి? సంకుచిత దృష్టితోను, స్వలాభాపేక్షతోనుకూడిన ఉపయోగవాదమా? వర్గాలకు అతీతమైన ఉప యోగవాదమా? ఏది కావాలి? మొదలైన సమస్యలన్నీ పరిష్కారంచేయవచ్చు. మనం ఈప్రిధానసూత్రిన్ని అంగీకరిస్తే మన కల్చరల్‌వర్కర్లు, మన సారస్వత తరగతులు ప్రచురణలూ, వైజ్ఞానికదళాల నిర్మాణం, అన్నీకూడా ఆ పాలసీలనే ఆచరణలోపెట్టాలి. అలా చేయకపోవడం తప్పు. ఒకవేళ దానిని అమలులోపెట్టడంలో పొరపాట్లు సంభ విస్తుంటే వాటిని యెప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ ఉండాలి.

మే డే

...చాలా కాలంనుంచి ఎదురుచూస్తున్న మే 1వ తేదీ ఒచ్చింది.

"కామ్రేడ్స్!" అని పావెల్ బిగ్గరగా ఖంగుమనే ధ్వనితో జనాన్ని హెచ్చరించాడు. తల్లికండ్లలో వేడి కన్నీటి బిందువులేర్పడ్డాయి. అమాంతంగా ఆమెలో గొప్ప బలం చేకూరినట్లనిపించింది. ఒక్క గంతేసి తన కొడుకు ప్రక్కనే నిలబడింది. జనం సూదంటురాయిని ఇనుప ముక్కలు పట్టినట్లు అతనిచుట్టూ కడియం కట్టేరు.

తల్లి అతని ముఖంకేసి తీక్షణంగా చూచింది. ధైర్యమూ, గర్వమూ ఉట్టిపడే జ్యోతి అతని కండ్లల్లో ఆమె కగుపడింది.

"కామ్రేడ్స్! ఈ రోజున మన మెవరమో మన ఆదర్శమేమిటో విస్పష్టంగా తెలియచేసి మన పతాకాన్ని ఎగుర వేయడానికి నిశ్చయించుకున్నాం. న్యాయానికీ, ధర్మానికీ, స్వేచ్ఛకీ చిహ్నమైనదీ పతాకం!"

పావెల్ అనేసరికి జండాకర్ర జనంలోనుంచి లేచింది. పెద్దదైన ఎర్రని పక్షిలాగున కార్మికుల జండా పైకి ఎగిరింది.

పావెల్ చెయ్యెత్తేసరికి జండా గాలిలో రెపరెపలాడింది. డజనుమంది, తెల్లటి జండా కర్రను గట్టిగా పట్టుకున్నారు. తల్లికూడా చెయ్యేసింది

"కార్మికులు చిరస్థాయిగా వర్ధిల్లాలి!" అని పావెల్ నినాదాన్నిచ్చాడు.

వందలాది జనం ప్రతిధ్వానం చేశారు.

"కామ్రేడ్స్! మన భావాలకన్నిటికీ జన్మస్థానమైన మనపార్టీ సోషల్ డెమోక్రటిక్ వర్కర్సు పార్టీ' చిరస్థాయి అగుగాక!"

జనం ఒక్కసారిగా పొంగిపోయారు. జండాయొక్క ఆంతర్యాన్ని గుర్తించినవారు, దానిదగ్గర కొత్తుకొచ్చారు. మాజిన్, సమోయ్‌లొవ్, గూసెవ్ సోదరులు, పావెల్ దగ్గరకు చేరుకున్నారు. నికొలాయ్ తలవంచుకుని జనంలోనుంచి తోసుకుంటూ ముందుకొచ్చాడు. తాను ఎరగని యువజనులు, ఉద్వేగంతో తనను ప్రక్కకు నెట్టేస్తున్నారనుకుంది తల్లి.

"ప్రపంచ కార్మికులంతా చిరస్థాయిగా ఉండాలి!" అని పావెల్ అరిచాడు.

ఒక వెయ్యి గొంతుకల్లోంచి, ఒక్క సారిగా, ఆనందంతోనూ, శక్తితోనూ హృదయాన్ని కంపింపచేసే ఆ నినాదం ప్రతిధ్వనించింది.

తల్లి నికొలాయ్ చేతినీ మరొకరి చేతినీ గట్టిగా పట్టుకుంది. కండల్లో నీళ్లతిరిగి ఉక్కిరిబిక్కిరయింది, కాని ఆమె ఏడవలేదు. మోకాటి చిప్పలు వణికేయి. అదురుతున్న పెదవుల్లోంచి,

"అయ్యో నాయనలారా!...." అని గొణిగింది.

స్ఫోటకపు మచ్చల ముఖం విప్పారేటట్లుగా నికొలాయ్ నవ్వేడు. జండాకేసి రెప్పవాల్చకుండా చూస్తూ చేయి చాచేడు. గభాలున తల్లిని కౌగలించుకుని, పకపక నవ్వుతూ ఆమెను ముద్దాడేడు.

మృదుమధురమైన కంఠాన్ని ఎత్తి, జనంయొక్క రొద అణిగిపోయేటట్లు:

"కామ్రేడ్స్!" అని కేకేశాడు హొహోల్. "మనం నేడొక నూతన దేవుని పేరిట ఒక పవిత్ర యాత్ర ప్రారంభించాం. జ్ఞానం, సత్యం, న్యాయం, మంచితనం అన్నిటికీ ఆధారభూతుడు యీ దేవుడే. మనలక్ష్య మింకా చాలా దూరాన ఉన్నది! ముండ్ల కిరీటం మాత్రం దగ్గరగా చేతికందేటట్లున్నది! సత్యం జయించి తీరుతుందనే విశ్వాసంలేనివారుంటే, ఈ సత్యంకోసం ప్రాణార్పణం చేయగలధైర్యం చాలనివారుంటే అందుకు కష్టపడే శక్తి తమకు లేదని భయపడేవారుంటే అలాటివారు ప్రక్కకు తప్పుకొండి! మన అంతిమ విజయంలో విశ్వాసమున్నవారే మాకు కావాలి! మన లక్ష్యాన్ని అర్థంచేసుకోలేనివారు మాతోపాటు నడవనక్కరలేదు! ఏమంటే వాళ్లు దుఃఖపడతారు. కామ్రేడ్స్! మాతో చేరేవాళ్లు చేరండి! స్వేచ్ఛాపరులైన జనంయొక్క శలవు రోజు చిరస్థాయి యగుగాక! మే దినం చిరస్థాయి యగుగాక!"

గుంపు పెరిగిపోయింది. పావెల్ జండాను పైకెత్తి పట్టుకున్నాడు. పావెల్ ముందుకు నడుస్తుంటే, జండా గాలిలో విప్పారి రెపరెపలాడింది. సూర్యకిరణాలు దానిమీద ప్రసరిస్తుంటే అది చిరునవ్వు నవ్వుతూ విహరించింది.

ఫ్యోదొర్ మాజిన్ పాట మొదలెట్టేడు:

"పాత ప్రపంచాన్నే పరిత్యజిద్దాం...."

దజనుల కొద్దీ కంఠాలు లేచి, అతని పాట నందుకున్నాయి:

"పాదాలనంటిన ధూళిని దులిపేద్దాం!...."

తల్లి మాజిన్ వెనకాలే నడిచింది. ఆమె పెదవులమీద చిరునవ్వు తొణికిసలాడుతోంది. దృష్టి మాత్రం జండామీదా తన కొడుకుమీదా లగ్నమై ఉంది. ఆమె చుట్టూ

సంతోషపరవశులైన జనం ముఖాలే కనబడుతున్నాయి. వివిధమైన రంగులుగల కళ్లు ప్రకాశిస్తున్నాయి. ఎదుట తన కొడుకూ అన్‌ద్రేయ్ నడుస్తున్నారు. వాళ్ళిద్దరి పాటా ఆమెకు వినబడుతోంది. అన్‌ద్రేయ్ మృదుమధుర స్వరం, పావెల్ జీర గొంతుతో మిళితమై పాట సాగుతోంది:

"కార్మికులారా లెండి! సమరానికి సంసిద్ధులు కండి!
కష్టపడినా కడుపులు మండే కార్మికులారా! లెండి!"

జనం ఎర్ర జండాకేసి త్రోసుకుంటూ ముందుకొచ్చారు. కేకలేసుకుంటూ పరుగెత్తుకొచ్చారు. కాని వారి కేకలు పాటలో మునిగిపోయాయి. ఈ పాట, వాళ్లు రోజూ మెల్లగా ఇళ్ల దగ్గర పాడుకుంటున్నదే. కాని ఈరోజున ఏ అడ్డూ లేకుండా వీధుల్లో పాడుతుంటే దాని అద్భుత శక్తి వెల్లడైంది. నిరుపమానమైన ధైర్యాన్ని ఆ పాట ప్రతిధ్వనింప చేసింది. ఉజ్జ్వలమైన భవిష్యత్తుకోసం, సుదీర్ఘమైన పథాన నడవాలని ఆ పాట ప్రబోధిస్తూ, ఆ మార్గంలో సంభవించే కష్టాలనెదుర్కోవాలని నిస్సంకోచంగా స్పష్టీకరించింది. నిదానంగా మండే మంటకు, మసిపోయినట్లుగా ఆ పాట జనాన్ని అంటిపెట్టుకున్న పాత భావాలను తొలగించింది. కొత్తవాళ్ల భయాన్ని బుగ్గి చేసేసింది.

సంతోషమూ, భయమూ ముఖాన్ని ఆవరించిన ఒక స్త్రీ గభాలున తల్లి దగ్గర కొచ్చి నిలబడింది, ఒక రోదన స్వరం "మీత్యా! ఎక్కడికెడుతున్నావు?" అని కేకేసింది.

తల్లి ఆగకుండానే:

"వెళ్ల నియ్యి. అతడిని గురించి మీరు బెంగపెట్టుకోకండి. నేనూ మొదట్లో ఇలాగే భయపడ్డాను. నా కొడుకు ముందే ఉన్నాడు—ఆ జండా పుచ్చుకున్నవాడే!" అంది.

"ఏయ్, రౌడీలూ! ఎక్కడికెడుతున్నారు? అదుగో సైనికులక్కడున్నారు" అని సన్నంగా పొడుగ్గా ఉండే ఆమె హఠాత్తుగా తల్లి చేయి పట్టుకుంది.

"ఏమమ్మోయ్! వాళ్లు ఎలా పాడుతున్నారో విను! మా మీత్య కూడా!"

"భయపడకండి! వాళ్లది పవిత్రమైన కార్యం— తనకోసం ప్రాణార్పణం చేసే ప్రజలే లేకపోతే క్రీస్తు కూడా ఉండి ఉండడు" అని తల్లి ఓదార్చింది.

ఈ ఆలోచన గభాలున ఆమె మనస్సుకు తట్టింది. అతి సూక్ష్మమూ, విస్పష్టమూ అయిన ఈ ఆలోచనతో ఆమె పరవశురాలైంది. తన చేతి నింకా పట్టుకునే ఉన్న స్త్రీకేసి తీక్షణంగా చూస్తూ,

"తనకోసం ప్రాణార్పణ చేసే ప్రజలు లేకపోతే, క్రీస్తు ఉండిఉండేవాడుకాదు" అని ఆశ్చర్యంగా చిన్ననవ్వు నవ్వి మళ్ళీ ఆ మాట చెప్పింది.

సిజోవ్ ఆమె ప్రక్కకొచ్చాడు.

"ఈ రోజున బహిరంగంగా ఊరేగుతున్నారు.... ఏమంటావు?" అంటూ టోపీ ఆడిస్తూ పాటకు తాళం వాయించాడు. "పాట పాడుతున్నారు. ఎల్లాంటి పాటనుకున్నా వేమిటి?

"సమరానికి జారుకు యోధులు కావాలి.

సమర్పించండి ఆయనకు మీ కొడుకులను...."

"వాళ్ళకేమీ భయమన్నమాట లేదు. నా కొడుకే బ్రతికుంటే ..." అన్నాడు సిజోవ్.

తల్లి గుండెలో పొడిచినట్లయింది. అందుచేత కొంచెం వెనుకబడింది. గబగబా జనమామెను గోడ ప్రక్కకు నెట్టేసి పెద్ద కెరటంలా ముందుకెళ్ళిపోయారు. వాళ్ళు చాలామందయారు. కనుక ఆమెకు చాలా సంతోషం కలిగింది.

"కార్మికులారా లెండి. సమరానికి రండి!"

ఒక పెద్ద ఇత్తడి బూరా ఆ పాటను గాలిలోని కొలతపోస్తోందన్నట్లనిపించింది. ఆ పాట కొందరిని మేల్కొలుపుతోంది. కొందరిని పోరాటానికి సంసిద్ధులను చేస్తోంది. మరి కొందరిలో ఆవేదనాయుతమైన జిజ్ఞాసను ప్రకోపింపచేస్తోంది. ఇంకా కొందరిలో చెప్పడానికి వీలులేనంత అతిశయంగా సంతోషాన్ని రేకెత్తిస్తోంది. కొందరిలో భయంతో కూడిన ఆశాభావాన్ని పురిగొల్పింది. మరికొందరిలో చిరకాలంనుంచి పేరుకున్న ఆగ్రహావేశాలకు తలుపులు తెరిచేసింది. ప్రతివాళ్లు గాలిలో ఎగురుతున్న ఎర్ర జండాను తలపైకెత్తి చూస్తున్నారు.

"అడిగో వాళ్ల వెడుతున్నారు. సోదరులారా! మీకు శుభం కలుగుగాక!" అని ఎవ్వడో పరవశుడై కేక పెట్టేడు.

మామూలు మాటలలో చెప్పడానికి వీలులేనంతటి గంభీరభావం ఆ వ్యక్తి నావహించియుండడంచేత ఒక్క తిట్టు తిట్టుకున్నాడు. ద్వేషం. బానిసయొక్క అంధ ద్వేషం, సూర్యకిరణాలు సోకినప్పుడు పాము బుసకొట్టినట్లు బుస్ మంది. తిట్లు మూలంగా అది వ్యక్తమైంది.

"మతవిధ్వంసులు!" అన్నాడొక వ్యక్తి కిటికీలోనుంచి పిడికిలి ఝాడిస్తూ.

"చక్రవర్తి మీద తిరుగుబాటా? మహా ఘనత వహించిన జార్ చక్రవర్తి మీదనే! తిరుగుబాటే?" అన్నాడొక కీచుగొంతుక మనిషి.

తల్లి తన ముందటనుంచి స్త్రీలూ, పురుషులూ, ముందుకెళ్ళిపోతుంటే, కొందరి ముఖాలు చాలా కలతచెంది ఉన్నట్లామె చూచింది. జనం అలా ప్రవాహంలాగ పోతునే ఉన్నారు. ఆ పాట, వాళ్లనల్లా ముందుకు లాక్కుపోతోందా అనుకుంది. ఆ పాట ఊపుతో, రోడ్డుమీద జనాన్నందరినీ త్రోసేస్తున్నట్లనిపించింది. ఆమె ఎర్ర జండాకేసి తలెత్తి చూచేసరికి, ఆమె మనోనేత్రానికి, ఆత్మవిశ్వాసంతో ధగధగలాడే తనకొడుకు ముఖం కనబడింది.

తల్లి ఊరేగింపుకు చివరైంది. ఏవిధమైన తొందరపాటూలేకుండా, దీని పర్యవసానమేమిటో తమకు ముందే తెలుసుననే నిర్లక్ష్యంతో మాట్లాడుకుంటూ నడిచే మనుష్యుల మధ్య ఆమె చేరింది. ఏవిధమైన ఉద్రిక్తతలేకుండా వాళ్ల పరిపూర్ణమైన విశ్వాసంతో ఇలా మాట్లాడేరు:

"ఒక పటాలాన్ని స్కూలుదగ్గర ఉంచారు, మరొక పటాలాన్ని ఫ్యాక్టరీదగ్గర ఉంచారు."

"గవర్నరు వచ్చాడు...."

"నిజంగానే?"

"నా కళ్ళతో చూచాను. ఇప్పుడే వచ్చాడు!"

"ఎలాగైతేనేం వాళ్ల మనలను చూచి బెదరిపోతారు.... చూడు! సైనికులు! గవర్నరు!" అన్నాడొకడు తృప్తిగా ఒక తిట్టు తిట్టుతూ.

"మంచివాళ్ల నాయనలారా!" అనుకుంది తల్లి.

కాని ఈ మాటలామె చెవులకు కటువుగానూ, జీవరహితంగానూ సోకేయి. వీళ్ళ నొదుల్చుకుందామా అనే భావంతో చరచరా అడుగు లేసింది. వాళ్ల చాలా నెమ్మదిగా కాళ్ళీడ్చుకుంటూ నడవడంచేత వాళ్లని తప్పించుకుని ముందుకెళ్లడం కష్టమైన పని కాలేదు.

గభాలున ఊరేగింపు మొగ దేనికో గ్రుద్దుకున్నట్లయింది. భయంకరమైన శబ్దంతో బారు బారంతా వెనక్కు దబాయించబడింది. ప్రవాహంలాసాగే పాట గజగజ వణికింది. కాని వెంటనే మరింత బిగ్గరగానూ వేగంగానూ సాగింది. కాని మళ్లీ ఆగిపోయింది. ఒక్కొక్కళ్లే పాడడం మానుకుంటున్నారు. మరల పాటను వెనుకటిలా విజృంభింప చేయడానికి కొన్ని గొంతుకలు లేచాయి:

"కార్మికులారా లేవండోయి! సమరానికి లేవండోయి!
కష్టపడినా కడుపులు నిండని కార్మికులారా, లేవండోయ్...."

కాని ఈ ప్రయత్నంలో మునుపటి పటుత్వం లేదు. మునుపటి ఏకాగ్రత లేదు. ఐకమత్యంతో కూడిన విశ్వాసం లోపించింది. వాళ్ళ గొంతుకల్లో భయం ధ్వనిస్తోంది.

ఊరేగింపుకు ముందేమి జరుగుతున్నదో తల్లి కగుపడడం లేదు. అక్కడ ఏమైందో ఆమెకు తెలియదు. కనుక జనాన్ని ప్రక్కకు నెట్టుకుంటూ ముందుకెళ్ళడం మొదలెట్టింది. ఆమె ముందుకెడుతుంటే తిట్టుకుంటూ వెనక్కొచ్చేవాళ్ళనూ, తలలొంచుకుని దౌడాయించేవాళ్ళనూ, ఢీకొంది. ఏడవలేక నవ్వేవాళ్ల, వేటాకారంగా ఈలలేసే వాళ్లు ఆమె కెదురైనారు. ఆమె వాళ్ళ ముఖాలను పరిశీలనగా చూచింది. వారిని కళ్లతో హెచ్చరించింది.

"కామ్రేడ్స్!" అని పావెల్ గంభీరమైన కంఠస్వరం వినబడింది. "సైనికులు మాత్రమెవ్వరు! వాళ్లు కూడా మనలాటి ప్రజలే. వాళ్లు మనమీద చేయిచేసుకోరు. వాళ్లెందుకు చేసుకోవాలి? అందరూ తెలుసుకోవలసిన సత్యాన్ని మనం ప్రకటిస్తున్నందుకా? ఆ సత్యాన్ని వాళ్లకూడా తమ స్థితిని గుర్తించి మనలో కలసిపోయే కాలం అచిరకాలంలోనే వస్తుంది. అప్పుడు హంతకులు, బందిపోటులైనవాళ్లు పతాకం క్రింద నిలబడి మనల్ని వేధించడానికి బదులు, స్వేచ్ఛా పతాకం క్రింద మనలోకలిసిపోతారు. వాళ్లి సత్యాన్ని త్వరలో తెలుసుకునేటట్లు చేయాలంటే మనం ముందుకు సాగిపోవాలి. కామ్రేడ్స్! ముందడుగేయాలి! ఎప్పుడూ ముందుకే!"

పావెల్ కంఠస్వరంలో తొణుకూ బెణుకూ లేదు. మాటలు నిశితంగానూ స్పష్టంగానూ వెలువడ్డాయి. కాని జనం గుంపు పల్చబడుతోంది. ఒక్కొక్కళ్లేవరుసలో నుంచి తప్పుకుని ఇంటి ముఖం పడుతున్నారు కొందరు గోడలకానుకుని చూస్తున్నారు. ఊరేగింపు కొయ్య సీలలాగున మొహరించింది. ముందు పావెల్ నిలబడ్డాడు, కార్మికుల అరుణ పతాకం అతని నెత్తిమీద రెపరెపలాడుతూ ఎగురుతోంది, నల్లటి పక్షి రెక్కలార్చుకుని ఎగిరిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లు ఊరేగింపు అనింది. ఆ పక్షికి ముక్కు పావెల్.

(మాగ్జింగోర్కీ నవల అమ్మ నుంచి)

"మేము సోషలిస్టులం, అంటే మనుష్యులు స్వంతానికి ఆస్థిని సంపాదించుకోవడానికి వ్యతిరేకులం. వ్యక్తిపరంగా ఆస్థిసంపాదనవల్ల సంఘం విచ్ఛిన్నమవుతుంది. ప్రజలు ఒకరితో ఒకరు కలహిస్తారు.... వ్యక్తిగతమైన లాభంకోసం, జనం ఒకరితో ఒకరు కలవకుండా విరోధపడుతూ ఉంటారు. వైరుధ్యాన్ని కప్పిపుచ్చడానికీ, సమర్థించడానికీ అబద్ధాలాడతారు. స్వంత ఆస్థి జనాన్ని అబద్ధాలాడిస్తుంది. అవినీతిపరులను చేస్తుంది. ద్వేషాన్ని పెంచుతుంది. ఏ సంఘం, వ్యక్తిని కేవలం కొద్దిమంది ధనవంతులనుచేసే సాధనంగా మాత్రమే భావిస్తుందో, ఆ సంఘం అమానుషమైనదనీ, మా ప్రయోజనాలకు భంగకరమైనదనీ మా విశ్వాసం. అలాటి సంఘం చెప్పే నీతులు శుద్ధ అబద్ధాలనీ, మోసపూరితములనీ భావిస్తూ వాటిని మేమంగీకరించడం లేదు. వ్యక్తిపట్ల ఈ సంఘం వ్యక్తపరిచే విద్వేషాన్నీ దౌష్ట్యాన్నీ మేము ఖండిస్తున్నాం. ఈ సంఘం, వ్యక్తులను దాస్య శృంఖలాలతో బంధించడానికి చేసే సకల ప్రయత్నాలనూ మేము ఎదుర్కొంటాము. స్వార్థపరమైన ఆశకోసం మానవులను అణగద్రొక్కడానికి చేసే పనులను ప్రతిఘటిస్తాము. మేము కార్మికులం. అనగా ఎవరి కాయకష్టంచేత, పిల్లల ఆటవస్తువులు మొదలు పెద్ద పెద్ద భారీ యంత్రాలవరకూ తయారవుతున్నాయో, ఆ కార్మికులం. అయినప్పటికీ మా మానవ ఔన్నత్యాన్ని సంరక్షించుకునేహక్కు మాకు లేకుండా చేయబడింది. తమ స్వార్థంకోసం ఎవరైనా మమ్మల్ని ఉపయోగించ గలుగుతున్నారు. ప్రస్తుతానికి కొంత స్వేచ్ఛను సంపాదించాలనుకుంటున్నాం. ఆ స్వేచ్ఛ మూలంగానే, యావత్తు శక్తినీ, మా కైవసం చేసుకోవలెననుకుంటున్నాం. మా నినాదాలు చాలా సూక్ష్మమైనవి. 'వ్యక్తిగతమైన ఆస్థి నశించుగాక!' 'ఉత్పత్తి సాధనాలన్నీ ప్రజల చేతుల్లోకి రావాలి!' 'రాజకీయ అధికారమంతా ప్రజల చేతుల్లోకి రావాలి!' 'పనిచేసే విషయంలో ఎవరికీ మినహాయింపులుండకూడదు!' ఈ నినాదాలవల్ల మేము కేవలం తిరుగుబాటుదారులు మాత్రమే కాదని మీరు తెలుసుకోగలరు!"

"మేము విప్లవకారులం. ఎంతకాలమైతే, కొందరు ఏ పనిపాటులూ తాము చేయకుండా ఇతరులను ఆజ్ఞాపిస్తూ ఉంటారో, మరికొందరు పనిచేయడం తప్ప ఇంకేమీ చేయకుండా ఉంటారో, అంతకాలంవరకూ మేము విప్లవకారులుగానేఉంటాము జడ్జీలైన మీరు ఏ సంఘంయొక్క క్షేమ లాభాలను సంరక్షించడానికి ఆజ్ఞాబద్ధులైఉన్నారో ఆ సంఘానికి మేము బద్ధ విరోధులం. ఆ సంఘానికీ మీకూకూడా మేము విరోధులం. మా పోరాటంలో మేము విజయాన్ని సాధించేవరకూ మనకు ఏవిధమైన రాజీ సాధ్యం కాదు. కార్మికులమైన మేము జయించి తీరుతాం! మీ అధికారులు తామనుకుండేటంత

బలవంతులు కారు. దీనిని ప్రోవుచేసుకుని రక్షించుకోవడంకోసం తమ అధీనంలోఉన్న లక్షలాది జీవుల ప్రాణాలను వారు ఆహుతి చేస్తున్నారో, ఏదైతే మాపై అధికారం చలాయించే శక్తిని వారికిస్తున్నదో, ఆ వ్యక్తిపరమైన ఆస్థే, వాళ్లల్లో వాళ్లకు సంఘర్షణకు కారణమవుతుంది. దాని మూలంగానే వారు భౌతికంగానూ నైతికంగానూ కూడా నాశనమవుతారు. స్వంత ఆస్థిని సంరక్షించుకోవడం చాలా ఖరీదైన వ్యవహారం. నిజానికి మా యజమానులైన మీరంతా, మాకన్న కూడా ఎక్కువైన బానిసలు. మేము శారీరకంగానే బానిసలం. మీరు ఆధ్యాత్మికంగా బానిసలు. అభ్యాసం, ద్వేషం అనే కాడిని మీ మెడమీదనుంచి మీరు తొలగించలేకుండా వున్నారు. ఆ కాడే మిమ్మల్ని ఆధ్యాత్మికంగా చంపేసింది. ఆధ్యాత్మికమైన స్వేచ్ఛ ననుభవించడానికి మా కడ్డేమీలేదు. మీరు మాచేత తినిపించే విషాలు మీరు ఇష్టంలేకపోయినా మా తలకెక్కించే విరుగుళ్ల కన్న బలహీనమైనవి. సత్యాన్ని గురించి మా విజ్ఞానం రోజుకు రోజూ పెరుగుతోంది. ఆధ్యాత్మికమైన పవిత్రతగల వాళ్లందరినీ, మీ వర్గాలోనుంచి కూడా ఉత్తములైనవారిని– ఈ సత్యం ఆకర్షిస్తోంది. కొంచెం పరిశీలించండి మీ వర్గంయొక్క భావాలను సమర్థించగలవాడెవ్వడూ మీలో ఇప్పటికి లేరు. చారిత్రక న్యాయంయొక్క వత్తిడినుండి మీరు అణిగిపోకుండా రక్షించుకోగల వాదనాసమర్థత మీలో ఏష్యమైపోయింది. మీరు నూతన భావాలను సృష్టించలేకపోతున్నారు. ఆధ్యాత్మికంగా మీరు శూన్యమైపోయారు. మా భావాలు పెరుగుతున్నాయి. బలాన్ని పుంజుకుంటున్నాయి, సామాన్య జనాన్ని ఉత్తేజపరచి వాళ్లను స్వాతంత్ర్య పోరాటానికి సమీకరణం చేస్తున్నాయి. శ్రామికవర్గాల వారు తాము ధరించవలసిన పాత్రను గుర్తించిన కారణంచేత ప్రపంచంలో ఉండే శ్రమజీవులంతా ఒక్కటైపోతున్నారు. ప్రపంచానికి వాళ్లు తెస్తున్న పునరుజ్జీవనాన్ని ఆపడానికి, క్రౌర్యమూ, పరిహాసమూ తప్ప, మీదగ్గర మరే సాధనమూ లేదు. పరిహాసం స్పష్టంగానే కనబడుతోంది. క్రౌర్యం మరింత రేచ్చెడుతుంది. ఈనాడు మా కుత్తుకలమీద నున్న చేతులే రేపు మమ్ములను సోదర భావంతో కౌగలించుకుంటాయి. మీ శక్తి బంగారాన్ని పెంచే యాంత్రిక శక్తి మాత్రమే. ఆ శక్తే మిమ్మల్ని ఒకరి నొకరు మింగేద్దామనుకునే వర్గాలుగా చీలుస్తుంది. శ్రమజీవులందరూ ఒక్కటేనని రోజుకు రోజూ వృద్ధవుతూన్న సజీవమైన మా శక్తి మా చైతన్యంలోనే ఉంది. మీరు చేస్తున్నదంతా అపరాధం. ఏమంటే, అది ప్రజలను బానిసలుగా చేస్తుంది. మీ అబద్ధాలు, మీ ఆశ, మీ దుర్మార్గం ఇవి ప్రజలను భయపెట్టే పిశాచాలూ, రాక్షసులూఉండే ప్రపంచాన్ని సృష్టించాయి. ఈ రాక్షసుల బారినుండి జనాన్ని తప్పించటం మావంతు. మీరు మానవుడిని జీవితాన్నుంచి విడదీసి నాశనం చేశారు. మీరు నాశనం చేసిన ప్రపంచాన్ని సోషలిజం చేపట్టి, ఒక బ్రహ్మాండమైన ప్రపంచంగా పునర్నిర్మాణం చేస్తుంది. దాని నాపడానికి మీరేమీ చేయలేరు!"

"దాని నాపడానికి మీరేమీ చేయలేరు!"

(కోర్టులో పావెల్ ఉపన్యాసం– అమ్మ)

విప్లవ వాస్తవికత

కొడవటిగంటి కుటుంబరావు

విప్లవ సాహిత్యకారులు ముఖ్యంగా అన్వేషించదగినది జీవితంలోని విప్లవ వాస్తవికత. ఇలాటి పదం ఇంతవరకు మనమధ్య పుట్టలేదు. కాని ఈమాటను గురించి లోతుగా ఆలోచించటం చాలా అవసరం.

జీవిత వాస్తవికతలు బహువిధాలుగా ఉండటం మనం గమనిస్తున్నాం. సమస్యలు టాటా, బిర్లాల దగ్గరనుంచి డవాలీ బంట్రోతుదాకా అందరికీ ఉంటాయి. కోటీశ్వరులు తమ వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించే కృషిలో నిద్రాహారాలు కోల్పోయి, టెన్షన్ హెచ్చి, జబ్బుపడతారు. రెండో చివర కుచేలుళ్లు పిల్లలకు గంజికూడా పొయ్యలేక మనోవ్యాధి పడతారు; వాళ్ల పిల్లలు తిండిలేక మంచం పట్టేస్తారు.

జీవితంలో మతవాస్తవికతా, బూర్జువా వాస్తవికతా, మానవవాద వాస్తవికతా, ఫ్యూడల్ వాస్తవికతా— ఇలా రకరకాల వాస్తవికతలు ఉన్నాయి. ఒక వాస్తవికతను మాత్రమే ఆశ్రయించగల వాడికి మిగిలినవి అప్రస్తుతం అవుతాయి.

డిప్రెషన్ రోజుల్లో మా ఇంట్లో ఒక ప్లీడరుగారు అద్దెకు ఉండేవాడు. నాలాగే ఆయనకూడా అప్పుల కారణంగా ఉన్న స్థిరాస్తి అంతా పోగొట్టుకున్నాడు. ఆయన దగ్గిరికి ఒకనాడు ఒక క్లయింటు వచ్చి, "ప్లీడరుగారూ, ఇప్పుడు నవరసు ధర ఎంత ఉంటుంది?" అన్నాడు. వెంటనే ప్లీడరుగారు వెర్రిగా నవ్వనారంభించాడు. క్లయింటు బిత్తరపోయాడు. ప్లీడరుగారు తనను తాను సంబాళించుకుని, "మీకేమన్నా పిచ్చా? ఈ రోజుల్లో బంగారం ధర ఎంతైతే ఎవడిక్కావాలి?" అన్నాడు.

నేనుకూడా జీవిత వాస్తవికతను ప్లీడరుగారి దృష్టితోనే చూస్తూ ఉండిన కారణంచేత ఆయన చివరకు అన్నమాట నాకు పరమసత్యం అనిపించింది. బంగారం ధరకు క్లయింటు జీవితంలో స్థానం ఉన్నది, ప్లీడరుగారి జీవితంలో (నా జీవితంలో కూడా) ఆ సమయంలో స్థానంలేదు. తరవాత ఆయనగారి జీవితం మార్పుచెంది ఉండవచ్చు, ఆయన నూరు సవర్ల బంగారం కొని ఉండవచ్చు; అదివేరే విషయం.

ఏనాడైనా మనం మాట్లాడేటప్పుడు అవతలివాడు పాటించే జీవిత వాస్తవికతను గ్రహించి ప్రసంగించాలి. ఒక కుర్రవాడు హిందీ సినిమాతారల అభ్యంతర జీవితాల తాలూకు రసవత్తర విషయాలు మాట్లాడటం మొదలుపెట్టేసరికి, నాకు వాటిలో ఆసక్తి ఏమీలేదని మృదువుగాచెప్పి విషయం మార్చవలసి వచ్చింది.

సాహిత్యం మొదలైన కళలలోకూడా అంతే. కార్మికుల ముందు నైరూప్య చిత్ర కళ ప్రదర్శిస్తే వాళ్ళు వెళ్ళిపోతారు.

మానవ స్వభావం పరిపక్వమై ఉందనిగాని, ప్రతి ఒక్కరికీ తమ జీవితం తాలూకు వాస్తవం అవగాహన అవుతుందనిగాని నేను అనటంలేదు. అజ్ఞానమూ, భ్రమలూ, అపోహలూ మనందరినీ అంతో ఇంతో ఆవేశించి ఉంటున్నాయి. మనం వాటినుంచి బయటపడే ప్రయత్నంలో ఉన్నప్పుడు కళలనూ, ఇతర సాధనాలనూ ఆధారం చేసుకుంటాం.

విశ్వనాథవారు తాము ఆర్షసంప్రదాయంలో జీవిస్తున్నట్టు భ్రమపడవచ్చు. ఔత్సాహికులైన యువకులు కొందరు కుటుంబరావు, శ్రీశ్రీ రాచకొండలు పోషిస్తు సమాజంలో ఎందుకు జీవించటం లేదని ఆక్షేపించవచ్చు. మా పొరుగున ఉన్న ఒక తమిళ క్రైస్తవుడు రేడియోలో పాశ్చాత్య సంగీతం తప్పపెట్టడు; అది క్రైస్తవ సంగీత మని అతని భ్రమకావచ్చు. ఇంగ్లండు చలిదేశం గనక మనవాళ్లు ఈదేశంలో సూట్లూ, బూట్లూ, మేజోళ్లూ, మఫ్లర్లూ వేసుకు తిరగటం ఒకప్పుడు జరిగింది. అరేబియాలో నీటి ఎద్దడిగనక ఇక్కడి ముసల్మానులు స్నానం చెయ్యటం మాని, నెలలతరబడి బట్టలు మార్చుకోకపోతే వారి జీవిత వాస్తవికత వారికి తెలియదనే అనుకోవాలి.

సన్యాసులు కిరీటాలు పెట్టుకుని, ఏనుగులను పోషిస్తూ, పల్లకీలలో ఊరేగుతూ, దివాణాలు వెలగబెట్టుతుంటే అందులో విడ్డూరం ఏమీలేనట్టు భావించే జాతికి అపోహలు తక్కువవుతాయా? అపోహలనుంచి అపోహల తుట్టెలు పుట్టుకొస్తాయి. నిజం మారు తుందిగాని దానికి అనుగుణంగా విశ్వాసాలు మారవు. కులాలన్నవి భౌతిక కారణా లుండబట్టే పుట్టాయనుకోవచ్చు, కాని ఆ భౌతిక ఆధారాలు ఏనాడో అదృశ్యమయాయి. ఈనాటి కులాలు అవాస్తవమైనవి. వర్గాలే నిజమైనవి. కాని కులతత్వం గగనసౌధం లాగా నిలబడే ఉన్నది. మాదిగలు తమకన్న తక్కువకులమని గట్టిగానమ్మే మాలలు మిగిలిన కులాలు తమకన్న ఎక్కువైనవనే నమ్మకం నుంచి ఎలా విముక్తులౌతారు?

చెవులు వినపడకుండా పోయినవాళ్లకు కొందరికి కణతలవద్ద ఉండే నరాలు కొద్దిపాటి శ్రవణశక్తి నిస్తాయట. అలాగే ఆర్థికమైన పునాది అంతరించిపోయిన కులవ్యవస్థకు ఈనాడు ఆధారంగా ఉన్నవి తిండి అలవాట్లూ, మాటయాసా, కట్టూ, బొట్టూ మొదలైన క్షుద్రసంకేతాలు.

ఈ దుర్భ్రమల నుంచి వ్యక్తులు స్వానుభవంతో బయటపడటం అసంభవం కాదుకాని, దాదాపు అసాధ్యమే. సామాజిక వాతావరణం వ్యష్టి అనుభవాలను భాసించ నివ్వదు. సోడా తాగటం పాపమనుకునే పెద్దవాళ్ల మధ్యపెరిగే కుర్రవాడు తప్పులేదని తెలిసికూడా రహస్యంగా సోడా తాగుతాడు. నా చిన్నతనంలో పిల్లలు సినిమాలు చూడటం చాలా తప్పుగా భావించే పెద్దవాళ్ళు ఉండేవాళ్ళు. తమచుట్టూ ఉండేవాళ్ళ నలపరింత లేకపోతే చాలామంది తమ కుమార్తెలకు కట్నాలుపోసి పెళ్లిచేసే ప్రయత్నం కట్టిపెట్టి, చదివించి, ఉద్యోగాలు చేయిస్తారు.

అందుచేత ఈపని సాహిత్యం మొదలైన సామాజిక సాధనాలద్వారా సాగాలి. వీరేశలింగంగారు చేయించిన విధవా వివాహాలకన్న ఆయన రచనలు తెలుగు జాతిలో హెచ్చు భావపరివర్తన తెచ్చి ఉండాలి. నిజానికి జీవితవాస్తవికతను ప్రచారం చెయ్యటానికి సాహిత్యాన్ని మించినది లేదు. "ఆనాడు రావణాసురుడి గతి ఏమయింది? దుర్యోధనుడు పాండవులకు ద్రోహం తలచకపోతే ఎంతగొప్పగా బతకవలిసినవాడు!" అనే ధోరణిలో మాట్లాడేవాళ్లు ఈనాడింకా ఉన్నారు! వాళ్ళు తమ జీవితసత్యాలను రెండు వేల ఏళ్ళనాటి సాహిత్యంలో వెతుక్కోవటమే శోచనీయం.

అదీగాక ఈనాటి జీవితపు వాస్తవికతల నన్నిటినీ నిరూపించే సాహిత్యం లేదు. "మన భూమివంటి చల్లని భూమిలేదు" అన్నకవి ఆధునికుడే అయినా, అందులో తాతబిర్లాల వాస్తవికతే ఉన్నది. జీవితం ఈ భూమిలో అట్టుడికిపోతున్న వారికి ఆమాట పచ్చి అబద్ధంగా తోస్తుంది. బెంగాలులోని విప్లవవాదుల నడగండి. పోలీసులకు చిక్కి కాల్చబడ్డవారిని అడగండి. పోలీసులచేత చెరచబడిన అనాథ స్త్రీల నడగండి.

జీవితంలో విప్లవ వాస్తవికత అనేది ఉన్నది. ప్రజలు పరిస్థితులమీద తిరగబడుతున్నారు. బూర్జువా విలువలకు కూడా మంచినీళ్లు పుట్టటం లేదు. మానవతావాదం ప్రభుత్వ హింసాకాండను విమర్శించినప్పటికీ, ఆహింసాకాండకు కారణభూతమైన వ్యవస్థలో మార్పునూ, ఆ మార్పుకు సాధనమైన విప్లవాన్నీ గుర్తించలేదు.

మామూలు మనుషులు సూక్ష్మరూపంలో దేన్నీ చూడలేరు. ఏదైనా బృహత్పరిణామంలోనే వారి ఎదట కనబడాలి. గెలిచినది ధర్మయుద్ధం. విజయవంతమైన విప్లవాలు మంచివి. అసంఖ్యాకులూ, అధిక సంఖ్యాకులూ అయిన ప్రజలు జీవితంలో ప్రేక్షకుల పాత్రమించి నిర్వహించలేరు. భవిష్యత్తును నిర్ణయించే సత్యాలపట్ల వారు అంధులనే చెప్పాలి. ఆ కారణం చేతనే విప్లవ సాహిత్యం జీవితంలోని విప్లవ వాస్తవికతను ప్రదర్శించాలి.

జీవితంలోని విప్లవ వాస్తవికతను అన్వేషించటం విప్లవ రచయితల పని. అది శ్రీకాకుళం గిరిజనులకు కనిపించి నంతస్పష్టంగా, సుబ్బారావు పాణిగ్రాహికి అవగాహన అయినంత స్ఫుటంగా అందరికీ అందదు. కాని శాస్త్రవేత్తలు విలువైన ఖనిజాలనూ, మణులనూ, పాతరాతియుగపు జీవితావశేషాలనూ అన్వేషించినట్టుగా, రచయితలు తమ చుట్టూ ఉండే జీవితంలోని విప్లవ వాస్తవికతను అన్వేషించాలి. వజ్రాలకన్న కూడా విలువగలది ఈ విప్లవ వాస్తవికత. దాని అన్వేషణ కొనసాగినకొద్దీ బలమైన విప్లవ సాహిత్యం వస్తుంది. అన్వేషకులు ఈ వాస్తవికతను అది పుష్కలంగా లభించే చోటనే– అట్టడుగు జీవితాల్లో– అన్వేషించాలని వేరే చెప్పనవసరం లేదు. మణుల కోసం ఎడారులలో వెతకరు.

"నిర్బంధాలవల్ల యెన్నో కష్టనష్టాలు కలిగినా కార్మిక వర్గం ఓడిపోదు. నూతన ఆశలతో విప్లవవర్గాలు యెంతో దుర్నిరీక్ష్యంగా తయారవుతాయి. ఒక్క కార్మికవర్గమే నైతికబలం, ధర్మబలం, ఆత్మవిశ్వాసం గలిగి వుండగలదు. నిజాయితీ, నిష్పక్షపాతబుద్ధీ గల చరిత్రకారులు అందరూ నే చెప్పేదానిలో నిజాన్ని అంగీకరిస్తారు. ఆరోజు సమీపంలోనే వుంది."

—గోర్కీ

భారతీయ తత్వశాస్త్రం - ఒక పరిశీలన

'ప్రజల చారిత్రిక దశలకు సంబంధంలేని తాత్విక చర్చలు మార్క్సిజానికి విరుద్ధం'

నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు

(గత సంచిక తరువాయి)

అన్నివర్గాల, అనేక దేశాల, అంతర్జాతీయ ఆలోచనాప్రభావ నిర్మితమ్ బౌద్ధమతం— ఆమత సూత్రీకరణలే బౌద్ధతత్వశాస్త్రం.

ఐనపుడు నేటివరకు అభివృద్ధిచెందిన బౌద్ధతత్వశాస్త్రాన్ని వెనక్కు తీసుకపోయి గౌతముని మేధ కంటగట్టటం. వైరుధ్యంలో యిరుక్కోవడమే.

నిజానికి గౌతముడు నాడు చెప్పింది కొన్ని నీతిసూత్రాలు మాత్రమే. అవి నాటి పాలకవర్గాలకు, వ్యాపారవర్గాలకు ఆ సూత్రాలు సరిపోయినందున వాటిని ఆదరించి, ఆమోదించారు. బెనారస్ కేంద్రంగ అతిధనవంతమైన వర్తకుల నాయకత్వాన మగధ జాతి పాలకవర్గాల పూర్తి ప్రోత్సాహంతో ఉత్తరభారతదేశంలోని అనేక తెగల్లో యీ సూత్రాలఋనాదిగా ఒక మతం ప్రచారంలో కొచ్చింది. క్రమేణ, వ్యాపారంతోపాటిది కూడ అభివృద్ధిచెందుతూ అశోకువికాలానికిది ప్రభుత్వ మతం (State religion) గ అంగీకరింపబడింది. ఆ పాలకవర్గాలీమతాన్ని విదేశాలకు తీసుకుపోయారు.

ఈ అభివృద్ధిలోకొస్తున్న బౌద్ధమతం సరిగ్గ గౌతముడు బోధించిన సూత్రాలు తు.చ. తప్పకుండ అనుసరించిందా అంటే లేదనే చెప్పాలి. ప్రాంతీయ అవసరాలు, ఆయాజాతుల భౌతికపరిస్థితులకనుగుణంగ ఆసూత్రాలు మార్చబడ్డాయి గౌతమునికళ్ళ ఎదుటనే ప్రాంతీయ భేదాలు ప్రారంభమయ్యాయి. తదుపరి బౌద్ధంలోని శాఖాభేదాల సంఖ్యయే దీన్ని రుజువుచేస్తోంది.

కొన్ని చిన్న చిన్న మార్పులేకాక ముఖ్యంగ 'భౌతిక సంపదల' విషయంలో బుద్ధుడు బోధించినదానికి తదుపరి బౌద్ధమతం అవలంబించినదానికి చాల భేదం వుంది, కేవలం భేదం మాత్రమే కాదు. పూర్తి భిన్నంగకూడ వుంది. అలాగే స్త్రీలవిషయం లోను, కళలనుగురించి బుద్ధుని ఆలోచనకు బౌద్ధమతం ఆచరణకు యెంతమాత్రం పొత్తుకుదరదు.

బౌద్ధమతాన్ని లోతుగ అధ్యయనంచేసిన Mrs. రైస్‌డేవిడ్స్, M.A.D. Litt. తాను వ్రాసిన 'Out lines of Buddhism' లో ఇలా వ్రాసింది. "బౌద్ధంయొక్క

ప్రాథమిక సంస్కృతి (Cult) ఉన్నా, ప్రస్తుతమతానికి సంబంధంలేదు, తాటాకు గ్రంథాలే యిప్పటి విధానాలను రుజువు పర్చుటలేదు, మిగిలిన మతాల్లోమాదిరే బౌద్ధ మతంలోకూడ అసలు బోధలేవో, ప్రక్షిప్తాలేవో వాళ్లే కనుక్కోలేరు. పాళీభాషలో వాటికి సంస్కృతభాషలో వాటికి చాల భేదంవుంది".

గౌతముడొక ప్రవక్త

వ్యక్తిగాని, మహాత్ముడుగాని, సమాజంలోని జాతిపరిస్థితుల్ని సృష్టిస్తాడా ? లేక సమాజపు మొత్తపు అవసరాల కనుగుణంగ నాయకులుద్భవిస్తారా అనేది ప్రధానసమస్య. భారతదేశంలో గౌతమబుద్ధుడు పుట్టివుండకపోతే, బౌద్ధమతం ఏర్పడివుండేది కాదని, బౌద్ధమతంవల్ల భారతజాతికి మహోపకారం జరిగిందని చెప్పటం(పే. 70) వాస్తవాన్ని తలక్రిందులుగ చూడటమే ఔతుంది. జానిసవిధానం యొక్క పతనం, మతాలవల్ల జరగదు, భౌతిక అవసరాల నుండి జరుగుతుంది.

భారతదేశంలో గౌతముడు పుట్టినకాలంలో (6th Cent; B. C) చైనాలో కన్ఫూషియస్, లోట్జు లాంటి మతప్రవక్తలున్నా, గ్రీస్‌లో పరమాండిస్, ఎపిడోక్లిస్ లున్నా, యూదీయులలో 'ఈసయ్య', బాబిలన్‌లో 'హెరాక్లిటస్' ఇరాన్‌లో 'జరాతుష్ట్ర' మొదలగు మతప్రవక్తలు, తత్వవేత్తలు బహుళప్రచారంలో వున్నారు. అది ప్రపంచం మొత్తంగ మానవ సమాజంలో ఒకమార్పుదశను చూపిస్తోంది. ఈ ప్రపంచవ్యాపిత కల్లోల పరిస్థితికి మూలం పై పరివర్తలో, కాక ఆర్థిక, రాజకీయ, సామాజిక మార్పుల్ని ఆజ్ఞాపిస్తున్న భౌతికపరిస్థితుల్లో వుంది.

ప్రపంచం మొత్తంమాదిరే, భారతదేశంలో కూడ 'ధనం' మారకపు వస్తువుగ విప్లవాన్ని లేవదీసింది. ఈ క్రొత్త 'అర్థానికి', పాత 'ధర్మానికి' పొత్తుకుదరలేదు. 'గహపతి' లేక 'శ్రేష్ఠి' చేతుల్లోని ధనసంచుల ముందు, మతప్రవక్తలేకాక, రాజులు సైతం జోహుకుం కొట్టక తప్పలేదు. మనదేశంలో 'జేత' రాజుయొక్క తోటను 'అనంత పిండకుడు' అనే వ్యాపారి, నాటి నాణేలు నేలమీద పరచి కొన్నాడనేది ఈ సత్యాన్ని రుజువు చేస్తుంది. ఆర్థిక పలుకుబడివల్ల, రాజకీయాధికారం, వర్తక వర్గం చేతికొచ్చింది. గౌతముడీవర్గంలో తన ప్రచారం ప్రారంభించుటవల్లనే ఆ మతానికి విజయం లభించింది.

భారతదేశంలో, బానిస ఆర్థిక సంబంధాలు విచ్ఛిన్నమైపోతున్నదశ. పట్టణాలు గ్రామాల మధ్య శ్రమవిభజన శాశ్వతంగ జరిగిపోయింది. గిల్డుల నిర్మాణం, పరిశ్రమల స్థాపనతో పట్టణాలను వ్యాపారులు ఆక్రమించారు- వ్యవసాయం ప్రధానంగా గ్రామాల్లో బ్రాహ్మణులు నాయకత్వం వహించి యున్నారు. ప్రత్యేక హక్కులకొరకు (Special previlages) ఈ రెండువర్గాల మధ్య పోరాటం జరుగుతోంది.

ఈ వర్గపోరాటాని కనుగుణంగ, రాజకీయ మార్పులు మహోధృతంగ జరిగిపోతున్నాయి. ప్రజాస్వామిక రిపబ్లిక్కులు, విచ్ఛిన్నమైపోతున్నాయి. రాచరికవిధానం మంచి యౌవ్వనంలో వుంది. గంగ లోయలో మగధ, కోసల, అవంతి, వత్సరాచరికాలు ఒకప్రక్క తమ పొరుగు రిపబ్లిక్కు ప్రజలను దిగమ్రింగుతూ, రెండోప్రక్క తమలో తాము, సార్వభౌమాధికారం కొరకు పెనగులాడు తున్నాయి. ఎటుచూసినా నిత్యం ప్రతితెగి యుద్ధం కొరకు తయారీ. విచ్ఛలీల్లాంటి సమాఖ్యల (Confedaracy) మనుగడే దుర్లభమైపోయిందంటే, ఒంటరితెగల సంగతి అడగనే అక్కర్లేదు.

పెద్దపెద్ద కిరాయి సైన్యాల (Standing army) బలాల ముందు, పాత తెగల పద్ధతులు, అలవాట్లు పనికిరాకుండ పోయాయి. ఈ రాచరికాలు, వేలాది నిపుణులైన ఉద్యోగులను (proffesional bureacrates) ఒకవర్గంగ ప్రజలపై రుద్దాయి. ఈఉద్యోగుల రాచకీయాధికారమున్ను, వ్యాపారి వర్గంయొక్క 'ఆర్థికాధికారమున్ను కలసి, నాటి సమాజంలో 'అభివృద్ధికర వర్గంగ' బానిస దోపిడీవిధానాన్ని 'సవాల్' చేసింది. పాత ఆచారాలు, పద్ధతులు, మతాలు, ప్రజల విమర్శకు గురికాజొచ్చాయి. ఇదీ ఆ కాలపు ప్రత్యేక లక్షణం (Characteristic of the age)

మగధులు, అంగణాతిని, ఉజ్జయిని ప్రజలను లొంగదీసుకొని, విచ్ఛలీలను, కాశీ కోసల రాజ్యాన్ని నిత్యం బెదిరిస్తున్నారు. కోసలులు శాక్యుల్ని సామంతులుగ చేసికొని, కాశీలపై పెత్తనానికి ఘర్షణ పడుతున్నారు 'అవంతి' రాజు 'చండప్రాద్యోతుడు' గోదావరి ఒడ్డున స్వతంత్రంగ బ్రతుకుతున్న 'అస్యకులను' ఓడించాడు.

ఈ రాచరిక విధానాన్ని కనుగుణంగ క్రొత్త క్రొత్త మతాలు వందల సంఖ్యలో అభివృద్ధి కాజొచ్చాయి. కోసల రాచరికం వైదికమతాలకు ప్రోత్సాహమిస్తుంటే, మగధ రాచరికం అవైదిక మతాలను ప్రచారం చేయిస్తోంది. ఐతే రెండు ప్రాంతాల్లోను, బానిస మనస్తత్వానికి భిన్నమైన క్రొత్త ఆలోచనను, జిజ్ఞాసను అభివృద్ధికర వుత్పత్తిశక్తులు ముందుకు నెట్టాయి.

తమ చుట్టునున్న ఈ అస్థిర పరిస్థితులకు శాక్యజాతి అతీతంగ వుండజాలదు. గౌతముడు నాటివారి ఆంతరంగిక పరిపాలన 'బహిరంగ విధానసభ' (Public Assembly) లో వారెన్నుకున్న నాయకుని ఆధ్వర్యంలో (రాజన్) నడుస్తోంది. ఈ నాయకుడే కార్య నిర్వాహకుడుగ (Excutive officer) పనిచేశాడు. సార్వభౌమాధికారం (Soverignity) ఈ నాయకునిలోలేదు. ఇతన్ని ఎన్నుకున్న పైవర్గం (ఆస్తి, బానిసలు గల్గిన పైవర్గం) చేతిలోవుంది. క్రూరకృత్యాలు జరిపించినా, తప్పుడు పనులు చేసినా, అసమర్థుడని తోచినా ఈ నాయకుణ్ణి దించేయగల అధికారం ఈ ప్రత్యేకవర్గానికి (Previlised Class) వుంది.

బుద్ధుని చిన్నతనంలో అతని తండ్రి 'శుద్ధోధను'డా రిపబ్లిక్ యొక్క 'రాజన్'గ పనిచేశాడు. అన్నివిధాల ఆ పదవికి అర్హుడయ్యేట్లుగ గౌతమునికి తర్ఫీదు తినిపించినా, ఆజాతి అతణ్ణి ఎన్నుకోలేదు. మరొక సమిష్టి కుటుంబంలోని 'బుద్ధియ' అనే యువకుణ్ణి ఎన్నుకున్నారు. తదుపరి మరొక సమిష్టి కుటుంబంలోని పెద్ద 'మహానామ' అను నాతడు శాక్యుల ముఖ్యుడు. అనంతరం తిరిగి గౌతముని కుటుంబంలోని 'నంద' అను నాతడు ఎన్నుకోబడ్డాడు. ఈ రాజకీయ మార్పులు, ఆ జాతిలోని రాజకీయ అస్థిరత్వానికి నిదర్శనలు.

ఈ ఘర్షణ శాక్యులమధ్యనే కాక, శాక్యులకు పొరుగు తెగలైన కొలియజాతి (గౌతముని మామగారి తెగ) మొదలగు వారిమధ్య నీటికగాదా లున్నాయి.

భూస్వామ్య వర్గంలో పుట్టి పెరిగిన గౌతముడు, తన జాతిలోని పేదలను, బానిసలను తనవారు ఎలా హింసిస్తున్నారో గ్రహించగలడు. కాని, వేదాలు- వుపనిషత్తుల జ్ఞానం, ఈ సాంఘికవర్గ సంఘర్షణకు మూలాన్ని తెలియజేయలేదు. తనచుట్టు వున్న సమాజంలోని మూలం 'కోరికలు' అనే నిర్ణయాని కొచ్చాడు. దీనికి భౌతిక బుణాది తనవర్గపు స్థితి. వేలాది ఎకరాల భూమిపై అధికారం గల్గిన తన కుటుంబం ఇంక ఆస్థిపోగుచేతకై ఎంత అవస్తపడుతోందో, ఎందర్ని హింసిస్తుందో తను కళ్లారా చూడగలడు ఐతే ఆయనకొక్క విషయం అర్థంకాలేదు. విర్జీవమైన ధనానికి, సజీవమైన వ్యక్తిత్వం దెబ్బతినటం ప్రారంభించిందని, సమాజంలో వస్తూత్పత్తి ప్రధాన పాత్ర ఐందని, దుఃఖానికి మూలకారణ మిదేనని గ్రహించలేకపోయాడు. తాను తన తెగను వదలేసి, కొలియజాతి ముఖ్యుని కూతుర్ని పెండ్లిచేసుకున్నా కూడ, రక్తసంబంధాలుగ మారుతున్నట్లు గ్రహించలేకపోయాడు (వర్గ సంబంధాలు). మానవ సమాజ కష్టాల నిర్మూలనకై బయలుదేరాడు.

తనకెగ పెద్దలు, తన తలిదండ్రులు, భార్య, స్నేహితులు, బంధువులు అభీష్టానికి భిన్నంగ, తమజాతి శత్రువైన 'మగధ' నిరంకుశ రాజు రాజ్యానికి పోయాడు. శాక్య, మగధ జాతుల మధ్యలో కోసలులున్నారు. కాని తాను ఆరాజుయొక్క సామంతుడు. కన్కనే ఆచటకు పోకుండ బిందుసారుని రాజ్యంలోకి ప్రవేశించాడు. రాజు స్వయంగ ఎదురేగి, 'సేనాపతి' పదవిని ఆశచూపించాడు. దీని ఆంతర్యం ఒక్కటే: శాక్యప్రజలు కోసలరాజు ఆధిపత్యాన్నంగీకరించి వున్నారు. వారిని తాను మ్రింగివేయుటే బిందుసారిని వుద్దేశ్యం.

ఈవిధంగ గౌతముడు ఇల్లువదలటం ఒకటి. సూటిగ మగధరాజు వద్దకుపోవుట రెండోది. ఇది శాక్యజాతి మొత్తానికి చావుబ్రతుకుల సమస్య. కోసలరాజు అనుమతి లేకుండ శాక్యులు ఏవ్యక్తిని బహిష్కరించరాదు. బయటకు పోనీయరాదు. వురిశిక్ష విధించరాదు. ఇతర జాతులతో ఎట్టి స్వతంత్రి సంబంధాలు పెట్టుకోరాదు. ఐనపుడు, మామూలు వ్యక్తికాదు. వెయ్యి నాగళ్ళ అధిపతియైన 'శుద్ధోధనుని' బిడ్డ, తన బద్ధ శత్రువైన మగధరాజువద్దకు పోవటం. కోసలాధిపతి కోపానికి గురికావటమే ఐంది. గౌతముని కళ్ళ ఎదుటనే శాక్యజాతి సర్వనాశనం జరిగిపోయింది.

పుట్టుకతో ఔన్నత్యం, పవిత్ర పరిశుద్ధరక్తం మొదలగు శాక్యుల బానిసయుగపు భావాలను, కోసలజాతి యొక్క 'మాతంగ కులపు' రాచరికం. శాశ్వితంగ సమాధిచేసివేసింది. ఆర్య అహం, శూద్రబలం ముందు నాశనమైపోయింది.

ఈ చారిత్రిక బునాదితో మన భారతీయ తత్వశాస్త్రపు భావాల్ని పరిశీలిద్దాం. "గౌతముడు బాల్యం నుండి జిజ్ఞాసాపరుడై వుండేవాడు రాజ వ్యవహారాల్లో ఆసక్తి చూపేవాడు కాదు. ఇతని దృష్టిని మరల్చుటకై శుద్ధోధనుడు, యశోధర అను రాకుమార్తె నిచ్చి వివాహం చేశాడు. ఇవి ఏవీకూడా గౌతముని దృష్టిని మరల్చలేదు. నగర పంచారానికి వెళ్ళి వచ్చే సందర్భంలో, ఒకరోజున ఒక వృద్ధుడు, మరొకరోజున ఒకరోగి, మరొకతూరి ఒక మృతశరీరం. ఆఖరున ఒక సన్యాసి, ఈ నలుగురిని చూసిన మీదట గౌతమునికి జీవితంపై విరక్తి కల్గిందట. సంసారాన్ని త్యజించి అడవులలో తపస్సుచేసి, దుఃఖమయమైన ఈ ప్రపంచంలో నుండి బయటపడే మార్గాన్ని కనుక్కోవాలని నిశ్చయించుకున్నాడు. కొద్దిరోజులలోనే సంసారాన్ని వదలి, అర్ధరాత్రివేళ అడవులకు వెళ్ళిపోయాడు అప్పటికి గౌతముని వయస్సు 30.

6 ఏండ్లు నియమ నిష్ఠలతో తపస్సుచేశాడు. అందువల్ల శరీరం శుష్కించుట తప్ప గౌతముని సమస్యలకు పరిష్కారం దొరకలేదు.... ఆ తర్వాత కొంతకాలానికి

బుద్ధ గయలోని ఒక రావిచెట్టుక్రింద కూర్చోని ఆలోచనలో వుండగా, గౌతమునికి జ్ఞానోదయమైంది. (పే 41)

ఈ రచయిత ప్రకారం, గౌతముడుడొక రాకుమారుడు. ఆయన భార్య మరొక రాకుమార్తె. ఒకతెగ ముఖ్యునికి. 'రాజు'కు భేదం తెలియలేదిచట.

రెండో విషయం, గౌతముడు బాల్యంనుండి జిజ్ఞాసాపరుడై ఎక్కడ పెరిగాడు ? మానవులులేని చోట్ల పెరిగిన వానికేఽదా ఒకరోజున ఒక వృద్ధుణ్ణిచూడటం, రోగిని చూడటం వగైరా జరిగివుండేది. గౌతమునిది సమిష్టికుటుంబం, అంటే వందలసంఖ్యలో వుంటారు. వారిలో వృద్ధులుకాని, రోగికాని వుంటం జరిగివుండదా ? విలువిద్య. కత్తిత్రిప్పుట, గుర్రపుస్వారి, వేదాలు చదువుకొనుట మొదలగు విద్యలు గౌతమునికి తెలుసు. ఇవి సమాజం మధ్యలోకాక, సముద్రాల అడుగున నేర్చుకుంటారా? సాంఘిక సమస్యల పరిష్కారానికి, గౌతముడు అడవుల్లోకి పోయి తపస్సుచేశాడని చెప్పటం, ఆయన్ని అవమానించటమే.

నేటి. జాతీయ చరిత్రకారులు సైతం అంగీకరించలేని. హీనమైన భావవాదం ఏమంటే, ఒకరోజున హఠాత్తుగ ఆయనకు జ్ఞానోదయమైందని చెప్పటం. మార్క్సిష్టు అక్కర్లేదు. కొంచెం తార్కిక జ్ఞానంకల ఏవ్యక్తి ఐనా ఈమాటలు వ్రాయలేడు.

గౌతము డిల్లువదిలింది భగవంతుణ్ణి వెదికి పట్టుకోటానికి కాదు. సామాజిక దుఃఖాన్నుండి మానవుల విముక్తిమార్గం ఏది అని తెలుసుకోటానికి. కపిలవస్తులోని 'కాలాముని' ఆశ్రమ గురువుగారి శిష్యుడుగ, మగధలోని అనేకమంది ప్రసిద్ధ పండితులతోను, గురువులతోను చర్చలు జరిపాడు. సంతృప్తి చెందలేదు. చివరకు అతని జ్ఞానం 'తపుస, భల్లిక' అను ఇద్దరు ధనిక వ్యాపారులతో సంబంధం కల్గటంతో ప్రారంభమైంది. తదుపరి వుత్తర భారతాన్నేలుతున్న కాశీవ్యాపారుల సంబంధంతో అభివృద్ధి చెందింది.

గౌతముడు చెప్పిన విషయాలన్నీ తనతో ప్రారంభమైనట్లు చెప్పుకున్నాడు తనను తాను 'తథాగత' అని (III person) ప్రకటించుకున్నాడు. ఏ అదృశ్యవ్యక్తి గాని శక్తిగాని తనకు జ్ఞానోదయం కల్గించినట్లు చెప్పలేదు.

ఐనపుడీ రచయిత, హఠాత్తుగ ఒకరోగిని చూడ్డం, హఠాత్తుగ ఒక వృద్ధుణ్ణి చూడ్డం. హఠాత్తుగ ఒక మంచిరోజున జ్ఞానోదయం కల్గటం, గుణాత్మక మార్పు క్రింద భావించాడా ? ఇదిపూర్తిగ గతితార్కిక దృష్టికి వ్యతిరేకమైన జడాత్మక ధోరణి.

గౌతమ బుద్ధుడు, వ్యాపారుల అండతో, మంచి నిర్మాణపద్ధతు లవలంబించాడు. వ్యాపారకేంద్రాలైన శ్రావస్తి, రాజగృహ, వైశాలి; కోశాంబి, పురులేల, వెరంజ, కపిల వస్తు పావ మొదలగు అనేక పట్టణాల్లోని రాజులను, ధనికశ్రేష్ఠులను, గిల్డు అధిపతులను ఉన్నతోద్యోగులను కలుసుకొని తన బోధలు వివరించాడు. మంచి పలుకుబడిగల బ్రాహ్మణ గురువులను కూడ తనవైపు మార్చుకోగలిగాడు. ఆవిధంగ తనమత నిర్మాణం ప్రచారం చేశాడు.

ఈ మతం యొక్క అభివృద్ధికి మూలశక్తి అతని బోధలే కారణంగ బలరామ మూర్తిగారు వివరించారు. ఐతే ఎందుకు పతనమైంది? కాలప్రవాహంలో అనేక మంచి బోధలగతి అలాగే ఐంది అన్నాడు. (పే 70) ఇది సరికాదు.

వ్యాపారవర్గం యొక్క 'వస్తుమార్పిడి' వుద్యమం యొక్క చలనశక్తి వుధృతంగ ముందుకు సాగినంతకాలం, వీరి బౌద్ధమతం కూడ వ్యాపించింది. విదేశాలకుకూడ ఈ వర్గమే ఈ మతాన్ని కొనిపోయింది.

కాని భారతదేశంలో ఫ్యూడల్ భూస్వామ్యవర్గాలు, వారి నాయకులైన బ్రాహ్మణ వర్ణం తమ ప్రభుత్వాలను ఏర్పరుచ్చుకొనుటలో సఫలీకృతులైన వెంటనే, బౌద్ధ పతనం ప్రారంభమైంది. షుమారుగ ఇది గుప్తరాజుల కాలం నుండి ప్రారంభం. వ్యవసాయ ఆర్థిక విధానానికిది ఏమాత్రం సరిపడదు. ఈమతం యొక్క పతన కారణాలయొక్క భౌతిక పరిస్థితులివి. వీటిని పరిశీలించకుండ, మతబోధలు పిడివాదంగ రూపొందటాన అది పతనమైందని చెప్పటం (పే. 70) దానివర్గ బునాదిని కప్పిపుచ్చడమే. భావంలో నుండి, భౌతిక పరిస్థితుల్ని చూడ ప్రయత్నించటమే.

వర్ణభేదాలు—బౌద్ధమతం

"వర్ణ వ్యవస్థ, వుత్పత్తిశక్తుల అభివృద్ధికి ఆటంకంగా తయారైంది. బానిసల పరిస్థితి హృదయ విదారకంగవుంది. ఈ సామాజిక సమస్యలను బుద్ధుడు గుర్తించాడు. వర్ణవ్యవస్థను ఖండిస్తూ అందరూ సమానమేనని బోధించాడు. బానిసలను గౌరవంగ చూడవలెనని, సాధ్యమైనంత త్వరలో వారిని బానిసత్వం నుండి విముక్తిచేయాలని అన్నాడు" (పే. 46)

ఒక రోగిని, ఒక వృద్ధుణ్ణి కలుసుకొన్న గౌతముడు, బాల్యం నుండి జిజ్ఞాసతో కూర్చొనివున్న గౌతముడు సామాజిక సమస్యల్ని ఎలా గ్రహించాడో అర్థం కావడం

లేదు. మరి సామాజిక సమస్య లాయనకు అర్థమైతే, అడవులకు తపస్సు కెందుకు పోయాడు? సాధ్యమైనంత త్వరలో(as early as possible) దానినల్ని విముక్తిచేయ మని ఏవర్గానికి చెప్పాడు? ఎట్లా విముక్తిచేయమన్నాడు? మరికొంత వివరణ ఇస్తే ఎంతో బాగుండేది.

వుత్పత్తిశక్తుల అభివృద్ధికి, వర్ణవ్యవస్థ ఆటంకంగ తయారైందని బుద్ధుడేనాడు, ఏరూపంలో కూడ చెప్పలేదు. వర్ణభేదాలు, ఒక సాంఘిక వ్యవస్థ (as a social institution) గ వుంటానికి వీల్లేదని ఆయన ఎదిరించలేదు. బ్రాహ్మణులను ఒక వర్గంగ ఎదుర్కొన్నాడు తప్ప, బ్రాహ్మణ్యాన్ని మాత్రంకాదు. పైగా ఉంచవృత్తితో బ్రతికే 'పవిత్రి' బ్రాహ్మణులకు ప్రణామం అన్నాడు. అంటే ఏమిటి? బ్రాహ్మణ వర్ణం యొక్క ఆర్థిక పోగునేతను ఎదిరించాడు. వారు కులంయొక్క గొప్పతనం పేరుతో, యజ్ఞాల ద్వారా పూర్తి ఆర్థికాధికారంగల ప్రత్యేక హక్కును ఎదిరించాడు. ఇది ఆస్థి హక్కుల పోరాటమైన, మహాభారత యుద్ధమే భౌతికంగ నిర్ణయించేసింది. దానికి గౌత ముడుతాత్విక విలువల్ని చేర్చాడు. డబ్బునుబట్టి సాంఘిక అంతస్తులు అనే 'రాచరికపు' నినాదాన్ని సమర్థించాడు. ఇతర కులపు ధనికునివద్ద బ్రాహ్మణుడు ఇచ్చకాలాడుతాడు గదా! ఐనపు దాతనికులపు గొప్పతనం ఏమిటి? అని ప్రశ్నించాడు.

గౌతముని ఆచరణ ప్రకారం, మానవులందరు సమానమే అనేది సాంఘికంగ కాదు, రాజకీయ, ఆర్థిక రంగాల్లోకూడ కాదు. ఒక్క తాత్వికంగ మాత్రమే.

పాపం చేయుటవల్లనే మానవజన్మ లభిస్తోందని గౌతముడు నమ్మాడు. కనుక పుట్టిన వారందరూ పాపులే, ఈ విషయంలో అందరూ సమానులే. అందుచేతనే నిర్వాణం అందరికి ముక్తిమార్గం. క్రొత్త రాచరికపు క్రూరశిక్షల సమర్థన కిది చక్కని సిద్ధాంతం.

గౌతమునికిముందు, బ్రాహ్మణమతంలో పేదవారు మాత్రమే పాపులు, యజ్ఞ కర్మచేయగల్గినవారందరు పుణ్యమూర్తులు. కాని బౌద్ధమతంలో పైవారి వర్గంకూడ పాపులే ఐతే వారు 'కృషి'ద్వారా ఆస్థిని పోగుచేసుకుంటున్నారు. కృషిద్వారా 'నిర్వాణ' కూడ- ఇది కిందివర్గాలకు నేర్పే 'కర్మ'పాఠం. రాచరికపు ఆస్థిరక్షణకిది కంచుకోట, ఎందు చేతనంటే, ఇంతకుముందు వ్యక్తి వస్తువుల అర్పణతో పాపవిముక్తుడౌతాడు. ఇపుడు 'వ్యక్తి' నిర్వాణ పొందేవరకు ముక్తి లేదు. అంటే వ్యక్తి జీవితం మొత్తానికి లంకె పడింది. తనకు తాను పూర్తిగఅర్పించుకోవాలి. 'కప్పం'చెల్లించి, కొబ్బరికాయలు

(సశేషం)

సమీక్ష :

భాస్కరుడు

బౌను మరి బూర్జువా వర్గాలన్నా
పోలీసు రాజ్యం
పూజారి రాజ్యం అన్నా
నాకు విపరీతమైన ద్వేషం
అయితే వీటిని నేను
ద్వేషిస్తున్నంత తీవ్రంగా
ద్వేషించని వాణ్ణి మరీ తీవ్రంగా
ద్వేషిస్తాను.
అసలు నేను వ్రాసిన కావ్యాలన్నిటిలో
ఈ ద్వేషగీతం చాలా బాగుందని
ఎవడైతే అనడో
ఆదొంగ తొత్తుకొడుకు మొగం మీద
ఉమ్మేతాను.

పాల్ ఎలార్డ్[1] రచించిన ఈ ద్వేషగీతాన్ని 1964 నుండి నేటివరకు వచ్చిన దిగంబర కవిత్వానికీ, విప్లవ కవిత్వానికీ శీర్షికగా తీసుకుంటే చాలా అర్థవంతంగా ఉంటుంది. ఈ గీతం అనువాదమే అయినా శక్తివంతమైంది. (శ్రీ శ్రీ ఖడ్గసృష్టి) దీనిలో ఛందస్సూ, సంకేతాలు (symbols), ధ్వని (suggestion), రసానుభూతి (aesthetic feeling)ఇవేమీలేవు. కాబట్టి కవిత్వమనవచ్చా అనేది ఒకప్రశ్నకావచ్చు. అనూచానమైన కవితా నిర్వచనం ఈ గీతానికి పనికిరాదు. దీనివెనుక ప్రగాఢమైన

పాల్ ఎలార్డు[1] ఫ్రెంచి సర్రియలిస్టు కవి. సర్రియలిస్టుగా స్వాప్నిక్ కవిత్వాన్ని రాసినా వైయక్తిక సామాజిక సంబంధాలను విడదీయరానివిగా, "నిర్వ్యాజప్రేమ" (Eros) ఈ ప్రపంచానికి అత్యవసరమైనదిగా భావించిన ఈకవి రెండవ ప్రపంచ యుద్ధకాలంలో కమ్యూనిస్టు పార్టీలో— తన ముఖ్య స్నేహితుడు— పికాసోతోపాటు చేరాడు.

విశ్వాసం ఉంది. నిష్కళంకమైన నిజాయితీ ఉంది. అకుంఠితమైన దీక్ష ఉంది. ఆవేశ నిబద్ధత ఉంది. మంచిని, చెడును ఎత్తిచూస్తే మంచిని మంచిగా చెడును చెడుగా గుర్తించని వాళ్లపైన కసి, ద్వేషం ఉన్నాయి. ఇవన్నీ ఈ గీతానికి అమోఘమైన స్ఫూర్తినిచ్చాయి.

పుష్కలంగా కవితాగుణం ఉండీ నిజాయితీ గనుక లేకపోయినట్లైతే కమిటెడ్ కవి స్ఫూర్తివంతమైన గీతాన్ని రాయలేడు. తన గీతానికి పట్టు, బలం చేకూర్చేదే విశ్వాసం విషయంలో నిజాయితీ-నిష్కళంకతా.

"భాస్కరుడు" లో మొత్తం ఇరవైతొమ్మిది కవితలున్నాయి. యం. కె. సుగమ్ బాబు 'అక్షరజ్వాల' ను కలుపుకుని. కవులంతా శ్రామిక విప్లవానికి కమిట్ అయిన కవులని సంకలాన్ని చదివితే స్పష్టంగా తెలుస్తుంది. చాలామంది కవులు కవిత్వం రాయడం కొత్తగా ప్రారంభించినవాళ్ళే అనికూడా తెలుస్తుంది. కాకున్నా కవిత్వాన్ని ఒక కళగా అభ్యాసం చేసినట్టు కనిపించదు. వీరిలో చిత్తశుద్ధీ, తపన ఉన్నాయి. తమ అనుభవాల్లోకి వచ్చిన ఈ వ్యవస్థలోని కొన్ని దారుణమైన నిజాల గురించి చెప్పాలనే తహతహ ఉంది. కాని కవికి కావలసిన, తన మీడియమ్‌పై ఉండాల్సిన అధికారం చాలామంది కవులకు లేదు.

'కాకులొచ్చాయి మాయింటికి' ("అరుణ్") మంచిగేయం "కాకీదుస్తుల కాకులు" అనటం బాగానే ఉందికాని కాకులకూ, పోలీసులకూ ఎక్కడా పోలికలేదు. కాకి పిరికి తనానికీ, మోసకారి తనానికి సంకేతం. పోలీసు యూనిఫాం బయట పిరికివాడే కావొచ్చు. కాని ఒక యంత్రాంగంలో ఆర్డర్స్ క్రింద తుపాకీ చేతబట్టుకు ఉన్నవాడు. అదిలిస్తే ఎగిరిపోయే కాకికాదు. పోలిక, పోల్చబడే వస్తువు మధ్య ఉన్న సామ్యా సామ్యతలలో ఔచిత్యం పాలు తక్కువ. మొదట నాలుగు చరణాల గేయం వచనం లోకి పీగిపోయింది– అక్కడక్కడ గేయంలోని పటుత్వాన్ని పట్టించే లైన్లు ఉన్నా అవి ఒంటరిగానే మిగిలిపోయాయి.

అందమైన సుందర శిల
మెలికలు వంపులు కలిగిన చట్టం,
చూస్తూ అదుపు చేయలేని న్యాయం
అక్రమం– దారుణ పరిమాణాల్ని
సత్తువ వున్న నెత్తురు పరిక్షాళితం
అది హింస!

ఈ పాదాల్లో వాక్యక్రమం లోపించడం వల్లనో ఏమో కవి చెప్పదలచుకొన్న ఉద్దేశ్యము ఏమిటో తెలియదు.

"జుగాష్‌విలీ" గేయం 'విప్లవిద్దాం రండి' జీవితంలోంచి, అనుభవంలోంచి రాసింది కాదు. (అనుభవంకంటె వ్యక్తిగత జీవితంలో సంభవించిన ఘటనానుభవమని కాదు) 'అధికారం గారపళ్ళకింద / నలిగిన అధరాలతో.... డస్ట్‌బిన్‌లో / అర్ధనగ్నంగా' ఎంతమందో 'రమ' ల జీవితాలు బలి అవుతాయి. అధికారం, అహంభావం అనేవి ప్రజాస్వామ్య లక్షణాలుగా చలామణిఅయ్యే వ్యవస్థలో. ఇటువంటి సంఘటనలగురించి కవి విని లేదా ఊహించి రాస్తే చాలదు. జీవితాన్ని పేదవాళ్ళ, పీడితుల జీవితాల్ని-స్వయంగా పరిశీలించి, వాళ్ళ మధ్య బతికి, వాళ్ళ సుఖదుఃఖాలు పంచుకోవాలి. అప్పుడే విప్లవ కవికి కావలసిన చిత్తశుద్ధి, పేదవాళ్ళ సమస్యలు, ఈ వ్యవస్థలోని కుళ్లను సమగ్రంగా వివరించి చెప్పగల శక్తి లభిస్తాయి.

"సమూల విచ్ఛేదనం చెయ్యడీన్ని" ('తేజోనిధి') అన్న గేయంలోకూడా సంకేతాన్ని ఎంచుకోవడంలో లోపం కన్పిస్తున్నది. వాడుకున్న సంకేతం కవి వశం తప్పిపోయింది 'చిగురించని వృక్షం' ఈ వ్యవస్థ. 'గనికార్మికుల్లాంటి'వారు వేళ్లు అనగా ఈ వ్యవస్థా. వృక్షానికి ఆధారభూతమైన వేళ్లు గని కార్మికులన్నమాట. కాని ఈ వ్యవస్థకు బూర్జువా వర్గాలు ప్రాతిపదిక. కార్మికుల. కర్షకుల శ్రమ ఈ వ్యవస్థావృక్షానికి అందింపబడే ఆహారమంటే బాగుండేది. అంతేగాక 'చిగురించని ఈ వృక్ష'మే 'ఉన్ననీడను ఎక్కువచేస్తుందిగానీ/ఒక్కంతైనా నీకోసం (అనగా శ్రామికుడు)/ప్రక్కకు జరగటంలేదు। చిగురించని వృక్షం నీడ ఎలా పెరుగుతుంది। ఈ వృక్షం ప్రక్కనే 'వైప్లవ్యం'మొక్క పెరుగుతున్నది అంటారు కవి. కాని నిజానికి విప్లవం ప్రజల్లోంచి వ్యవస్థలోంచి పుట్టుకురావాలి.

విప్లవ కవిత్వం ఏ ప్రజల జీవితాల్లోంచి విప్లవం పుట్టించాలని కవి ఆశిస్తున్నాడో ఆ ప్రజల భాషకు, అనుభూతులకు, ఆలోచనా పద్ధతులకు సన్నిహితంగా ఉండాలి. నేడు కవికి మధ్యతరగతి కుటుంబాల్లోంచి వచ్చినా, పేదతనంలోంచి వచ్చినా సాంఘిక విద్యావిషయకమైన ప్రభావాలబట్టి బూర్జువా లక్షణాలె అలవడుతున్నాయి.

ఇటీవలికాలంలో ఈ కుళ్లు వ్యవస్థపై ధ్వజమెత్తి నిలచిన కవులుకూడా ప్రధానంగా బూర్జువా కవులే— బూర్జువా వ్యవస్థపై తిరుగుబాటు చేయబూనిన బూర్జువా కవులు వాళ్లు వారి కవిత్వం ప్రజలదాకా పోవడం సాధ్యమయ్యేదికాదు. ఇప్పుడున్న కవిత్వాన్ని

అర్థంచేసుకొని ఆనందించాలంటె కొంతవరకు మేధావిత్వం, సాంప్రదాయిక భాషాశుద్ధి అవసరం. ఇప్పుడు మన ప్రజలున్న స్థితిలో ఇవేమీలేని కవిత్వాన్ని రాయగలగాలి. అందుకే ఈనాడు జానపద గేయాలు- పాటలు విప్లవ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకు పోవడానికి సాధనాలుగా గుర్తింపబడ్డాయి. "భాస్కరుడు"లో ఆ ప్రయత్నంజరిగింది- "అన్నార్తులారా ఏకంకడి" ("కిరణ్‌బాబు")అన్న గేయంలో. ఇది పూర్తి పాటగానీ, గేయంకాని కాదు. (గేయంలో పాదటానికనువైన దరువుగాక గొంతెత్తి చదవడానికి ఉపయోగపడే నడక ఉంటుంది) కాని భాషావిషయంలో ఈ కవి ఎక్కువ శ్రద్ధ కనపర్చాల్సిన అవసరం ఉంది. ఈ గేయంలో వాడిన భాష జానపదులభాష కాదు.

విప్లవ కవిత్వం వర్ణనాత్మకమైంది. దోపిడీ సమాజంలోని కుళ్లను, అత్యాచారాలను, పరిపాలనా యంత్రాంగాలలోని దురాచారాలను శక్తివంతంగాఎత్తి చూపెడుతుంది. దాని రెండవగుణం ప్రబోధాత్మకత, ఎవరికోసమైతే కవిత్వం రాయబడిందో వారికి కర్తవ్యనిర్దేశన చేయడం జరుగుతుంది. ఈ రెండువిషయాల్లోకూడ కవిలోని వైయక్తిక ప్రేరణలు సమాజోద్దీపనాలుగా రూపొందుతాయి.

అయితే కవిలో సామాజికదృష్టి ప్రధానంగా ఉండాలి, దాంతోపాటు విశ్వాసం, చిత్తశుద్ధీ ఉండాలి. అప్పుడే సాధారణంగా రాజకీయ నాయకుల ప్రవచనాల మాదిరిగా గాకుండా కవిత్వంలో వ్యక్తం చేయబడిన రాజకీయోద్దేశాలు కృత్రిమత్వాన్ని విడనాడి కార్యగుణాన్ని పొందుతాయి.

వచన కవితా స్వరూపం ఎంత ప్రమాదమైందో ప్రచార కవితకూడా అంత ప్రమాద భరితమూ, సంక్లిష్టమైందీ. రాజకీయ నినాదాలు కవి ఉద్రేకాలతో మేళనం పొంది కవితా వస్తువుగా తయారై అప్పుడు కవిత్వంలో వ్యక్తం కావాలి. విశ్వాసం, చిత్తశుద్ధీ, రాజకీయ భావాల కవితాదర్శనం చేయించే శక్తీ లేకపోయినట్లైతే ఒట్టికసిత్వమయమైన, అవగాహనలేని నినాదంగా తయారవుతుంది. ఉదాహరణకు "చెమట పిండాం ఇక రక్తం పిలకాలి" ("మహి") అన్న గేయంలో

ఇన్నాళ్ళూ మనం అనుభవించిన
నరకయాతన వాడూ అనుభవించాలి
అందుకోసం గొయ్యిలోత్తగ్గించి
వాన్ని పీకమొయ్యా కుదెయ్యం డందులో.

ఈ సంకలనంలో అక్షరజ్వాల (యం. కె. సుగమ్‌బాబు), ఆపరేషన్ (జగాష్ విలి"), నిదురలేవండి (ఉమ్మనేని పుల్లయ్య) నేను కవిని రచయితను ("అరుణ్ బాబు") వేట (యమ్కె") ధార (దేవీప్రియ) కొన్ని మంచి కవితలు. కాని ఒక్క

'అక్షరజ్వాల'లో తప్ప మిగతా గేయాల్లో కవిత్వం పాలు తక్కువ. వాటిలో ప్రబోధాత్మక గుణంపాలు ఎక్కువై, దోపిడీవర్గ స్వభావ విశ్లేషణ— దాని దుష్ఫలితాల వర్ణన తక్కువైపోయింది.

కొన్ని గేయాల్లో అస్పష్టతపాలు ఎక్కువగానే ఉంది. ఉదాహరణకు

సీజర్ సమాధిచుట్టూ చేరి
కవాతు చేసే వాడికీ
ఓల్గా తరంగ చైతన్య ధ్వనులు
గుండెలో నిలిపి
ఆశయాల గుర్రాల పైన వీరుడిలా
సవారి చేసే వాడికి—
వాడికీ వీడికీ
వాడి వాడికీ వీడి వేడికీ
ఎంత తేడా !

సీజరు చక్రవర్తి సమాధిచుట్టూ పహరా కాసేవాడు బూర్జువావర్గం కావచ్చు, రెండోవాడు నవ సోషలిస్టు సమాజస్థాపనే ఆశయమైన వర్గం కావచ్చు. కాని బూర్జువాకు నిజమైన 'వాడి' ఎక్కడినుంచి వస్తుంది ? వాడి మానవత్వం నిజాయితీలేని డొల్ల.

రెండు పదుల సంవత్సరాలు నిండిన
ఈదేశం నిండు చూలాలు....

కడుపులో ఉన్నది 'ఎర్రగా నెత్తుటి మంటలా / జ్వలిస్తూ లోకాన్ని వెలిగిస్తూ' పుట్టేబిడ్డ విప్లవం. నిండు చూలాలు పాపం ప్రసవించలేక పోతుంది. మార్క్సు శాస్త్రం నరనరానా జీర్ణించుకున్న అశ్వారూఢుడు ('సమసమాజ సరోజ వికాసచర్యకు అవుసరం' అయనవాడు) ఆ చూలాలి గర్భంపై శస్త్రప్రయోగం చేస్తేనే ఎర్రని క్రూరవాడైన విప్లవం ఆవిర్భవిస్తాడు. ఈ గర్భాన్ని చీల్చి విప్లవావిర్భావం చేయడమంటే ఏమిటి ! వర్గ పోరాటమనా భావం !

"సుదీర్ఘమైన రాత్రి సర్పం యింకా
కాలం అంచుల మీద పాకుతూనే వుంది...."

ఇలాంటి సర్రియలిస్టు రొమాంటిక్ ధోరణి విప్లవ కవిత్వానికి ఎంతవరకు కుదురుతుంది అనేది ప్రశ్న.

—మోహన్

సాహిత్యలేఖలు :

విప్లవాన్ని అవహేళన చేసే కథ

సంపాదకులకు,

మహాశయా !

విప్లవ సాహిత్యం పేర వచ్చే సాహిత్యం విప్లవ చైతన్యాన్ని పెంచేదిగా వుండాలి. కాని విప్లవ శక్తులకు, వానికి ప్రేరణనిస్తున్న సామాజిక పరిస్థితులకు వక్రిభాష్యాలు చెప్పి అపహాస్యం పాలుచేసేది కాకూడదు. శత్రువు పుంఖాను పుంఖాలుగా గుప్పించే వర్గ సంకర సిద్ధాంతాలకన్నా, విప్లవ సాహిత్యం పేరుతో అడపాదడపా చోటు చేసుకొనే యిలాంటి రచనలే అనుభవంలో విప్లవకర వర్గాలను అయోమయంలో పడవేసి హానిచేస్తాయి.

సృజన మార్చి '72 సంచికలో "సంపత్ రావు" అనే వారి రచన 'అతకని బ్రతుకులు', ఈ కోవకు చెందినదే. "ఆటవిక జాతిని జాగృతపరిచే కార్యక్రమాలకు" తరలి వెళ్ళిన ఒక యువకుని 'వ్యక్తిత్వా'న్ని, అలా తరలివెళ్లడానికి దారితీసిన పరిస్థితులను చిత్రించే ప్రయత్నం ఈ కథలో జరిగింది. ఇందులో "ఆటవిక జాతిని జాగృతపరచే కార్యక్రమాలు" సమకాలీనమైన (శ్రీకాకుళం) గిరిజనోద్యమం లేదా వారి పోరాటం అనుకోవాలి. అయితే శ్రీకాకుళం గిరిజనులు యింకా 'ఆటవిక' దశను దాటలేదా ?

ఈ కథలో నాయకుడు పిరికివాడు. మానసికంగా దుర్బలుడు. యింట్లో 'పోరు'కూ, ఊళ్ళో "వాగుడు"కూ బెదరిపోతాడు. అతగాడికి ఆశయాలులేవు. ఆశయాలమీద ఆశలున్నాయి. ఒక ఖచ్చితమైన నిర్ణయానికి రాలేడు. వచ్చిన నిర్ణయాన్ని ఆచరణలో పెట్టడానికి ధైర్యం లేనివాడు. ఇంకోమాటలో, తనంటే తనకే నమ్మకం లేనివాడు. పైపెచ్చు ఎవరూ తనని అర్థం చేసుకోవడం లేదని, తనవాళ్ళంతా "తన ప్రమేయం లేకుండా హాయిగా" వుంటున్నారని, ముందు కుమిలి కుమిలి; ఆ పిమ్మట "ఘోరున ఏడ్చాడు" (నిజానికి అతన్ని వదలిపోయిన ఆ భార్యేకాదు, ఏ ఆడది మాత్రం యిలాంటి వాడితో ఎందుకు కాపురం చేయాలి ?)

ఈ 'అతకని బ్రతుకులు' కథానాయకుడు "ఆటవిక జాతిని జాగృతపరచే కార్యక్రమాలకి" ఎందుకు పోయినట్లు ?.... తన ఆశలు నెరవేరలేదు. అంతా అప్రయోజకు

డంటున్నారు. తల్లీ, తండ్రీ, ఆడంబరాలు, ఆచారాలూ మానలేదు. భార్యకూడా తనని వదిలేసి పుట్టింటికి పోయింది- ఇంట్లోవుంటే యిక అప్పులవాళ్లు బతకనిచ్చే దారిలేదు.

అందుకని ఆఖరికి ఆ,– "శేఖరం జ్ఞాపకాలన్నీ సమాప్తమై పోయాయి.... నికృష్టంగా, నీచంగా, హీనంగా, దీనంగా, దిక్కులేని విధంగా ఘోరమైన చావు చచ్చి తనవాళ్లను ఏడ్పించాలనుకున్నాడు. తన చావు జీవమున్న ప్రతివస్తువునూ ఏడ్పించేటంత దారుణంగా విషాదంగా ఉండాలనుకున్నాడు" అలా అనుకొని చావడానికి లేచిపోయి అతడు "ఆటవిక జాతిని జాగృతపరచే కార్యకలాపాల్లో" చేరిపోయాడు!

విప్లవకారులు ఆశయాలు సాధించడానికే ప్రాణాలు తృణప్రాయంగా అర్పిస్తారు గానీ, ప్రాణాలు అర్పించడమే ఆశయంగా పోరాటాలను సృష్టించి నడపరు; పాల్గొనరు. ఎందుకంటే విప్లవ కారులకంటే జీవితాన్ని అధికంగా, అమూల్యంగా ప్రేమించే మనిషి మరొకడు ఈ భూతలం మీద ఉండడు కనక.

అంతేకాదు ఈరచయిత ఆయన నాయకుని భావంలో "ఆటవిక జాతిని జాగృతపరిచే కార్యక్రమాల్లో" ప్రాణాలర్పించడమంటే అది ప్రపంచంలోకెల్ల అధమాధమమైన అతినికృష్టమైన చావు అన్నమాట!?

మరి విప్లవకారుల బలిదానాలన్నీ యిలాటి అధమాధమమైన 'చావు'లే నన్నమాట!?

ఇంతకంటే ఘోరమేమంటే, ఈ రచయిత దృష్టిలో "ఈ ముసలి వాళ్ళంతా కలసికట్టుగా.... అయినదానికీ కానిదానికీ ఒకరికొకరు సాయమై కొడుకులను సాధించుకుంటారు!" అంటే ముసిలివాళ్ళంతా ఒక గొప్ప అభివృద్ధి నిరోధకవర్గ మన్నమాట! విప్లవానికి మొట్టమొదటి శత్రువులు వాళ్ళేనన్నమాట (–ఇది ఫాసిస్టు నిర్వచనం కానీ మార్క్సిస్టు అంచనా కానేకాదు)

ఇక స్త్రీలు, అందునా భార్యలు అమితమైన సంకుచిత స్వభావం కలవాళ్లు. అంతేకాదు "పెళ్ళాం అంటే జీవితాన్ని ముందుకు పోనివ్వకుండా జుట్టుపట్టుకొని లాగేదే.... అయినా కావుపట్టిన ప్రతిమగాడూ ఆడదాన్ని ఎందుకు ముడి పెట్టుకుంటాడో అర్థం కాలేదు"- ఎవరికి? రచయితకా?

విప్లవ పోరాటాల్లో మహిళలు నిర్వహించిన- నిర్వహిస్తోన్న మహోజ్జ్వలపాత్ర తెలియని దెవరికి? పోరాటరంగంలోను, రక్షక శ్రేణుల్లోను మన తల్లులు, చెల్లెళ్ళు- భార్యలు పాల్గొనకండా, సహకరించకండా విప్లవ విజయాలు, విప్లవ పోరాటాలు సాధ్యమా?

ఈకథా రచయిత సంపత్‌రావు పసివాడూ, ప్రజోద్యమ గతిని ప్రిజలనాడినీ ఎరుగనివాడూ నేమో? రచయితగా ఇది అతని శైశవమూ, అందులోవి తప్పటడుగులూ, తొక్కుపలుకులూ నేమో! కాని, సృజన సంపాదకులు ఈకథను ఎలా ఆమోదించి ప్రచురించారో ప్రశ్నార్థం. పోరాటాలనూ, పోరాట శ్రేణులనూ అపహాస్యం చేసి అపఖ్యాతి పాలుచేసే రచనలా విప్లవ రచనలా? ఇలాంటివి సృజనలో రావచ్చునా??

రమారమి 392 పంక్తులు: 14½ పేజీలు సృజన కాగితం ఖర్చుచేసిన ఈకథలో పేరు దగ్గర్నుంచి కొసవరకు మచ్చుకు ఒక్క వాక్యమైనా కనీసం సహించదగిందేదీ లేదు. అభివృద్ధి నిరోధకవర్గాలు విప్లవాన్ని అవహాస్యం చేసేందుకు సృష్టించే సాహిత్యంలో యిది చేరుతుంది.

అభివందనాలతో

ఎర్-లిబర్డ్

నాగార్జునసాగర్‌లో రా. వి. శాస్త్రిగారి "విషాదం" నాటిక

కొంతమంది మిత్రులతో నాగార్జునసాగర్ నాటకోత్సవాలకు హాజరయ్యాను. తీరా ప్రోగ్రాం పేపరు చూచాక రా. వి. శాస్త్రిగారి 'విషాదం' నాటిక ప్రదర్శన ఉందని చూసి ఆశ్చర్యపోయాను, విస్తుపోయాను.

ఆ స్క్రిప్టు నేను చదివాను. చాలామంది పెద్దనాటక సమాజాలవారు ఆ స్క్రిప్టు చదివి, ప్రదర్శన యోగ్యం కాదని, ప్రదర్శించినా రక్తికట్టదని పెదవి విరిచిన సందర్భాలు చాలా ఉన్నాయి. నేనూ అలానే అనుకున్నాను. (కొన్ని మినహాయింపులతో రేడియో నాటికగా, సమర్థులైన నటులతో రాణించవచ్చునని నాకు తోచింది.) గమ్మత్తయిన విషయ మేమిటంటే నాగార్జునసాగర్ నాటకోత్సవాల నిర్వాహకులు కూడా నాతో "స్క్రిప్టు" అంతబావోలేదుగాని నటకుల టాలెంట్ అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది గనుకనే సెలెక్టు చేసుకున్నాం' అన్నారు.

తెరవిప్పక ముందు నాటిక ప్రదర్శించే ప్రోగ్రెసివ్ ఆర్ట్స్, దోర్నకల్‌వారు, ఆడిటోరియంలో కరపత్రాలు వెదజల్లారు. రా. వి. శాస్త్రిగారి థీమ్‌ని అందులోవారు ఉంటంకించారు తమ టాలెంట్‌కన్న, రా. వి. శాస్త్రిగారి రచన గొప్పదనాన్ని సవినయంగా అంగీకరించారు.

నేటి యువతరం బాధ్యత మరచింది. సెక్సు సాహిత్యం, హాలీవుడ్ చిత్రాల ప్రభావం, త్రాగుడు, వ్యభిచారం నేటి యువలోకాన్ని ముంచెత్తుతున్నాయి. పేదరికం నేటి యువలోకాన్ని కదిలించడం లేదు. సమాజ బాధ్యతలు తెలిసికొని ప్రతిచర్యలు

తీసుకోవాల్సింది పోయి పై దురలవాట్లకు లోనయ్యారని— శ్రీ రా. వి. శాస్త్రిగారి వ్యథే 'విషాదం' నాటికగా భాసించిందని, ప్రదర్శకులు చెప్పుకున్నారు.

ఇంతేకాక, వారు తాము ప్రదర్శించే హాస్యంలో లీనం కావద్దని ప్రేక్షక మహాశయుల్ని కోరినారు. ఎంచేతనంటే యువలోకం యిప్పటికే సమాజ బాధ్యతలను మరచి, హాస్యం పాలైందని వారు తమ ప్రకటనలో తెలియజేశారు.

తెర ఎత్తగానే శిథిల దేవాలయం- పక్కనే ఊడలుదిగిన మర్రిచెట్టు. దాని పక్కనే ఏరు ప్రవహిస్తుందనే భ్రమ కల్పించడంకోసం చేపురికార్డరు నుపయోగించి, ఏటి గలగలలూ, పక్షుల కిలకిలారావాలూ వినిపింపచేశారు. ఈ సెట్టింగుపై నలుగురు స్టూడెంట్స్ ప్రవేశించి అత్యద్భుతంగా నటించారు. నాగరికత వెర్రితలలు వేస్తున్న దుస్తులు ధరించారు. బలిసిన వర్గానికి ప్రతినిధిగా పోలీస్ కానిస్టేబుల్ 420 పాత్రధారుడు, బలహీనవర్గానికి ప్రతినిధిగా, S. I పాత్రధారుడు తమతమ పాత్రల నర్థం చేసుకుని గొప్పగా నటించారు.

చిన్నతనంలోనే డిగ్రీలు సంపాదించి, ఉద్యోగాలు చేసుకుంటూన్న, 22 ఏళ్ళ లోపు వయసున్న కుర్రాళ్ళు ఇందులో నటులు- అందరూ చక్కగా ఆడగలరు, పాడగలరు, అందుకే ఈ నాటిక ప్రదర్శన అంతగొప్పగా రక్తికట్టింది.

ఆనవాయితీగా ఈనాడు ప్రదర్శిస్తున్న నాటిక పాతధోరణులను ఈనాటిక ప్రదర్శకులు నిస్సందేహంగా నద్దివిరగ్గొట్టారు.

ఆంధ్రదేశంలో సమర్థనీయంగా ఎక్కడైనా ప్రదర్శించగలరని ('విషాదం'నాటికను) ప్రోగ్రెసివ్ ఆర్ట్స్, దోర్నకల్ వారు నిరూపించారు—

పి. కోదండరామయ్య
విప్లవమడక

వీళ్ళు — వాళ్ళు

వీళ్ళకు సంకెళ్ళు వేశారు వాళ్ళు. పట్టుకుని పడదోసి గదుల్లోకి నెట్టి తాళాలు బిగించారు. ఆ గదుల్లోకి పొరపాటున కూడా సూర్యుడు తొంగిచూడడు. పాతగాలి పోదు, కొత్తగాలి రాదు. వీళ్ళకు జలుబుచేసింది. ఊపిరాడలా, గొంతెత్తి అరిచారు. వీళ్ళ అరుపులు ఆ గదుల్లో మాటుమణిగిపోయాయి.

వాళ్ళు 'కూడు' తెచ్చారు వీళ్ళకు. వీళ్లుచూసి "ఈ చిప్పకూడు మాకక్కర్లా. ఇది గొడ్లుకూడా తినవు" అన్నారు. వాళ్ళు "మీముఖాలకు ఇదే పదివేలం"టూ ఎగతాళి చేశారు. వీళ్ళు తినలేకపోయారు, వాళ్ళు "ఇదికూడా మీకు దక్కనివ్వమ"న్నారు. వీళ్లు ఆకలేసి కేకలేశారు, కాని ఆ కేకలు ఆ చీకటి గదుల్లో కలిసిపోయాయి.

వీళ్ళను రోజంతా గదుల్లోనే వుంచేవాళ్లు. వీళ్ళడిగారు "కనీసం ఒంటేలుకు, రెండేళ్లకుకూడా మమ్మల్ని పోనివ్వరా?" వాళ్లన్నారు "తలకో మట్టిముంతివ్వాంగా? భగవంతుని సృష్టిలో ఈ మట్టిముంతే ఉత్కృష్టమయింది. కాని మీరు నికృష్టులు" వీళ్ల డిగారు "ఆ మట్టిముంతలు వారానికోసారికూడా పారబొయ్యరు" వీళ్లకేక లాఠీలకి కూపాల్లో మునిగిపోయాయి.

ఓరోజు వీళ్ళల్లో ఒకడికి బాగా ఉష్ణం వచ్చింది. "మా అమ్మకు బరువుగా వుందట. ఆమెను కడసారి చూడనివ్వండ"ని అడిగాడు. వాళ్ళన్నారు "నిన్నుపోనివ్వం, ఆమెను రానివ్వం" వీడు నిరాశతో మూల్గాడు. కాని ఆ రాతిగోడలు ఆ మూల్గును భద్రంగా నొక్కేసి బయటకు వినిపించకుండా చేశాయి.

వీళ్లు వాళ్ళు ఎవరని మీరు అబ్బురపడవచ్చు. వీళ్లు క్రిష్టియన్ బానిసలు కావచ్చు; వాళ్లు రోమన్ యజమానులు కావచ్చు. వీళ్లు నిర్భాగ్యపు యూదులుకావచ్చు; వాళ్లు నాజీ నరహంతకులు కావచ్చు.

ఇక్కడ వీళ్ళు మరెవరోకాదు. విశాఖపట్నం జైల్లో నక్సలైట్ ఖైదీలు. వాళ్లు జైలు అధికారులు. పరిస్థితి చాలా అధ్వాన్నంగా వుంది. ఇది ఎప్పుడయినా పేలిపో వచ్చు. వీళ్ళకు సానుభూతిగా హైదరాబాద్ జైల్లో ముష్టియుద్ధాలు, ఉపవాసాలు జరుగు తున్నాయి. తిరుపతి ఖైదీలుకూడా వీళ్ళను గురించి ఆందోళన చెందుతున్నారు. వీళ్లకు గుండెలుంటే వాళ్లకు గుళ్లున్నాయి. వీళ్ళ గుండెలకు ఎప్పుడు గుళ్లెక్కు పెడదామా అని ఉబలాటపడుతున్నారు వాళ్ళు. అలాంటిది జరిగితే ఈ నక్సలైట్ కే సువిచారణ తంతు సమసిపోతుంది.

వీళ్ళను కోర్టుకు తీసుకురావడం వాళ్లకు పెద్ద కష్టమేమీగాదు. నాలుగువైపుల మూసేసి, పోలీసు కారుల్లో ఊరుచుట్టూ తిప్పి కోర్టుకు తీసుకొస్తారు. ఈ నక్సలైట్ కోర్టు భారతదేశం తూర్పు తీరాన బంగాళాఖాతాన్ని అనుకునేవుంది. అక్కడికి జనం అంతగారారు. విచారణ చూడ్డానికి వచ్చిన కొద్దిమందిని చిత్రగుప్తుని చిట్టాల్లోకి ఎక్కి స్తారు. తరవాత యమబాధలు పెడతారు. అందుకని ఈ నక్సలైట్ ఖైదీల అరుపులు, కేకలు, నినాదాలు, పాటలు, పద్యాలు అన్నింటికి సముద్రపు హోరుగాలే ఉపశృతి. అసలు ఈ నక్సలైట్ కోర్టుని నడిసముద్రంలో లంగరేసిన ఓడలోపెడితే బాగుంటుంది. అప్పుడు వీళ్ళకేకలు ఎవరి చెవిని సోకవు.

వాళ్లు అంతపని చేయగలరు. వీళ్ళంటే చెడ్డచిరాకు. గొప్ప తలనొప్పి, అసలు వీళ్లను లేకుండా చేస్తే— అంటే హతమారిస్తే? కోర్టు విచారణ, ఈ బెడదలేవుండవు. అది మరీమంచిది.

—శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

(FRONTIER = H. (6-11-71) సౌజన్యంతో, తర్జుమా చలసాని ప్రసాద్)

1. జీవితం–రచన
గోర్కీ, టింగ్‌లింగ్, సార్త్ర సృజన ప్రచురణలు 60 పైసలు
2. భావవిప్లవం
కె. వి. రమణారెడ్డి .. 40 పైసలు
3. విప్లవ దృక్పథం సమర్పణ
రెజిడెబ్రె భావాలు కె. నరసింహారెడ్డి 75 పైసలు
4. ఎరుపు
సుబ్బారావు పాణిగ్రాహి విరసం ప్రచురణ 1 రూపాయి
5. రెక్కవిప్పిన రెవల్యూషన్ ఉద్యమ సాహితి
శ్రీ శ్రీ కరీంనగర్ 2 రూపాయలు
6. విప్లవం వర్ధిల్లాలి బాలాజీ పబ్లిషర్స్
కవితా సంకలనం తిరుపతి 150 పైసలు
7. లే. కవితా సంకలనం ..
రెండో ముద్రణ 150 పైసలు

ప్రస్తుతం మా దగ్గర పైన పేర్కొన్న పుస్తకాలు మాత్రమే దొరుకుతాయని గమనించ వలసిందిగా పాఠకులను కోరుతున్నం. ఇవిగాక యితర పుస్తకాల కొరకు డబ్బు పంపించవద్దని మనవి.

కాపీలకు :

సృజన

హనుమకొండ, వరంగల్–1. (ఆం. ప్ర.)